అసోం సీఎం నిర్వాకం !

ఖజానా ఖర్చుతో పార్టీ ప్రచారం

10లో..

- హెలికాప్టర్లు, విమానాల్లో విహారం
- వివాహాలకూ సర్కారు సొమ్ముతోనే ప్రయాణం



కలహాల కాపురం...!

బీహార్‌లో జేడీయూ, బీజేపీ మధ్య మొదలైన విభేదాలు

- పెద్దన్న పాత్ర కోసం కమలదళం ఆరాటం
- బింకం వదలని నితీశ్
- ఆలస్యమవుతున్న క్యాబినెట్ విస్తరణ
- వాయిదా పడిన బలపరీక్ష

3లో..



అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 4-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 344 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | వెల : 8.00 | 12 పేజీలు + (వెబ్‌లో సోపతి)




ఓ వర్గం నిర్వీర్యమే దీని లక్ష్యం

సీఏఏను వ్యతిరేకిస్తున్నాం

ఇప్పటికీ అదే వైఖరితో ఉన్నాం : కేరళ సీఎం పినరయి విజయన్

తిరువనంతపురం : మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్ప పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) అమలును కేరళ ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నదనీ, ఈ వైఖరికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నదని ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ స్పష్టం చేశారు. దేశాభిమాని సాహిత్య అవార్డుల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక వర్గాన్ని నిర్వీర్యం చేయటమే సీఏఏ లక్ష్యమన్నారు. "సీఏఏను త్వరలో అమలు చేస్తారన్న వార్తను మేము వింటున్నాం. దీని (సీఏఏ) అమలు కేరళలో జరగదని మేము అప్పట్లోనే చెప్పాం. ఇప్పటికీ ఎల్డీఎఫ్ ప్రభుత్వ వైఖరి ఇదే" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. లౌకిక దేశాన్ని మతతత్వ దేశంగా మార్చే ప్రయత్నాలు బలంగానే జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సీఏఏ అమలును ఎవరూ ఆపలేరని గతేడాది డిసెంబర్‌లో కేంద్ర హౌం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే.

ఎల్‌కె అద్వానీకి భారతరత్న



న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్ కె అద్వానీకి ప్రతిష్మాత్మకమైన భారతరత్న అవార్డు లభించింది. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'అద్వానీకి భారతరత్న దక్కడం సంతోషంగా ఉంది. ఆయనతో మాట్లాడి నేను అభినందనలు తెలిపా. అట్టడుగు స్థాయి నుంచి ఉప ప్రధాని వరకు ఈ దేశాభివృద్ధిలో ఆయన పాత్ర కీలకం' అని మోడీ పేర్కొన్నారు. కరాచీలో 1927 నవంబర్ 8న అద్వానీ జన్మించారు. దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం ముంబయికి వలస వచ్చింది. అద్వానీ 1941లో ...11లో

లోక్‌సభ ఎన్నికల వేళ రసవత్తరంగా రాష్ట్ర రాజకీయం

కాంగ్రెస్ వైపు నేతల చూపు



గుంభనంగా హస్తం పార్టీ వ్యూహాలు

- తాజాగా కారు దిగిన తాటికొండ
- అదే బాటలో మరికొందరు సీనియర్లు
- ఆపేందుకు బీఆర్ఎస్ యత్నాలు
- పార్టీకి జవసత్వాలు నింపే పనిలో గులాబీ బాస్

పైకి ప్రశాంతంగా, ఏమీ జరగనట్టుగా ఉన్నా... రాష్ట్ర రాజకీయాల్లో లోలోపల ఏదో జరుగుతున్న అలజడి. ఆర్భాటం, హడావుడి, హంగామా లాంటివి ఎక్కడా కనబడకున్నా.. చాపకింద నీరులా నేతలు తమ 'రాజకీయ భవిష్యత్' గురించి పక్కాగా ప్రణాళికలేసుకుని ముందుకు సాగుతున్నారు. ఇప్పటికిప్పుడు కాకపోయినా లోక్‌సభ ఎన్నికల సమయం లోనైనా, ఆ తర్వాతైనా గోడ దూకేందుకు వీలుగా మార్గం సుగమం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రస్తుత తాజా రాజకీయ పరిస్థితి ఇది. పదేండ్ల తర్వాత అధికారాన్ని చేజిక్కించుకుని కాంగ్రెస్ జోరు మీదుండగా, అదే పవర్‌ను కోల్పోవటంతో నాయకులు, కార్యకర్తలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తీవ్రంగా శ్రమిస్తోంది. అయితే పదవులు, సీట్లను ఆశిస్తున్న నేతలు మాత్రం కాంగ్రెస్ తమ ఇంటి వైపునకు ఇప్పుడే రావద్దన్నా.. బీఆర్ఎస్ గోడదూకి పోవద్దన్నా... మాట వినేట్టు లేరు. హస్తం పార్టీ వద్దన్నా.. గులాబీ పార్టీ గట్టిగా పట్టుకున్నా, ఆగేదే లేదు, తగ్గేది అంతకంటే లేదు, కచ్చితంగా పార్టీ మారాల్సిందే, అధికార పార్టీ పంచన చేరాల్సిందే అనే రీతిలో వారు వ్యవహరిస్తుండటం గమనార్హం.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత కొద్ది రోజులుగా సీఎం రేవంత్‌ను పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు కలుస్తుండటం చర్చనీయాంశమవుతోంది. ప్రజల తరపున వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎంను ఎవరు కలిసినా తప్పు ఉండదు. కానీ త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది, మళ్లీ బీఆర్ఎస్సే అధికారం లోకి వస్తుందంటూ గులాబీ పార్టీ నేతలు వ్యాఖ్యానించిన నేపథ్యంలో...అధికార పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందనే వాదనలు వినబడుతున్నాయి. ఆ క్రమంలోనే వారానికి కొద్ది మంది చొప్పున బీఆర్ఎస్ నేతలు సీఎంను కలుస్తున్నారనే అభిప్రా యాలు కూడా వస్తున్నాయి. దీంతోపాటు కాంగ్రెస్ ఉచ్చులో పడొద్దంటూ తమ పార్టీ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలకు, ముఖ్యంగా కొత్తగా ఎన్నికైన వారిని బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ హెచ్చరించటం ఈ వాదలనకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. హైదరా బాద్ కేంద్రంగా ఇలాంటి పరిణా మాలు ...11లో

వీరి దారెటు..?

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య తాజాగా కారు దిగి.. కాంగ్రెస్ కండువా కప్పుకునేం దుకు రెడీ అవటంతో పరిస్థితి మరింత రసకందాయంలో పడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గులాబీ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన ఆయనకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టిక్కెటివ్వలేదు. ఇప్పుడు రాజయ్య వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయాలని భావించి, ఆ మేరకు హస్తం గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇదే రకంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి తదితరులు కూడా అధికార పార్టీ వైపు చూస్తున్నారనే గుసగుసలు వినబడుతు న్నాయి. వీరితోపాటు హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూడా శనివారం సీఎం రేవంత్‌తో ఆయన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఆమె తండ్రి కే.కేశవరావు మాజీ పీసీసీ అధ్యక్షుడు కావటం, ఆయనకు కాంగ్రెస్ జాతీయ నేతలతో సైతం విస్తృతమైన సంబంధాలు ఉండటంతో విజయలక్ష్మి కూడా హస్తం గూటికి చేరతారా..? అనే చర్చ మొదలైంది. అయితే ఆమె మాత్రం ఈ విషయాన్ని కొట్టిపారేశారు. మేయర్ హోదాలో అధికారికంగా మాత్రమే తాను ముఖ్యమంత్రిని కలిశాననీ, ఇందులో ఎలాంటి రాజకీయ కారణాల్లేవని వివరణిచ్చారు. 'ప్రజా సమస్యలపై సీఎంను గానీ, మంత్రులను గానీ కలవాలనుకుంటే ప్రజల సమక్షంలోనే వారికి వినతిపత్రాలు ఇవ్వండి...' అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించిన 24 గంటల్లోనే విజయలక్ష్మి.. సీఎంతో ప్రత్యేకంగా భేటీ కావటం గమనార్హం.

వాడి వేడిగా ధరణి కమిటీ భేటి

వక్ఫ్, దేవాదాయ భూములపైనా సమీక్ష

- అన్యాక్రాంతమైన వాటి వివరాలు తెలుసుకున్న కమిటీ
- క్షేత్రస్థాయిలో రక్షణ చర్యలపై ఆరా
- మరోసారి భేటీకి నిర్ణయం

నవ తెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ధరణి కమిటీ సమావేశం వాడి వేడిగా జరిగింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం దేవాదాయ, వక్ఫ్ , ల్యాండ్ సర్వే రికార్డుల విభాగాలతో భూసమస్యలపై కమిటీ చర్చించింది. దేవాదాయ భూముల వివరాలు తెలుసుకునే క్రమంలో సంబంధిత అధికారులపై కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎండోమెంట్ శాఖ ఆధీనంలో రికార్డుల ప్రకారం ఎంత భూమి ఉంది? ఎన్ని వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి? ప్రధానంగా ఎదురవుతున్న సమస్యలేంటి? ఆలయాల ఆస్తులను కాపాడేందుకు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న రక్షణ చర్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దేవాదాయ భూముల రక్షణకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ తీసుకుంటున్న చర్యలపై ఈ సందర్భంగా వారు ఆరా తీశారు. ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత ఆలయ భూములకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలపై అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు.

వక్ఫ్ భూములపై ఆరా

ధరణి పోర్టల్ వల్ల వక్ఫ్ భూములకు ఎదురవుతున్న సమస్యలను కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. వక్ఫ్ బోర్డ్ రికార్డుల ప్రకారం ఎంత భూమి ఉంది ? ప్రస్తుతం ఆధీనంలో ఎంత భూమి ఉంది. అందులో ఎన్ని వేల ఎకరాల భూములు ఆక్రమణలకు గురయ్యాయి? క్షేత్రస్థాయిలో వాటి రక్షణకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు.? తదితర అంశాలపై చర్చించారు. భూముల రక్షణకు మరే ఇతర చర్యలు తీసుకోవాల్సి ఉందనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.

నక్ష, పహాని రికార్డులపై సమీక్ష

సర్వే , సెటిల్మెంట్ విభాగంతో నక్ష, పహాని రికార్డులపై కమిటీ సమీక్షించింది. ఏ ఏ రికార్డులను నిర్వహిస్తున్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని ఖాసర పహానీలు, సెస్లా పహానీల రికార్డుల నిర్వహణ ఏ విధంగా చేస్తున్నారు? ఈ పత్రాలను ధరణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారా? తదితర వివరాలను ఆరా తీశారు. భూ భారతి ప్రోగ్రామ్, ల్యాండ్ పార్శిల్ మ్యాపులకు ధరణి పోర్టల్‌లో ఉన్న మ్యాప్‌లకు తేడాలు, ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. సబ్‌డివిజన్ రికార్డుల నిర్వహణలో రైతులు ఫిర్యాదుదారులతో సర్వే సెటిల్ మెంట్ శాఖ ఎలా వ్యవహరిస్తున్నదో అడిగి తెలుసుకున్నారు. అయితే సమస్యలు చాలా ఏండ్లుగా పెండింగ్ లో ...11లో

బీఆర్ఎస్‌ను వీడిన తాటికొండ

కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధం..?

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య బీఆర్ఎస్‌ను వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు శనివారం ప్రకటించారు. కాగా, ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాజీనామా లేఖను చూపించారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా బీఆర్ఎస్ పార్టీలో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నట్టు, పార్టీలో తనకు సరైన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరానని గుర్తుచేసుకన్నారు. డిప్యూటీ సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేసినా పార్టీకి విధేయుడిగానే ఉన్నానని, ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ టికెట్ ఇవ్వకపోయినా, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు పనిచేశానని తెలిపారు. ఓడిపోయిన అనంతరం కూడా బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని వ్యాఖ్యలు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఎలా పడిపోతుంది.. అంటే ప్రభుత్వాన్ని పడగొట్టడమంటే అప్రజాస్వామికంగా పడగొడతారనేది అర్థమవుతుందన్నారు. వాస్తవంగా పార్టీలో తమ అభిప్రాయాలు చెప్పడానికి పార్టీ అధినాయకత్వాన్ని కలిసే అవకాశమూ దక్కడం లేదని వాపోయారు. నియోజకవర్గంలో తీవ్ర అవమానాలను ఎదుర్కొన్నానని చెప్పారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వకుండా పార్లమెంటు టికెట్ ఇస్తామని చెప్పారని, పార్టీలో నాకు సరైన గుర్తింపు లేకుండాపోయిందన్నారు. మనోవేదనతోనే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతారా.. అని మీడియా అడిగిన ప్రశ్నకు నా అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. కాగా, ఈ నెల 10వ తేదీన కాంగ్రెస్ పార్టీలో చేసే అవకాశం ఉన్నట్టు జిల్లాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.

బడా కార్పొరేట్‌లకు రవాణా రంగాన్ని

తాకట్టు పెట్టే కుట్ర

జాతీయ రహదారుల నిర్మాణ లోపాలతో ప్రమాదాలు

- ఫిబ్రవరి 16 దేశవ్యాప్త సమ్మెకు సన్నద్ధమవుతున్న ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు
- 'నవతెలంగాణ'తో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య



దేశ ప్రధాని నరేంద్ర మోడీ బడా కార్పొరేట్ కంపెనీలకు రవాణా రంగాన్ని తాకట్టు పెట్టే కుట్ర చేస్తున్నారని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆలిండియా ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య విమర్శించారు. శనివారం హన్మకొండలో సీఐటీయూ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆర్ లక్ష్మయ్య రవాణా రంగంలో 100కు 90 శాతం మంది అసంఘటిత రంగ కార్మికులే ఉన్నారన్నారు. కేంద్రం తీసుకువచ్చిన ఎంవీ యాక్ట్‌లోని 'భారతీయ న్యాయ సంహిత' అంశంపై పరస్పర భిన్నమైన వాదనలను ఆయన బహిర్గతం చేయడంతో పాటు ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు ట్రాన్స్‌పోర్టు కార్మికులు సన్నద్ధమవుతున్న తీరుపై నవతెలంగాణతో మాట్లాడారు.

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఇటీవల భారీ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటికి కారణాలు ఏమిటీ ?

జాతీయ రహదారుల నిర్మాణంలో అనేక లోపాలు చోటు చేసుకున్నాయి. ఈ లోపాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఈ నిర్మాణ లోపాలను వెంటనే గుర్తించి సరిదిద్దాలి. నియమ, నిబంధనలకు విరుద్ధంగా రహదారులను నిర్మించిన గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలి. గతంలో ఎంపీ ఎర్రన్నాయుడు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. ఆ ప్రాంతంలో హైవేపై 'యూ' టర్న్ పెట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. అదేవిధంగా ఏపీలోని కృష్ణా జిల్లాలో బస్సు తగులబడి 60 మంది సజీవ దహనమయ్యారు. ఇక్కడ హైవే ఇరుగ్గా ఉండి హైవే గోడ నుంచి ఇనుప చువ్వలు బయటకు ఉండటం, బస్సు డీజిల్ ట్యాంకర్ ఆ ఇనుప చువ్వలకు గుద్దుకొని బస్సు తగులబడింది. ఈ విషయం నాటి ఐపీఎస్ అధికారి కృష్ణప్రసాద్ విచారణలో బహిర్గతమైంది. అయినా ఈ రహదారిని నిర్మించిన ఎల్ అండ్ టీ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు. భారీ వాహనాల డ్రైవర్లు సుదీర్ఘంగా ట్రక్‌లను విశ్రాంతి లేకుండా నడిపించడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయన్న వాస్తవాన్ని ప్రధాని మోడీ 'గ్లోబల్ మొబిలిటీ ఎక్స్‌పో'లో మాట్లాడిన మాటలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కానీ, నేషనల్ పర్మిట్ వాహనాల్లో గతంలో ఇద్దరు డ్రైవర్లు ఉండాలనే నిబంధన ఉండగా, ఆ నిబంధన తొలగించి ఒకే డ్రైవర్ ఉండాలని చట్టం చేసిందే ప్రధాని మోడీ అని తెలిపారు. ఇదంతా రవాణా రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసి బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టపెట్టే ప్రయత్నంలో భాగమేనని అన్నారు.

ఎంవీ యాక్ట్‌లో కేంద్ర ప్రభుత్వం చేసిన సవరణలు ఏమిటి?

ఎంవీ యాక్టు 2019లో కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. పదేండ్లు దాటిన వాహనాలను స్క్రాప్‌కు తరలించాలని పేర్కొన్నారు. తాజాగా ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని చెబుతున్నారు. ఈ ...11లో

బీజేపీని ఆపగలిగేది

ప్రాంతీయ పార్టీలే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి వల్లనే ఇండియా కూటమి చెల్లాచెదురు అవుతున్నదనీ, కాంగ్రెస్ పార్టీ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో బీజేపీతో నేరుగా పోటీ పడాల్సి ఉన్న కాంగ్రెస్, ఆ రాష్ట్రాలను వదిలిపెట్టి ఇతర రాష్ట్రాల్లో ఇతర పార్టీలతో పోటీ పడుతుందన్నారు. దీంతో బీజేపీకి లాభం చేకూరుతుందన్నారు. ఇండియా కూటమిలోని పార్టీల గెలుపు అవకాశాలను దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని తెలిపారు. నిజానికి బీజేపీని ఆపగలిగే శక్తి కేవలం బలమైన ప్రాంతీయ రాజకీయ శక్తులకే ఉన్నదనీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, స్టాలిన్, కేసీఆర్ వంటి బలమైన నాయకులే దేశంలో బీజేపీని అడ్డుకోగలరని తెలిపారు. బీజేపీకి కాంగ్రెస్ ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదని విమర్శించారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం

ఎంపీ నిధుల పనులపై ఫోకస్

- ఈవీఎంల తనిఖీ షురూ..
- అభివృద్ధి పనుల పూర్తికి ప్లానింగ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

లోక్‌సభ ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. మరికొద్ది రోజుల్లో ఈసీ నుంచి అధికార ప్రకటన వెలువడనున్న నేపథ్యంలో అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఓసారి సమీక్షా సమావేశం జరగ్గా.. రెండ్రోజుల కిందట అసెంబ్లీ ఎన్నికల కోసం వినియోగించిన ఈవీఎం మిషన్ల పరిశీలన సైతం మొదలైంది. పెండింగ్ పనులను మార్చి 31వ తేదీలోపు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఒక్క 'మల్కాజిగిరి' పార్లమెంట్ సెగ్మెంట్ మాత్రమే ఉంది. ఈ సెగ్మెంట్ ఇండియాలోనే అతి పెద్దది. దీన్ని మినీ భారత్‌గా కూడా పిలుస్తారు. ఈ సెగ్మెంట్ పరిధిలో 40 లక్షల మంది వరకు ఓటర్లు ఉంటారు. ఈ సెగ్మెంట్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మల్కాజిగిరి, మేడ్చల్, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ఐదు నియోజకవర్గాలతో పాటు రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎల్బీనగర్, హైదరాబాద్ జిల్లా పరిధిలోని కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంతో ముడిపడి ఉంది. ఎప్పుడైనా పార్లమెంట్ ఎన్నికలను నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అధికారులు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు సిద్ధమయ్యారు. పెండింగ్ పనులపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. కాగా ఎల్బీనగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఎంపీ నిధుల తో చేపట్టిన పనుల పురోగతిపై సమావేశం జరగాల్సి ఉంది.

ఎంపీ నిధులపై ఫోకస్

మల్కాజిగిరి ఎంపీ నిధులపై ఫోకస్ చేశారు. ఈ విషయంపై రెండ్రోజుల కిందట జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి ...11లో

లేహ, కార్గిల్ జిల్లాల్లో బంద్

లడక్‌కు రాష్ట్ర హోదా ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్

- వేలాదిమందితో భారీ ప్రదర్శనలు



లడఖ్ : జమ్ముకాశ్మీర్‌లోని లడఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలని, ఆరోషెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ లేహ, కార్గిల్ జిల్లాల్లో శనివారం వేలాదిమంది ఆందోళనకారులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ఆ రెండు జిల్లాల్లోనూ సంపూర్ణంగా బంద్ నిర్వహించారు. జమ్ముకాశ్మీర్‌కు ఆర్టికల్ 370ను రద్దు చేయడంతో తలెత్తిన మార్పులను వ్యతిరేకిస్తూ లేహ అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కెడిఎ) పిలుపు మేరకు బంద్ నిర్వహించారు. జమ్ము కాశ్మీర్ నుంచి వేరుచేసిన తర్వాత లడఖ్ ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పించాలని డిమాండ్ ...11లో

నిరుద్యోగ జాతర



ఖమ్మంలో మెగా జాబ్‌మేళాకు పోటెత్తిన యువత

- సున్నా నుంచి పీజీ వరకు అర్హతతో నిర్వహణ
- 5వేల ఉద్యోగాలకు 11,530 మంది రిజిస్ట్రేషన్
- రూ.10వేల నుంచి రూ.50వేల వేతనంతో నియామకం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం నిరుద్యోగ జాతర జరిగింది. తెలంగాణ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రమోషన్ (టీఎస్- స్టెప్) సౌజన్యంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు భారీగా అభ్యర్థులు తరలి వచ్చారు. 65కు పైగా కంపెనీలు 5,000 ఉద్యోగాల కోసం నిర్వహించిన ఈ మేళా కోసం 11,530 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అధికారి తుంబూరు సునీల్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారికొండపల్లి శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాను జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి మొదలైన మెగా జాబ్‌మేళా సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సున్నా నుంచి పీజీ వరకు విద్యార్హతలున్న 18-35 ఏళ్ల యువతీ యువకులను ఈ మేళాకు ఆహ్వానించారు.

కిటకిటలాడిన మేళా ప్రాంగణం..

నిరుద్యోగ యువత భారీగా తరలిరావడంతో మేళా ప్రాంగణం కిటకిటలాడింది. ఎటుచూసినా అభ్యర్థుల హడావుడే కనిపించింది. రెస్యూమ్‌లు, ఇతరత్ర సర్టిఫికెట్ల జిరాక్స్‌ల కోసం సంబంధిత సెంటర్లకు అభ్యర్థులు పోటెత్తారు. ఒక్కొక్కరు ఐదారు జాబ్‌లకు అప్లై చేశారు. ఖమ్మం లోకల్‌లో సుమారు 500 ఉద్యోగావకాశాలు కల్పించారు. రూ.10వేల నుంచి రూ.80వేల వేతనం ఉన్న ఈ జాబ్‌ల కోసం నిరుద్యోగులు పోటీ పడ్డారు. 40వేలకు పైన శాలరీ ఉన్న సుమారు 500 జాబ్‌లకు, రూ.25వేల నుంచి రూ.45 వేల మధ్యలో మూడు వేల ఉద్యోగాలకు ఈ మేళాలో అవకాశం కల్పించారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, రిటైల్, ఫార్మసీ, బ్యాంకింగ్ సెక్టార్లలో ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థులందరూ ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

అనంతరం తమ రిస్యూమ్‌లతో కంపెనీల స్టాల్స్ వద్దకు వెళ్లారు. ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌లు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కాగా, వివిధ కంపెనీలకు 1122 మంది యువత ఎంపికయ్యారు. 2,698 మంది షార్ట్‌లిస్టెడ్ అయినట్లు టీఎస్ స్టెప్ మేనేజర్ జగన్నాథ్ తెలిపారు. అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి జాబ్స్, ట్రెనింగ్‌కు ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఖమ్మం, హైదరాబాద్, విజయవాడ, వరంగల్, తెలంగాణలోని వివిధ జిల్లాల కేంద్రాలు, పట్టణాలు, ప్రాంతాలు, పాన్ ఇండియా వ్యాప్తంగానూ ఈ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ డీడీ కె.సత్యనారాయణ ఉన్నారు.



నామినేటెడ్‌పై ఆశలు..!

- రాష్ట్ర, జిల్లా స్థాయి పోస్టులపై పలువురి దృష్టి
- సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఆశావహులు
- లోక్‌సభ ఎన్నికల తర్వాతే భర్తీకి యోచన

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడం.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొలువుదీరిన కొన్ని రోజులకే నామినేటెడ్ పదవులన్నింటినీ రద్దు చేసింది. వీటి స్థానంలో కొత్త వారిని నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ఈ పోస్టులను దక్కించుకునేందుకు అనేక మంది ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులు అనేకం ఉండటంతో అందరి దృష్టి వీటిపైనే కేంద్రీకృతమవుతోంది. ఇది వరకు కాంగ్రెస్‌లో అసెంబ్లీ టికెట్లు ఆశించి భంగపడిన వారితోపాటు సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న నాయకులు వీటిపై కన్నేసినట్టు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మెన్ పోస్టులను దక్కించుకోవాలని కీలక నాయకులు భావిస్తుండగా.. జిల్లా స్థాయి పోస్టులపై ద్వితీయ శ్రేణి నేతలు ఆశలు పెట్టుకున్నారు. కానీ మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా వీటి తర్వాతే నామినేటెడ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తుందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం కొలువు దీరింది. ఆ సమయంలో అసెంబ్లీ టికెట్లు ఆశించి దక్కనివారితో పాటు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారు, మంత్రులు, ఎమ్మెల్యేలకు సన్నిహితులుగా మెలిగిన వారికి రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేట్ పోస్టులు దక్కాయి. పదేండ్లుగా రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ ఇటీవలి ఎన్నికల్లో మెజార్టీ అసెంబ్లీ సీట్లు సాధించి అధికారంలోకి వచ్చింది. దీంతో అనేక ఏండ్లుగా కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా ఉంటూ ప్రతిపక్ష పాత్రలో కార్యకర్తలకు తోడుగా నిలిచిన అనేక మంది జిల్లా స్థాయి, ద్వితీయ శ్రేణి నేతలు నామినేటెడ్ పోస్టులను దక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. ఇందులో అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఆశించి దక్కనివారితో పాటు ఏండ్లుగా పార్టీ జెండా మోస్తూ.. క్రియాశీలకంగా పనిచేస్తున్న వారు కూడా ఉన్నారు. మరికొన్ని చోట్ల సీనియర్ నాయకులుగా ఉండి అసెంబ్లీకి పోటీ చేసేందుకు రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులను దక్కించుకోవాలని భావిస్తున్నారు.



లోక్‌సభ తర్వాతే భర్తీ..!

ప్రభుత్వం రాష్ట్రంలోని నామినేటెడ్ పదవులను రద్దు చేసింది. రాష్ట్రంలో 90కార్పొరేషన్లు ఉండగా వీటిలో కొన్ని మినహా అన్నింటినీ రద్దు చేసింది. ఇక జిల్లా స్థాయిలో ఉండే గ్రంథాలయ చైర్మెన్‌తో పాటు మార్కెట్ కమిటీ పదవులు కూడా కీలకంగా ఉంటాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు గ్రంథాలయ చైర్మెన్ పదవులు రద్దు కాగా.. 18మార్కెట్ కమిటీల్లో ఇప్పటికే 10కమిటీలను ప్రభుత్వం రద్దు చేసింది.

మిగితావి కూడా త్వరలో రద్దయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో ఉమ్మడి జిల్లాకు డెయిరీ, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవులు దక్కిన సందర్భాలున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అటవీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి కూడా జిల్లాకు వచ్చింది. తాజాగా కొందరు కీలక నాయకులు రాష్ట్ర స్థాయి పదవులపై కన్నేయగా.. ద్వితీయ శ్రేణి నేతలు గ్రంథాలయ, మార్కెట్ కమిటీలను దక్కించుకోవడంపై దృష్టిసారిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న చోట్ల వారిని ప్రసన్నం చేసుకోవడంతో పాటు ఎమ్మెల్యేలు లేని చోట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలుస్తూ ఈ పదవులు కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో నూ సత్తా చాటాలని భావిస్తోంది. ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించి లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది.

ఈ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తోంది. పార్టీ అధిష్టానంతో పాటు ముఖ్య నేతలందరూ వీటిపైనే ప్రధానంగా దృష్టిసారించారు. దీంతో లోక్‌సభ ఎన్నికల తర్వాతే రాష్ట్రంలో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారని తెలిసింది. ఆశావహులు ఎన్నికలు ముగిసే వరకు ఓపికతో ఉండాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ మాయలో పడ్డారు

- హామీలు నెరవేర్చకుంటే ప్రజా ఉద్యమాలు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మారని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అదే హైదరాబాదీ ఓటర్లు తెలివిగా అభివృద్ధికి ఓటేశారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల ను నెరవేర్చకుంటే ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమాలు చేపడుతా మన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని ఎస్.కే.ఎస్.ఆర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. ఉచిత బస్ పథకానికి తాము వ్యతి రేకం కాదని, కానీ సరైనన్ని బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణి కులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఫ్రీ బస్ పథకం వల్ల ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటి వరకు 16 మంది ఆత్మహత్య చేసుకున్నారని, ఆటో డ్రైవర్లకు ప్రతి నెలా రూ.పదివేల సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించా లంటే రానున్న ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి నోరు పారేసుకుంటు న్నారన్నారని, తమకూ నోరు ఉందని.. వంద రోజుల వరకు ఓపిక పడతామని అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజక వర్గంలో భారీ మెజారిటీతో తాను గెలిచానంటే దానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమమే ముఖ్య కారణమన్నారు. ఎంతో నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలు అండగా ఉన్నారని, వారిని ఎప్పటికీ మర్చి పోనని అన్నారు. ఎంతో విజన్ ఉన్న నాయకుడు కేటీఆర్ అని, భవిష్యత్‌లో కాబోయే ముఖ్యమంత్రి ఆయనేనని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి గతంలో పదవుల పంపకం విషయంలో కొంత అన్యాయం జరిగిందని, భవిష్యత్‌లో నియోజకవర్గానికి పెద్దపీట వేయాలని కోరగా.. కేటీఆర్ సాను కూలంగా స్పందించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు శంబీపూర్ రాజు, కూక ట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనానికొచ్చిన వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

దుకాణంపై ఉన్న స్క్రాబ్ వస్తువుల ను దొంగిలించడానికి వచ్చిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద శంకరంపేటకు చెందిన కడమంచి రమేష్ (20) శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తాగిన మైకంలో గడికోట శివారులో ఉన్న కిరాణం దుకాణంపైకి ఎక్కాడు. రమేష్‌కు విద్యుత్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దుకాణంపై వేసిన స్క్రాబ్ వస్తువులను దొంగిలించడానికే రమేష్ దుకాణంపైకి ఎక్కి ఉంటాడని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ బాలరాజ్, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. మృతుని తండ్రి కడమంచి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏడు మండలాలను ఏపీలో కలిపిన పాపం కాంగ్రెస్, బీజేపీలదే..

భద్రాచలం ప్రజలు విజ్ఞతతో ఆలోచించి తెల్లంను గెలిపించారు : బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు





భద్రాద్రి రామయ్యను సందర్శన

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రాష్ట్ర విభజన సమయంలో ఏడు మండలాలను పోలవరానికి బలి చేసి ఏపీలో కలిపిన పాపం కాంగ్రెస్, బీజేపీలకు తగులుతుందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కరకట్ట ఎత్తు పెంచేం దుకు కేసీఆర్ రూ.39 కోట్లను మంజూరు చేస్తే ఆ పనులను చేపట్టకుండా మరోసారి భద్రాద్రి రామయ్య ను ముంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనుకుంటు ందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్ని కల సన్నాహక సమావేశాలల్లో భాగంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు అధ్యక్షతన పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన భద్రాచలం నియోజకవర్గస్థాయి సమావేశంలో తన్నీరు హరీశ్ రావు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 420 మోసపూరిత వాగ్దానాలను చేసి అధికారంలోకి వచ్చి ందని, 50 రోజుల్లోనే ప్రజలు వారి మోసాన్ని గుర్తిం చారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ సాధించకపోతే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవాడా అని ప్రశ్నించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో కేసీఆర్ అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ పార్టీ అధోగతి పాలు చేస్తోందని, దానికి ప్రత్యక్ష నిదర్శనమే కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తెల్లారి నుండే కరెంటు కోతలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచల నియోజకవర్గ ప్రజలు ఎంతో విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్ పార్టీని గెలిపించారని అదే స్ఫూర్తితో కార్యకర్తలు పనిచేసి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అత్యధిక మెజార్టీని కట్టబెట్టాలని కోరారు. కృష్ణా బోర్డుని కేంద్రం పరిధిలోకి అనుమతి ంచటం అంటే రాష్ట్ర ప్రయోజనాన్ని కేంద్రం వద్ద తనఖా పెట్టడ మేనన్న విషయాన్ని ప్రజలు గుర్తించా లన్నారు. ఎంపీ కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏక పక్ష నిర్ణయాలతోనే ఇండియా కూటమిలో చీలికలు మొదలయ్యా యని, రేవంత్ రెడ్డి కాదు కదా వాళ్ళ అయ్య దిగివచ్చిన రాహుల్ గాంధీని ప్రధాని చేయటం సాధ్య పడే పని కాదని అన్నారు. సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ తాత మధుసూదన్ రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షు లు రేగా కాంతారావు, బీఆర్ఎస్ నాయకులు రావుల పల్లి రాంప్రసాద్, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సాగి శ్రీనివాసరాజు, అరికెల తిరుపతిరావు పాల్గొన్నారు.

సమయ భావం వల్ల భద్రాద్రి సాధ్యపడలేదు

భద్రాచలం వచ్చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ వద్దిరాజ్ రవిచంద్ర, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుతో కలిసి భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రామాలయ అభివృద్ధికి కేసీఆర్ మాస్టర్ ప్లాన్ రచిం చారని, యాదాద్రి అనంతరం భద్రాద్రిని అభివృద్ధి చేయాలన్న ఎజెండా పెట్టుకున్నప్పటికీ ఎన్ని కలు రావడంతో కార్యరూపం దాల్చలేద ని తెలిపారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే భద్రాద్రి రామాలయ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భద్రాచలం కరకట్టతో పాటు మార్కెట్ ఆధునీకరణకు శంకుస్థాపన పను లను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు.

కార్పొరేట్, మతోన్మాద, అవినీతి బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలి

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కార్పొరేట్, మతోన్మాద, అవినీతి బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. హన్మకొండ పట్టణంలో ఫిబ్రవరి 1న ప్రారంభమైన సీఐటీయూ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తపన్ సేన్ మాట్లాడుతూ.. దేశంలో 50కోట్ల మంది పారిశ్రామిక సేవా రంగాల కార్మికులు, వ్యవసాయ రంగంలో 72 కోట్ల మంది రైతు కూలీలు.. మొత్తంగా దేశ జనాభాలో 85శాతం శ్రమజీవులు చెమటోడ్చి ఉత్పత్తిని సృష్టిస్తున్నారని తెలిపారు. కేవలం అంబానీ, అదానీ, టాటా, బిర్లా తదితర 100 కార్పొరేట్ దిగ్గజాల కోసం దేశ మౌలిక రంగాలను కేంద్ర ప్రభుత్వం తాకట్టు పెడుతోందని విమర్శించారు. రైల్వే, రక్షణ, ఆయిల్, గ్యాస్, ఖనిజ, నిక్షేపాలను కారుచౌకగా బీజేపీ ప్రభుత్వం ప్రయివేటీకరిస్తుందని, ఇది దేశ వినాశనానికి దారితీస్తుందని తెలిపారు. బ్యాంకు, ఇన్సూరెన్స్ వాటి ఆర్థిక సంస్థలను పనిరక్షించుకోని అసమర్థ ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ మతోన్మాద భావజాలంతో బావోద్వేగాన్ని రెచ్చగొట్టి దేశంలో అశాంతి, అలజడిని పెంచి 2024 పార్లమెంటు ఎన్నికల్లో లబ్ది పొందాలని బీజేపీ చూస్తోం దని అన్నారు. ప్రధాని మోడీ కార్పొరేట్ సేవలో నిమగ్నమై.. ధరల పెరుగు దల, నిరుద్యోగం దేశంలో విలయ తాండవం చేస్తుంటే ప్రధాని చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికవర్గం ఈ చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వీటన్నింటికి వ్యతిరేకగా ఫిబ్రవరి16న జరిగే కార్మిక, రైతాంగ సమ్మెలో కోట్లాది మంది కార్మిక, కర్షకులు పాల్గొని ప్రతిఘటన చూపాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శులు జే.వెంకటేష్, రాగుల రమేష్, సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ టీ.ఉప్పలయ్య, గాదె ప్రభాకర్ రెడ్డి, మెట్టు రవి, బొల్లారపు సంపత్, యస్.రజిత, పుల్ల అశోక్, గొడుగు వెంకట్‌లతోపాటు వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా హైదరాబాద్ కలెక్టరేట్ నిర్మాణం

పాటిగడ్డ స్థలపరిశీలన

- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది : మంత్రి కోమటిరెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రజల అవసరాలకు సరిపడేలా అధునాతన సౌకర్యాలతో 13 ఎకరాల్లో హైదరాబాద్ కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో హైదరాబాద్ కలెక్టరేట్ నిర్మాణంపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నిర్మాణానికి అనువుగా ఉన్న స్థలాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నూతన కలెక్టరేట్ భవనానికి అనువైన స్థలాలకు సంబంధించిన వివరాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో మంత్రికి వివరించారు.

వీటితోపాటు ప్రస్తుత కలెక్టరేట్‌లో కేవలం ఏడు విభాగాలు మాత్రమే ఉన్నాయనీ, మిగతా 39 శాఖ నగరంలోని ఆయా ప్రాంతాల్లోని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు, ప్రజలు తమ అవసరాల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. అంతేగాక నాంపల్లిలో పాత హైదరాబాద్ కలెక్టరేట్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొంతకాలం క్రితం లక్డీకాపూల్‌లోని పాత రంగారెడ్డి కలెక్టరేట్‌కు తరలించారని మంత్రికి వివరించారు. ఇక్కడ కూడా మెయిన్ రోడ్డులో కలెక్టరేట్ ఉండటం, పార్కింగ్ సౌకర్యాలు లేక సమీప రహదారుల్లో ఆఫీసులు ముగిసే సమయాల్లో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతున్నదని కలెక్టర్, మంత్రి దష్టికి తెచ్చారు.

అనంతరం మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కలెక్టరేట్ నిర్మాణం నగర ప్రజల అవసరాలు తీర్చేలా నిర్మిద్దామని తెలిపారు. కాగా మిగతా స్థలాలతో పోల్చితే.. పాటిగడ్డలో ఉన్న స్థలం నగరానికి నడిబొడ్డున ఉందనీ, ప్రజల రాకపోకలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆ స్థలపరిశీలన చేసి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కలెక్టరేట్ పరిసరాల్లో ప్రజావసరాల కోసం క్యాంటీన్, హెల్ప్ డెస్క్, అధికారుల భవనాలు ఉండేలా జీ ప్లస్ 9 లేదా జీ ప్లస్ 10గా కలెక్టరేట్‌ను నిర్మిస్తామని మంత్రి తెలిపారు.

అలాగే ఇందులో కలెక్టర్, ఇద్దరు అదనపు కలెక్టర్లకు నివాస భవనాలు ఉండేలా డిజైన్ ఖరారు చేస్తామని చెప్పారు. భవనానికి సంబంధించిన అవసరాల గురించి కలెక్టర్ అనుదీప్ రెండు మూడు రోజుల్లో నివేదిక సమర్పించగానే బిల్డింగ్ డిజైన్‌ను ఖరారు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం 10 లక్షల జనాభాలేని జిల్లాలకు కోట్లకు కోట్లు ఖర్చుపెట్టి కలెక్టరేట్లు నిర్మించిందనీ, కానీ, దాదాపు కోటిమంది జనాభా నివసించే హైదరాబాద్ కలెక్టరేట్ భవనాన్ని మాత్రం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి, ఈఈ మనోహర్‌బాబు, ఖైరాతాబాద్, షేక్‌పేట్ తహసీల్దార్లు నయిమొద్దీన్, అనితారెడ్డితోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పెద్ద ఎల్కిచెర్ల అటవీ ప్రాంతంలో పులి మృత్యువాత

- అనారోగ్యంతో మృతిచెందినట్టు భావిస్తున్న అధికారులు



నవతెలంగాణ-షాద్‌నగర్

రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం మండలంలోని పెద్ద ఎల్కిచర్ల అటవీ ప్రాంతంలో పులి మృత్యువాత పడిన ఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద ఎల్కిచెర్ల అటవీ ప్రాంతంలో పులి ఆనవాళ్లను అటవీ ప్రాంత శివారులోని రైతులు గమనించారు. పులి నడయాడిన అడుగులను గుర్తిస్తూ వాటిని ఫాలో కాగా.. కొద్ది దూరంలో పులి కనపడటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దూర ప్రాంతం నుంచే పులి కదలికలను గమనించారు. చాలా సేపు పులి కదలకుండా ఉండటంతో మృతి చెంది ఉండొచ్చని భావించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పులి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి మృతి చెందినట్టుగా నిర్ధారించారు. వెటర్నిటీ శాఖ అధికారుల సహాయంతో అటవీశాఖ అధికారులు పులి మృతికి గల కారణాలను పర్యవేక్షిస్తున్నారు. పులి శరీర భాగలపైన ఎటువంటి గాయాలు లేకపోవడంతో అనారోగ్యంతో మృతి చెందినట్టు భావిస్తున్నారు. పులి మృతికి గల కారణాలపై పూర్తి స్థాయి వైద్య పరీక్షల అనంతరం స్పష్టం చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

నీలగిరిలో సైకో గ్యాంగ్ హల్‌చల్..

ప్రేమ జంటలు, మహిళలే టార్గెట్..!

- బ్లాక్ మెయిల్ చేసి నగదు, ఆభరణాలు దోపిడీ
- ఆపై.. లైంగిక దాడులు !

సతెలంగాణ-నల్లగొండటౌన్

నల్లగొండ పట్టణంలో సైకో గ్యాంగ్ హల్‌చల్ సృష్టిస్తోంది. మహిళలే టార్గెట్‌గా చేసుకుని దోపిడీ, దాడులకు పాల్పడుతోంది. పట్టణ కేంద్రానికి ఆను కొని ఉన్న పానగల్ ఉదయసముద్రం, కేశరాజుపల్లి బైపాస్, రాంనగర్, హౌసింగ్‌బోర్డ్ పార్కు తదితర పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండటంతో ప్రేమ జంటలు, ఇతరులు వెళ్తుంటారు. వారు సన్నిహితం గా ఉన్న సమయంలో కొందరు యువకులు ఫొటోలు, వీడియోలు తీసి బెదిరించి దాడులు చేస్తు న్నారు.. వారి నుంచి నగదు, నగలు దోచుకోవడ మే కాకుండా.. లైంగికదాడులు చేస్తున్నారు. ఈ విషయం పోలీసుల దృష్టికి రావడంతో ఆ యువకు ను అరెస్టు చేసినట్టు తెలిసింది.

నల్లగొండ పట్టణంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన కొంతమంది యువకులు ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. ప్రేమికులు, అమాయకంగా ఉండే వారిని టార్గెట్ చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో సన్నిహితంగా ఉన్నప్పుడు చాటుగా ఫొటోలు, వీడియోలు తీసి మహిళలను బ్లాక్ మెయిల్ చేస్తు న్నారు. వారి వద్ద డబ్బులు తీసుకోవడం.. లేదంటే కొట్టి లైంగికదాడులు చేయడం.. ఆభరణాలు దోచు కోవడం చేస్తున్నారు. ఎవరికైనా చెప్తే వీడియోలు బయట పెడతామని, డబ్బులు ఇస్తేనే వీడియోలను డిలీట్ చేస్తామని మహిళలను, ప్రేమ జంటలను బెదిరిస్తున్నారు. దీంతో పరువు పోతుందని, వారి సంబంధం బయట పడుతుందని బాధితులు భయపడి ఎవరికీ చెప్పకుండా మిన్నకుంటున్నారు. వాళ్లు అడిగిన డబ్బులు లేదంటే బంగారం నగలు ఇచ్చేస్తున్నారు. ఈ క్రమంలోనే నల్లగొండ పట్టణం లోని నార్కట్‌పల్లి- అద్దంకి ప్రధాన రహదారి పానగల్ బైపాస్ సమీపంలోని కాలనీ వద్ద ఈ ముఠాను వ్యవహారం గురువారం బయటపడింది.

అసలు విషయం ఇలా..

నల్లగొండ పట్టణంలో ఇటీవల ఓ యువకుడు తన ప్రియురాలిని తీసుకొని పానగల్లు సమీపంలోని నిర్మానుష్య ప్రాం తానికి వెళ్లారు. ఆ జంట సన్నిహితంగా ఉన్న సమయంలో వీడియో, ఫొటోలు తీసి.. బెదిరించి.. యువతిని కొట్టి లైంగిక దాడి చేశారు. వారి నుంచి నగదు, బంగారు ఆభరణాలు లాక్కున్నారు. అదే సమయంలో వివాహేతర సంబంధం కలిగిన మరో జంటపై ఇదే తరహాలో దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని బాధితులు కొందరు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. ఇదే క్రమంలో ఆరుగురు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారిస్తు న్నట్టు సమాచారం.

వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. మూడేండ్ల నుంచి ఈ గ్యాంగ్ మహిళలను వేధిస్తున్నట్టు పోలీసుల విచారణలో బయటపడినట్టు తెలిసింది.

పెన్షనర్ల పట్ల మోడీ నిర్లక్ష్యం

బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవటమే సాక్ష్యం

- కనీసంగా తొమ్మిది వేలు ఇవ్వాల్సిందే..
- 16న కేంద్ర కార్మిక సంఘాల సమ్మెలో పాల్గొంటాం : విలేకర్లతో సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పదవీ విరమణ తర్వాత ప్రశాంతంగా జీవించాల్సిన పెన్షనర్ల పట్ల బీజేపీ కేంద్ర ప్రభుత్వం దమననీతిని కొనసాగిస్తున్న'దని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతుల నారాయణ రెడ్డి, పాలకుర్తి కృష్ణమూర్తి విమర్శించారు. పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం నేతలు ఎన్‌బీ చారి, వైకుంఠరావు, కె నాగేశ్వరరావు, రాధాకృష్ణ, విజయకుమార్, మాణిక్యాలరావుతో కలిసి శనివారం హైదరాబాద్‌లోని పోస్టల్ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో పెన్షనర్ల ప్రస్తావనే లేకుండా దాటవేశారనీ, వారి సంక్షేమం,జీవితం పట్ల ఇంత నిర్లక్షమెందుకని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, పెన్షనర్ల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే సమ్మెలో పెన్షనర్లు పాల్గొంటారని ప్రకటించారు. ఈపీఎస్95 పెన్షనర్లకు కనీస పెన్షన్ తొమ్మిదివేలకు పెంచాలని గల్లీ నుంచి ఢిల్లీ వరకు పలు పోరాటాలు నిర్వహించామని గుర్తు చేశారు. అయినా బీజేపీ ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డ చందంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో పనిచేసి పదవీ విరమణ పొంది ఈపీఎఫ్95 పెన్షన్‌లో కొనసాగుతున్న వారు దేశంలో 73 లక్షల మంది ఉన్నారన్నారని గుర్తు చేశారు. వారికి కనీస పెన్షన్ రూ. వెయ్యి నుంచి రూ.4,500 వరకు మాత్రమే వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొంతమందికి వెయ్యిలోపు మాత్రమే పెన్షన్ వస్తున్నదనీ, వీటితో ఎలా బతుకుతారో మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ స్కీంతెచ్చినప్పుడు రెండేండ్లకొకసారి పరిశీలిస్తామనీ, డీఆర్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దల మాటలు నీటి మూటలయ్యాయన్నారు.

గత ప్రభుత్వాలు కోషియార్ కమిటీ వేస్తే, ఆ కమిటీ కనీస పెన్షన్ రూ. మూడు వేలు ఇవ్వాలనీ, డీఆర్ ఇవ్వాలని సూచించిందని గుర్తు చేశారు. బీజేపీ కేంద్ర నాయకులు జవదేకర్ ఢిల్లీలో జరిగిన పెన్షనర్ల ధర్నాలకు వచ్చి అధికారంలోకి బీజేపీ రాగానే ఆ కమిటీ సూచనలను అమలు చేస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లు దాటినా..పెన్షనర్ల సమస్యలు పరిష్కరించటానికి వారికి సమయం దొరకకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. పైగా పార్లమెంటు సాక్షిగా పెన్షనర్ల సమస్యలు పరిష్కరించలేమని చెప్పడం వారి ప్రభుత్వ ద్వంద నీతికి నిదర్శనమని విమర్శించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు పెన్షన్ కట్ ఆఫ్ ఉండొద్దనీ, పూర్తి పెన్షన్ ఇవ్వాలని తీర్పు చెప్పినా, దానికి అనేక అడ్డంకులు పెట్టి, న్యాయస్థానాల తీర్పులను పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022-23 ఈపీఎఫ్ఓ నివేదిక ప్రకారం రూ.51,985 కోట్లు వడ్డీ రూపంలో ఆదాయం వస్తున్నదనీ, పెన్షనర్లకు కేవలం రూ.14.44కోట్లు (28శాతం) చెల్లించి, మిగతాది ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుంటున్నదని తెలిపారు.అనారోగ్యంతో, వయోధికులుగా ఉన్న పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయొద్దని పిలుపునిస్తున్నామని తెలిపారు. ఈ నెల 5,7,9 తేదీలలో పిఎఫ్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర పరిధిలోని ఈపీఎస్ పెన్షనర్లకు కాంట్రిబ్యూషన్ లేని వైద్య సౌకర్యం కల్పించాలనీ, బీపీఎల్ పరిధిలోకి వచ్చే ఈపీఎస్ పెన్షనర్లకు ఆసరా పెన్షన్ ఇవ్వాలనీ, సీనియర్ సిటిజన్లకు రైల్వే రాయితీ, రాష్ట్ర పరిధిలోని రవాణా రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు.



రాజ్యాంగంపై మోడీ సర్కారు దాడి

- ప్రమాదంలో దేశ భవిష్యత్తు
- బీజేపీని అధికారం నుంచి దించడమే లక్ష్యం
- వామపక్ష, లౌకిక, ప్రజాస్వామిక శక్తులన్నీ ఏకం కావాలి
- 16న గ్రామీణ బంద్, సమ్మెకు సంపూర్ణ మద్దతు : సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ విమర్శించారు. బీజేపీ పాలనలో దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీని అధికారం నుంచి దించడమే తమ లక్ష్యమని పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి సమావేశంలో చేసిన తీర్మానాన్ని ఆ పార్టీ జాతీయ కార్యదర్శులు కె నారాయణ, బాలచంద్ర కాంగోతో కలిసి హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అమర్ జిత్ కౌర్ వెల్లడించారు. మోడీ ప్రభుత్వం కార్మిక, రైతు, ఉద్యోగ, నిరుద్యోగ వ్యతిరేక నిర్ణయాలతో భారతదేశం ప్రమాదంలో పడిందన్నారు. ఈ పదేండ్ల పాలనలో ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలను భర్తీ చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం, సోషలిజం, ప్రాథమిక సూత్రాలను కాపాడేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్తంగా ఈనెల 16న చేపట్టనున్న 'సమ్మె, గ్రామీణ బంద్'కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని రక్షించుకునే వరకు పోరాటం సాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక ఎన్నికల అబద్ధమని విమర్శించారు. ఈ సమ్మె, గ్రామీణ బంద్‌లో అన్ని రంగాలకు చెందిన కార్మికులు, రైతులు హాజరవుతారనీ, దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే గేట్ల ముందు ప్రదర్శనను నిర్వహిస్తారనీ, బ్యాంకింగ్ రంగంలో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలుంటాయని చెప్పారు. న్యాయమైన హక్కుల సాధన కోసం జరుగుతున్న ఈ పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలూ మద్దతుగా నిలవాలని కోరారు. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ తదితర సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆమె విమర్శించారు. ప్రతిపక్షాల గొంతును అణచివేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలనీ, వారికి సామాజిక, ఉద్యోగ భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటుపై త్రిసభ్య కమిటీ

రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'ఇండియా కూటమి'లో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపేందుకు ముగ్గురు సభ్యుల కమిటీని సీపీఐ జాతీయ సమితి నియమించింది. ఈ కమిటీలో డి రాజా, కె నారాయణ, రామకృష్ణ పాండా సభ్యులుగా ఉంటారు. కార్మిక, రైతు, నిరుద్యోగం, వ్యవసాయ వ్యతిరేక, సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని ప్రస్తావించకుండా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని సీపీఐ జాతీయ కార్యదర్శి బి కె కంగో మరో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పార్టీ జాతీయ సమితి సభ్యులు నిషా సిద్దు, జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. దేశ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలపై ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా నివేదికను సమర్పించారు.

సురవరంకు సన్మానం

హైదరాబాద్‌లో జరుగుతున్న సీపీఐ జాతీయ సమితి సమావేశాల సందర్భంగా ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డిని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి రాజా శనివారం సన్మానం చేశారు.

గృహ నిర్మాణ శాఖ ఉద్యోగుల సమస్యను పరిష్కారిస్తాం

మంత్రి పొంగులేటి హామీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. అన్ని శాఖల ఉద్యోగులతోపాటు అన్ని వర్గాల ప్రజలు పదేండ్లపాటు ఇబ్బంది పడినట్టు పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ గృహవసతి కల్పిస్తామన్నారు. 'అల్లుడు, కూతురు వస్తే ఎక్కడ ఉంటారంటూ గత ప్రభుత్వం పేదలను మభ్యపెట్టింది తప్ప ఇండ్లు ఇవ్వలేదని విమర్శించారు.శనివారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్స్ ఇన్స్‌పెక్టర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను పొంగులేటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం బాధ్యత తనదేనన్నారు. గత ప్రభుత్వం హౌసింగ్‌ను, ఉద్యోగులను చిద్రం చేసి ఎన్నో రకాల ఇబ్బందులకు గురిచేసిందన్నారు. తమ ప్రభుత్వం గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులను సొంత కుటుంబ సభ్యులుగా మాదిరిగా కాపాడు కుంటామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమావేశంలో హౌసింగ్ చీఫ్ ఇంజనీర్ ఈశ్వరయ్య, సంఘం అధ్యక్షులు గవ్వ రవీందర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు బొగ్గుల వెంకటరామిరెడ్డి, కార్యదర్శి రఘువీర్ ప్రసాద్ గుప్తా, జనరల్ మేనేజర్లు చైతన్య, బలరాం, జేఆర్ఎస్ కుమార్, ఆంజనేయులు, జగన్, భాస్కర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

అందోల్‌కు నర్సింగ్ కళాశాల.. మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి..

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్

- భవన నిర్మాణాలకు అధికారులతో కలిసి స్థల పరిశీలన



నవతెలంగాణ-జోగిపేట

అందోల్‌కు నర్సింగ్ కళాశాల, 150 పడకల మల్టిస్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేయించానని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డి జిల్లా రేగోడు మండలంలో శనివారం పర్యటించిన మంత్రి.. మార్గమధ్యలోని అందోల్ గుట్టపై ఉన్న 1141 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో జేసీబీతో కొనసాగుతున్న చదును పనులను పరిశీలించారు. ప్రభుత్వ స్థలం ఏ మేరకు ఉందోనన్న విషయాన్ని ఆర్‌డీవో పాండు, సర్వేయర్ యాదయ్యను అడిగి తెలుసుకున్నారు. నర్సింగ్ కళాశాల, 150 పడకల మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి, కళాశాల విద్యార్థుల హాస్టల్ భవనం నిర్మాణాలకు అవసరమైన స్థలాన్ని సమాకూర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం చదును చేస్తున్న స్థలంలో 16 ఎకరాల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేసి చెప్పగా, ఆ స్థలాన్ని ఏ శాఖకు కేటాయించొద్దని తెలిపారు. అనంతరం సమీపంలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించానని, కళాశాల, వసతి గృహ భవనాల నిర్మాణాలకు నిధులు అప్పట్లోనే కేటాయించానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కళాశాలలోని మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. విద్యాబోధన, హాస్టల్ వసతి, ఇతరత్రా వివరాలను కళాశాలలోని విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అందోలు నియోజకవర్గంలోని విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి పనులను చేపట్టేందుకు సుమారుగా రూ.6 కోట్ల వరకు నిధులు మంజూరైనట్టు తెలిపారు. జోగిపేటలోని నెహ్రూ డిగ్రీ కళాశాల ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.71.67 లక్షలు, జూనియర్ కళాశాల ప్రహరీకి రూ.64.18 లక్షలు, అందోలులోని పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ, వర్క్‌షాప్ షెడ్‌కు రూ.75.22 లక్షలు, అందోలు కేజీబీవీ స్కూల్ బ్యాలెన్స్ పనుల పూర్తికి రూ.96.77 లక్షలు, మునిపల్లిలో మోడల్ స్కూల్‌లో వాటర్ సప్లయ్, పెయింటింగ్, ఇతర మరమ్మత్తుల కోసం రూ.50.20 లక్షలు, పుల్కల్ మండలం బస్వాపూర్‌లోని బాలికల వసతి గృహ బ్యాలెన్స్ పనుల కోసం రూ.53.41 లక్షలు, పుల్కల్ మండలం శివ్వంపేట పాలిటెక్నిక్ కళాశాల వద్ద సీసీ రోడ్డు కోసం రూ. 1.08 కోటి నిధులను మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ పనులకు దాదాపుగా టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావొస్తోందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఆర్‌డీవో పాండు నాయక్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు ఉన్నారు.



టెన్త్ మూల్యాంకనంపై ప్రత్యేక దృష్టి

ఎక్కువ జీపీఏ వచ్చే విద్యార్థుల వివరాలు సేకరణ

- జవాబు పత్రాలను పరిశీలించనున్న అధికారులు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఇటీవల జిల్లా విద్యాశాఖాధికారుల (డీఈవో) సమావేశాన్ని నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోవద్దని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే విద్యార్థులకు ఎక్కువ మార్కులు రావడం పట్ల ఆరా తీసినట్టు సమాచారం. కొన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులూ రావడం గురించి అడిగినట్టు తెలిసింది. ఎక్కువ మందికి పదికి పది క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ) ఎలా వస్తున్నాయని ప్రశ్నించినట్టు సమాచారం. అందుకే ఈ ఏడాది పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనంపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు తెలిసింది. ఎక్కువ జీపీఏ వచ్చే విద్యార్థుల వివరాలను సేకరించాలని నిర్ణయించినట్టు సమాచారం. వారి జవాబుపత్రాలను ప్రత్యేకంగా పరిశీలించాలని డీఈవోలకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. సబ్జెక్టుల వారీగా జవాబు పత్రాలను పరిశీలించాలనీ, సమాధానం ఎలా రాస్తున్నారో, మార్కులు ఎలా వేస్తున్నారో గమనించాలని సూచించినట్టు సమాచారం. ఆ మార్కులకు తగ్గట్టుగానే జీపీఏ ఉన్నదా?లేదా?అనేది పరిశీలించాలని ఆదేశించినట్టు తెలిసింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు ఆరు పేపర్లకు ఏడు సబ్జెక్టులతో పరీక్షలను నిర్వహిస్తున్న విషయం విదితమే. గతంలో జనరల్ సైన్స్ పేరుతో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు ఒకేరోజు పరీక్ష నిర్వహించే వారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుందనే విషయాన్ని విద్యాశాఖ అధికారులు గుర్తించి ఆరు పేపర్లకు ఏడు పరీక్షలను నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ సబ్జెక్టులకు వేర్వేరు పరీక్షలను వేర్వేరు రోజుల్లో నిర్వహిస్తారు. అయితే ఆ రెండు సబ్జెక్టులనూ ఒకే పేపర్‌గా పరిగణిస్తారు.

కలహాల కాపురం...!

బీహార్‌లో జేడీయూ, బీజేపీ మధ్య మొదలైన విభేదాలు

- పెద్దన్న పాత్ర కోసం కమలదళం ఆరాటం
- బింకం వదలని నితీష్
- ఆలస్యమవుతున్న క్యాబినెట్ విస్తరణ, శాఖల కేటాయింపు
- వాయిదా పడిన బలపరీక్ష



పాట్నా : బీహార్‌లో జేడీయూ అధినేత నితీష్ కుమార్ నేతృత్వంలో ఐదు రోజుల క్రితం ఏర్పడిన జేడీయూ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో అప్పుడే పొరపొచ్చాలు మొదలయ్యాయి. నితీష్ తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రోజులు గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నాయి. క్యాబినెట్ విస్తరణ, శాఖల కేటాయింపు, శాసనసభలో బల నిరూపణ వంటి విషయాలలో స్పష్టత రావడం లేదు. శాఖల కేటాయింపు విషయంలో నితీష్, బీజేపీ మధ్య అభిప్రాయబేధాలు తలెత్తాయని ఊహాగానాలు వినవస్తున్నాయి. ముఖ్యంగా హోం, సాధారణ పరిపాలన శాఖల పైనే చిక్కుముడి ఏర్పడుతోంది.

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూ ఎన్ని స్థానాలకు పోటీ చేయాలనే విషయంపై కూడా ఏకాభిప్రాయం కుదరడం లేదని సమాచారం. సభలో బల నిరూపణ కోరే తేదీని నితీష్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే సవరించడం రాష్ట్ర ప్రజలను ఆశ్చర్యంలో ముంచేసింది. తాజాగా గురువారం విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 12న నితీష్ ప్రభుత్వం విశ్వాస పరీక్షను ఎదుర్కొంటుంది. అదే రోజు స్పీకర్ ఎన్నిక కూడా జరుగుతుంది. ప్రస్తుత స్పీకర్ అవధ్

ఆర్జేడీ ఎత్తుగడలు

ఇదిలావుండగా జేడీయూలోని కొందరు ఎమ్మెల్యేలను తన వైపు తిప్పుకొని విశ్వాస పరీక్షలో నితీష్‌కు షాక్ ఇవ్వాలని ఆర్జేడీ యోచిస్తోంది. నితీష్ బీజేపీతో జట్టు కట్టడం కొందరు జేడీయూ ఎమ్మెల్యేలకు ఇష్టం లేదు. రాష్ట్రంలో ఇప్పుడే రాజకీయ క్రీడ ప్రారంభమైందంటూ ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ చేసిన వ్యాఖ్యను కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

ఆ ఇద్దరూ కొరకరాని కొయ్యలే

ఏదేమైనా అందరూ అనుకుంటున్న విధంగా నితీష్ ప్రభుత్వంలో వ్యవహారాలు సజావుగా సాగడం లేదు. గతంలో మాదిరిగా ఈసారి ప్రభుత్వంలో తమది రెండో స్థానం కాదని బీజేపీ ఇప్పటికే తెగేసి చెప్పింది. బీజేపీ నేతలైన ఉప ముఖ్య మంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలు కరడుకట్టిన నితీష్ విమర్శకులుగా పేరు పొందారు. నితీష్‌ను ముఖ్యమంత్రి పదవి నుండి గద్దె దింపే వరకూ తలపాగా తీయబోనని చౌదరి గత సంవత్సరంలో బహిరంగంగానే ప్రకటించారు. సిన్హా కూడా తక్కువ వాడేమీ కాదు. నితీష్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, ఆయన అహంభావి అని గతంలో ఆరోపించారు. వీరిద్దరినీ ఉప ముఖ్యమంత్రులుగా ఎంపిక చేయడం ద్వారా నితీష్‌కు బీజేపీ గట్టి సంకేతం పంపింది.

బిహారీ చౌదరిని పదవి నుండి తొలగిస్తున్నామని ఎన్డీఏ ప్రకటించింది. ఆర్జేడీ సీనియర్ నేత అయిన చౌదరి పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సన్నిహితుడు. నితీష్ ప్రభుత్వం ఈ నెల 10న సభా విశ్వాసం కోరుతుందని అంతకుముందు ప్రకటించారు.

పదవుల కోసం పోటీ

బల నిరూపణ తర్వాతే క్యాబినెట్ విస్తరణ జరుగుతుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. పలువురు పాత, కొత్త నేతలు నితీష్ ప్రభుత్వంలో స్థానం కోసం పోటీ పడుతున్నారు. గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారు సైతం పదవుల కోరు కుంటున్నారు. వీరందరినీ సంతృప్తి పరచడం నితీష్‌కు సవాలుగా మారింది.

ఆ రెండు శాఖల పైనే పట్టు

నితీష్ గతంలో ఎనిమిది సార్లు బీహార్ ముఖ్యమంత్రిగా వ్యవహరించినప్పటికీ క్యాబినెట్ విస్తరణ, శాఖల కేటాయింపు, బల నిరూపణలో ఆలస్యం జరగడం ఇదే మొదటిసారి అని రాజకీయ పరిశీలకులు తెలిపారు.

'నితీష్ 2005 నుండి బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రమాణస్వీకారం తర్వాత ఆయన మిగిలిన పనులన్నింటినీ చాలా వేగంగా పూర్తి చేసే వారు. అయితే ఈసారి మాత్రం ఆయన వ్యవహార శైలికి అనుగుణంగా ఏదీ జరగడం లేదు. నితీష్, బీజేపీ మధ్య ఏదో జరుగుతోంది. సమస్యల పరిష్కారానికి వారు మరింత సమయం తీసుకుంటున్నారు' అని వారు చెప్పారు.

మంత్రుల శాఖలకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయని, అందుకే జాప్యం జరుగుతోందని జేడీయూ వర్గాలు అంగీకరిస్తున్నాయి. కీలకమైన హోం, సాధారణ పరిపాలన శాఖలను బీజేపీకి అప్పగించేందుకు నితీష్ సుముఖంగా లేరు. గతంలో కూడా ఆయన ఈ రెండు శాఖలనూ తన వద్దే అట్టిపెట్టుకున్నారు. ఈ శాఖలను గత భాగస్వాములైన ఆర్జేడీకి కానీ బీజేపీకి కానీ ఇచ్చే విషయంలో ఆయన ఎన్నడూ రాజీ పడలేదు.

సీట్లపై తకరారు

లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో పోటీ చేయాలని బీజేపీ నిర్ణయించుకుంది. జేడీయూకు 12 స్థానాలు మాత్రమే ఇస్తామని తెలియజేసింది. అయితే 2019లో తాము పోటీ చేసిన 17 స్థానాలనూ తిరిగి తమకే కేటాయించాలని నితీష్ పట్టుబడుతున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో జేడీయూ, బీజేపీ చెరో 17 స్థానాల్లో పోటీ చేశాయి. బీజేపీ 17, జేడీయూ 16 స్థానాల్లో విజయం సాధించాయి. బీజేపీ భాగస్వామి ఎల్‌జేపీకి ఆరు స్థానాలు వచ్చాయి. మొత్తంమీద ఎన్డీఏ 39 స్థానాలు గెలుచుకుంది (మొత్తం స్థానాలు 40). ఆ ఎన్నికల్లో ఎన్డీఏ 54.40% ఓట్లు పొందింది. దీనిని దృష్టిలో ఉంచుకొనే పూర్వ వైభవం కోసం నితీష్‌తో బీజేపీ చేతులు కలిపింది.

నితీష్‌లో క్రాస్ ఓటింగ్ భయం

'నితీష్ ముఖ్యమంత్రి అయితే అయి ఉండవచ్చు. కానీ గతంలో ఎన్డీఏలో ఉన్నప్పటి మాదిరిగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. పని చేయలేకపోతున్నారు' అని జేడీయూకు చెందిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఒకరు వ్యాఖ్యానించారు. క్షేత్ర స్థాయిలో ఇప్పుడు రాజకీయ పరిస్థితులు మారాయని, బీజేపీ మరిన్ని డిమాండ్లను తెర పైకి తెస్తోందని, పెద్దన్న పాత్ర పోషించాలని ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. కాగా శాసనసభలో బల పరీక్ష జరిగే సమయంలో తన పార్టీకే చెందిన ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగుకు పాల్పడవచ్చునని నితీష్ అనుమానిస్తున్నారంటూ రాజకీయ వర్గాల్లో వదంతులు విన్పిస్తున్నాయి. అందుకే బల పరీక్షకు ముందే మంత్రిమండలిని విస్తరించి లేనిపోని తల నెప్పులు తెచ్చుకోవడం ఆయనకు ఇష్టం లేదని అంటున్నారు.



పొంగులేటితో కేరళ మంత్రి రాజన్ భేటి

'రెవెన్యూ' పటిష్టానికి చర్చలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేండ్లల్లో రెవెన్యూ శాఖను, నిర్వీర్యం చేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ వ్యవస్థ బలోపేతం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డా బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం కేరళ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి కె.రాజన్, ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి సాంబశివరావుతో పొంగులేటి భేటి అయ్యారు. ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ సైతం పాల్గొన్నారు. కేరళ రాష్ట్రంలో అమలవుతున్న హౌసింగ్ స్కీమ్‌తో పాటు రెవెన్యూ విభాగం పనితీరు, వాటి వివరాలను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటూ అభివద్ధి సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో రాష్ట్ర రెవెన్యూ యంత్రాంగం పాత్ర కీలకమైందన్నారు. అలాగే ప్రభుత్వానికి ప్రజలకు రెవెన్యూ శాఖ వారధిగా ఉంటుందని కేరళ మంత్రి రాజన్ వివరించారు. ఈ విభాగం సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రజలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, ఆకాంక్షలు నేరవేరతాయని అన్నారు. అప్పుడే కోరుకున్న ఫలితాలు వస్తాయనీ, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు సైతం వస్తుందని మంత్రి రాజన్ అభిప్రాయపడ్డారు.

"వసంత రుతువు వచ్చిందో లేదో ఆ కోకిల కంఠం ఎలా పేలిపోతోందో చూడు - మాటలు, పాటలు నినాద మైదానాల మీద రాళ్లై, చెప్పులై రాలుతున్నాయి, మిత్రమా! ఒక్క క్షణం మర్చిపోదాం ప్రజల కన్నీళ్లు. వసంతాలు వస్తున్నాయ్, వసంతాలు పోతున్నాయ్ ఒక్క పువ్వైడు వసంతం కోసం చెట్లు ఆకులన్నీ రాల్చుకుంటున్నాయి" ఇది వసంతంపై శేషేంద్ర కవితాభాగం. పువ్వైడు వసంతం కోసం చెట్లన్నీ అకులు రాల్చుకున్నట్లుగానే, ఇక్కడ ప్రజలు ఆశల్ని రాల్చుకుంటున్నారు. నిజంగా బతుకు చెట్టుపైకి వసంతం వస్తుందా! వసంతం బతుకులోకి వచ్చినా రాకున్నా రుతువు మాత్రం వచ్చిపోతుంది. కోయిలలు ఎదురుచూసే చిగుర్లకాలం వచ్చేస్తోంది. ఇక రాగమెత్తేందుకు గొంతులు సవరించుకోవాల్సిందే. వసంత రుతువు తోడుగానే మన దేశంలో ఎన్నికల రుతువూ సమీపిస్తున్నది. మరి రానున్న ఎన్నికల రుతువులో నాయక కోయిలలు ఏ రాగం ఎత్తుకుంటాయి! ఏ పాటలు పాడి వినిపిస్తాయి? చూడాలి.



'ఎన్నికల' వసంతం

వసంతం రాకుండానే గ్రీష్మ ప్రతా పాన్ని గురించి ఇప్పుడెందుకు చర్చ అని సాధారణంగా అనుకుంటాం, కానీ అప్పుడే ఎన్నికలలో భ్రమల గీతాల సీతా రామం మొదలయ్యింది. జాగ్రత్తగా గమనించాలి. లేకుంటే ఎన్నికలానంతరం వడ్డింపుల మంటలకు విలవిల్లాడి పోతాము. ఇప్పుడు ఎన్నికల కోయిల చెట్ల (ప్రజల)పై నుండి గొంతెత్తడంలేదు. రాముని కోవెలపై నుండి మాత్రమే రాగమెత్తుతున్నది. పచ్చదనం, చిగుర్లు అవసరంలేని దివ్యామృత సేవనంతో మునిగిపోయి మనల్నీ మునగ మంటున్నది. అమృతం మనకిస్తే గ్రోలుదాం సరే. మరి ఆకలి సంగతేమిటి? ఆలోచించాలి!

పాత ఆకులు రాలి కొత్త చివుళ్లు పుట్టుకొచ్చినట్లుగానే, మనుషుల్లోనూ కొత్త ఆశలు తలెత్తుతాయి. కోర్కెలు విచ్చుకుంటాయి. దు:ఖపు కన్నీటితడిని తుడిచే చేయి ఏదైనా దరి చేరుతుందనే ఎదురుచూపు, ఎన్నికల రుతువులో జనంలో మొలకెత్తుతుంది. అయితే నాయకుల రాగాలాపనలు సరిగా అర్థం చేసుకోకపోతే, ఏ రాగం వెనుక ఎవరి ప్రయోజనాలున్నాయో అవగాహన కాకపోతే, రుతువంతా అధికారం చుట్టే తిరిగిపోతుంది. రాలిన ఆశలతో జనం మిగులుతారు. వసంతం తర్వాత వచ్చే రుతువు గ్రీష్మమే. ఎండలు మండుతాయి. పచ్చదనపు సంపద సమంగా సరిగా విరియకపోతే గ్రీష్మాన్ని తట్టుకోవడం కష్టమైపోతుంది. చురుకుమని, కాలు నేలపై పెట్టనీయనితనంలా గ్రీష్మ ప్రతాపం ఉంటుంది. మన దేశపు ప్రజాస్వామ్య ఎన్నికల వసంత రుతువు ఆరంభాన ఎలాంటి అడుగులు పడతాయో అనేదాన్ని బట్టి, గ్రీష్మాన్ని ఎంత భరించాల్సి ఉంటుందో తెలుస్తుంది.

ఎన్నికల రుతుస్వామ్య గీతాలాపనలో మనం మేనుమరిచి, చిగురులపై భ్రమల పాటల తాదాత్మ్యంలో పడి కలలను ధారపోస్తే, ఇక మన భవిత గ్రీష్మం చంద్రనిప్పులు కురిపించడం ఖాయం. వసంతం రాకుండానే గ్రీష్మ ప్రతా పాన్ని గురించి ఇప్పుడెందుకు చర్చ అని సాధారణంగా అనుకుంటాం, కానీ అప్పుడే ఎన్నికలలో భ్రమల గీతాల సీతా రామం మొదలయ్యింది. జాగ్రత్తగా గమనించాలి. లేకుంటే ఎన్నికలానంతరం వడ్డింపుల మంటలకు విలవిల్లాడి పోతాము. ఇప్పుడు ఎన్నికల కోయిల చెట్ల (ప్రజల)పై నుండి గొంతెత్తడంలేదు. రాముని కోవెలపై నుండి మాత్రమే రాగమెత్తుతున్నది. పచ్చదనం, చిగుర్లు అవసరంలేని దివ్యామృత సేవనంతో మునిగిపోయి మనల్నీ మునగ మంటున్నది. అమృతం మనకిస్తే గ్రోలుదాం సరే. మరి ఆకలి సంగతేమిటి? ఆలోచించాలి!

కొన్ని సత్యాలను కోవెలకీవల పరిశీలన చేయాలి. లేకుంటే మైకంలో వాస్తవాలు మరుగున పడిపోతాయి. ప్రపంచంలోనే అత్యధికమంది పేదలు భారతదేశంలో వున్నారన్నది ఆక్స్‌ఫాం నివేదిక చెప్పిన సత్యం. వివరంగా చెప్పు కుంటే 2018 నుండి 2022 మధ్య పేదల సంఖ్య 190 మిలియన్ల నుంచి 350 మిలియన్లకు పెరిగింది. పేదల ఆకలి పెరిగింది. కేవలం 2022లో మరణించిన బాలలలో 65 శాతం మంది పేదరికం, పోషకాహారలోపం, ఆకలితో మరణించారని ఆ నివేదిక స్పష్టపరుస్తోంది. అదేమీ ప్రతిపక్షాల సంస్థ కాదు, అంతర్జాతీయసంస్థ. అది చెప్పిందేమంటే భారతదేశంలో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగాయని, ఈ దేశ సంపదలో 60 శాతం సంపద కేవలం ఐదు శాతం మంది సంపన్నుల చేతులలో కేంద్రీకృతమై ఉన్నదని తేల్చి చెప్పింది. ఇక 50 శాతం మంది చేతుల్లో కేవలం, మూడుశాతం సంపద మాత్రమే ఉందన్నది. కరోనా కాలంలోనూ మన దేశంలోని లక్షల కోట్లాధీశులు పెరిగారు. ఇంకోవైపు పేదరికం పెరిగింది. మరి మన పాలక కోయిలలు ఎవరిపాట పాడుతున్నట్లు! లాభాలు దండుకున్న వారు కడుతున్న పన్నులకంటే, ప్రభుత్వానికి పేదలు, ఇతర ప్రజలు కడుతున్న పన్నులే అత్యధికమని నివేదిక చెబుతున్న వివరాలు.

ఈ దేశపు వృక్షంపై పచ్చదనానికి కారకులెవ్వరు? ఆ చివుళ్లను తిని రాగాలెత్తుతున్న కోయిల ఎవరికోసం గొంతెత్తుతున్నది? ఇది బాగా అర్థం చేసుకోవాలి. అందుకనే నాయక కోకిల చెట్లనొదిలి, గోపురంపై వాలింది. మన చూపులూ, ఆశలు, కలలు, అభ్యర్థనలు అన్ని గుడిగంటల హోరులోకి వెళ్లాలనేది వారి వ్యూహం. ఇక తమ శ్రీమంతుల పాటకు ఆటంకాలు రావనేది వారి ఆలోచన. అశేష జనవాహిని ఆ భ్రమాత్మక ఎన్నికల పాటల్ని అర్థంచేసుకుని, గొంతుకలెత్తాలి!


సంపాదకీయం

> తెలంగాణలో అధికార పార్టీగా, ఏపీలో వైఎస్ షర్మిల నాయకత్వంలో కదలిక పెరిగిన పార్టీగా కాంగ్రెస్ కూడా బీజేపీపై సైద్ధాంతిక రాజకీయ పోరాటానికి, ఎన్నికల సమరానికి విశాల కలయిక అవసరం పూర్తిగా గుర్తించడం లేదు. ఏపీలో అన్నాచెల్లెళ్ల తగాదా ప్రధానమైతే, తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ యుద్ధం ముఖ్యమైపోయింది. మొన్న మూడు రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ అందరినీ కలుపుకుని వుంటే ఫలితాలు మారివుండేవి. తెలంగాణలోనూ మెజార్టీ పెరిగి మరింత నిలకడ వచ్చేది.ఇలాంటి లోపాలు కాంగ్రెస్‌వైపు ఇతర ప్రాంతీయ పార్టీల వైపు వున్న మాట నిజమే గాని బీజేపీకి తిరుగులేదనడం పాక్షిక సత్యం.

> జార్ఖండ్‌లో మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సొరేన్‌పై ఈడి దాడులతో అరెస్టు చేయడం ప్రతిపక్షాలను బెదిరించే కుట్రల్లో భాగమే. బీహార్‌లో లాలూ కుటుంబాన్ని, కర్నాటకలో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌నూ,ఢిల్లీలో కేజ్రీవాల్‌నూ ఇంకా ఎందరినో ఈ విధంగానే వేటా డటంలో ఆంతర్యం అదే.వారిలో ఎవరు ఏదైనా తప్పు చేశారా లేదా అనేది ఇక్కడ కీలకం కాదు, బీజేపీని గట్టిగా వ్యతిరేకించే రాజకీయ శక్తులను వేధించి అడ్డులేకుండా చేసుకోవాలి.ఈ కేసులన్నిటినీ చాలా వివరంగా చిత్రించే బడా మీడియా బీజేపీకి సంబంధించిన వారిపై వచ్చిన ఆరోపణలను మాత్రం నామమాత్రంగా చెబుతుంది.

మొత్తం మోడీ మహాత్య కీర్తనలేనా?

'జనవరి 22న అయోధ్యలో రామాలయ ప్రాణ ప్రతిష్ఠ జరిగింది నిజమే కానీ ఆ రోజుతో చరిత్ర ఆగిపోదు' అని సీనియర్ ఎడిటర్ శేఖర్ గుప్తా వ్యాఖ్యానించాడు. ఇది వాస్తవం. రాజకీయాల్లో ఒక పరిణామం తీవ్రతను గుర్తించడం వేరు, అంతటితో అయిపోయిందనీ, అదే అన్నిటినీ నిర్ణయిస్తుందని అనుకోవడం పొరబాటు. దురదృష్టవశాత్తూ ఇప్పుడు బడామీడియా రోజురోజుకూ అలాంటి కబుర్లే కుమ్మరిస్తుంటుంది. కొత్త కొత్త పదజాలాలతో పక్కదోవ పట్టిస్తుంటుంది. అంతర్జాతీయస్థాయిలో గ్లోబల్ మీడియా ఏవిధంగా అన్ని విషయాలూ సామ్రాజ్యవాద కోణంలో ఇస్తుందో, దేశంలో బడామీడియా కూడా ప్రతిదీ మోడీ మహత్తర విజయంగా అభివర్ణిస్తుంటుంది. (అదే రాష్ట్రాలలో అయితే వారి వారి ఎంపికల ప్రకారం చేస్తుంటుంది గానీ ఆ ముచ్చట మరోసారి) మూడు రాష్ట్రాలలో బీజేపీకి మెజార్టి రావడంతో హ్యాట్రిక్ ఖాయమని తేల్చేసింది.ఇందాక చెప్పుకున్న రామమందిరం ప్రాణప్రతిష్ఠతో తిరుగులేదని చెప్పింది. ఆ పిమ్మట బీహార్‌లో నితీష్‌కుమార్ సరికొత్త ఊసరవెల్లి వేషాలతో ఇండియా వేదిక పని అయిపోయిందని నిర్ణయించింది. అదే సమయంలో బెంగాల్‌లో మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు సీట్లు ఇచ్చేది లేదని చెప్పడంతో మీడియా మరింత రెచ్చిపోయింది. ఇందులో ప్రతి అంశాన్ని ఒక్క వైపునుంచే చూపిస్తూ అంతా మోడీకి అనుకూల దిశలోనే జరిగిపోతున్నట్టు చిత్రించడానికి నానాపాట్లు పడుతున్నది. అందుకు తగినట్టే స్వతంత్ర ఆర్నాబ్‌లు, లోకల్ ఆర్నాబ్‌ల వంటి స్టార్ వ్యాఖ్యాతలు మోడీ అద్భుత జనరంజక శక్తికి కీర్తనల జోరు పెంచుతున్నారు.ఈ ప్రక్రియ లోక్‌సభ ఎన్నికల ఫలితాల వరకూ ఆగేది కాదు. తర్వాతి ఘట్టం ప్రజల తీర్పుపై ఆధారపడి వుంటుంది.



తెలకపల్లి రవి

నితీశ్ ప్రహసనం నిజాలేమిటి?

బీజేపీ ఎన్నికల విజయాలు, కొంతమంది నేతల ఫిరాయింపులు నిజమే. కానీ నాణేనికి మరోవైపు చూడవలసిన పనిలేదా? ఉదాహరణకు బీహార్‌లో నితీశ్‌కుమార్ ఫిరాయింపు కొత్తేమీ కాదు, అనుకోనిదీ కాదు. ఆయన పేరులో మొదటి అక్షరానికి దీర్ఘం లేదని అందరికీ తెలుసు. కానీ 2019 ఎన్నికల నాటికి ఆయన బీజేపీతో కలిసే పోటీ చేశారు. అత్యధిక లోక్‌సభ సీట్లు వాళ్లకే వచ్చాయి. కనుక రాజకీయంగా ఇండియాకు దెబ్బ అనడం సరైందే గానీ ఇప్పుడు కొత్తగా కలిగే నష్టం లేదు. ఆయన అలా చేస్తాడనేది అందరి దృష్టిలో వున్నదే. అసలు ఇండియా పేరిట హడావుడి చేస్తున్న సమయంలో కూడా ఎవరూ పెద్దగా విశ్వసించింది లేదు. కాకపోతే దేశంలో పెద్ద రాష్ట్రాలలో ఒకటికి ఉత్తరభారతంలో ప్రభావశీల ప్రదేశంగా బీహార్‌కు ప్రత్యేక స్థానముంది గనక లౌకిక పార్టీలు ఆయన రాకను ప్రోత్సహించాయి. నిజానికి 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత 2020లో జరిగిన శాసన సభ ఎన్నికలనాటికే నితీశ్ బలం గణనీయంగా క్షీణించింది. ఆ ఎన్నికల్లో ఆర్జేడీకి 79, బీజేపీకి 78 రాగా జెడియు కేవలం 45 మాత్రమే తెచ్చుకున్నది. 19 స్థానాలతో కాంగ్రెస్,16 స్థానాలతో వామపక్షాలు ఇంకా బలంగా వున్నాయి. ఇప్పుడు నితీశ్ కేవలం బీజేపీ కీలు బొమ్మలానే బతకాల్సి వుంటుంది.ఇండియా తరపున తనను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించబోరని తెలిసిన తర్వాతే ఆయన ప్లేటు ఫిరాయించాలని నిర్ణయించుకున్నాడు. మామూలుగా అయితే మీడియా దీన్ని చీల్చి చెండాడాలి. ఆ విధంగా ఊసరవెల్లి చందం అని రాయడం చెప్పడం జరిగింది గాని ప్రధాన దాడి ఇండియా విచ్ఛిన్నంపైనే పెట్టారు.2022లో తమను ఈసడించుకుని వెళ్లిన నేత తిరిగివస్తే బీజేపీ ఎలా అక్కున చేర్చుకుని అధికారమిచ్చిందనేది మాత్రం ప్రశ్నించిన పాపాన పోలేదు.

మరోవైపు పరిణామాలు

నిజానికి ఇదే సమయంలో పక్కనున్న అతిపెద్ద రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌లో అఖిలేశ్ యాదవ్ సమాజ్‌వాది పార్టీ కాంగ్రెస్‌కు 11 స్థానాలు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. కాంగ్రెస్ మరిన్ని సీట్లు కోరుతున్న మాట నిజమే గాని ఈ మాత్రం సర్దుబాటు చిన్నదేం కాదు. ఆప్ నాయకుడు కేజ్రీవాల్ హర్యానాలో తాము ఒంటరిగా పోటీ చేస్తామంటూనే లోక్‌సభలో మాత్రం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటామన్నారు. ఇక రాజకీయంగా మరింత కీలకమైన పశ్చిమబెంగాల్ విషయానికొస్తే అక్కడ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ టిఎంసితో పొత్తు వద్దనే వైఖరి తీసుకుంది సీపీఐ(ఎం). ఇటీవలి కాలంలో షహీద్ మినార్ మైదాన్‌లో యువత అపూర్వమైన బహిరంగసభ కూడా జరిపింది. 'ఇండియా'లోని కాంగ్రెస్‌తోనే కానీ సీపీఐ(ఎం)తో తమకు కుదరదని తృణమూల్ కూడా ప్రకటించింది. అయితే అంతా అయ్యాక మమత కాంగ్రెస్‌కు కేవలం రెండంటే రెండు లోక్‌సభ సీట్లే కేటాయిస్తానన్నది. మాల్దా దక్షిణం, బెర్హంపూర్ అనే ఆ రెండు ఇప్పటికే కాంగ్రెస్ సభ్యుల చేతుల్లోనే వున్నాయి. కనుక వారు కూడా అంగీకరించలేదు. ఈ సమయంలో రాహుల్‌గాంధీ న్యాయ జోడోయాత్ర వచ్చినపుడు కూడా తృణమూల్ వర్గీయుల రాళ్లు విసిరి దౌర్జన్యం చేశారు. మరోవంక సీపీఐ(ఎం) నాయకులు సభలో పాల్గొని సంఘీభావం తెలిపారు. బెంగాల్‌లో సీపీఐ(ఎం)రాజకీయ విధానం మమత మీద పోరాటమేనని స్పష్టంచేశారు. రాహుల్ గాంధీ మాత్రం తాము ఇప్పటికీ ఆ పార్టీతో సీట్ల సర్దుబాటు చర్చలు జరుపుతున్నామన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ ఎప్పుడూ వేరువేరుగానే పోటీ పడుతున్నాయి. కనక ఇక్కడ రాజకీయంగానీ, సీట్ల రీత్యా గానీ నష్టపోయింది లేదు. పైగా ఇక్కడ యూపీ మినహా ఇవేవీ బీజేపీ పాలనలోని రాష్ట్రాలూ కాదు. అందువల్ల బీహార్ పరిణామాలతో ఇండియా అతలాకుతలం అయిపోయినట్టు అంతా తిరగబడినట్టు చెప్పడం దురుద్దేశపూరితం. ఇప్పుడు వారు గెలిచిన మూడు రాష్ట్రాలలో కూడా బీజేపీకి 39 స్థానాలుంటే కాంగ్రెస్‌కు కేవలం రెండే వున్నాయి, అందువల్ల కొత్తగా ఏమొచ్చినా లాభమే గాని నష్టపోయేది వుండదు. ఇవన్నీ వాస్తవికమైన ఆధార సహిత విషయాలయినప్పుడు మోడీ ఏదో అపారబలం పుంజుకున్నట్టు మిగిలిన పార్టీలన్నీ భయంతో వణికిపోతున్నట్టు మీడియా చెప్పడం ఎంత దారుణం?

నిజంగా ఏకపక్షమా?

తెలంగాణలో బీఆర్ఎస్ అనేక మల్లగుల్లాలు పడినా ప్రజలు మాత్రం బీజేపీకి అవకాశం నిరాకరించి కాంగ్రెస్‌ను ఎన్నుకోలేదా?అలాగే రామమందిరం వ్యవహారం బీజేపీకి బాగా మేలు చేయొచ్చు గాని మతరాజ్య భావన వచ్చిందనే భావన కూడా రావడంతో ఏదో ఒక మేరకు వ్యతిరేక ఓట్లు కూడా పెరగవా? అంతా అను కూలంగా వుంటే నితీశ్‌ను మళ్లీ ఎందుకు రానిచ్చేవారు? బెంగాల్‌లో మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు సీట్లు నిరాకరించారు గనక వెంటనే బీజేపీతో పాటు ఆమెనూ ఎక్కువ చేసి చూపుతున్నారు గానీ ఆమె ఇండియాను బలపర్చినప్పటి మాటేంటి? ఆమె తనే ప్రధాని కావాలనే ఆశతో అడ్డంకులు సృష్టించినప్పుడు వాటిని పెద్దగా చూపించిందీ వీరే కదా? మమత, కేసీఆర్, కేజ్రీవాల్ ఎవరూ కలిసి రారని బీజేపీ వ్యతిరేక కూటమి వట్టి మాట అని అన్నవారు ఏదో విధంగా 'ఇండియా' ఏర్పడిన తర్వాత నాలుక కరుచుకోక తప్పలేదు. సీపీఐ(ఎం) వరకూ ఇది కేవలం బీజేపీ విధాన మతతత్వంపై కేంద్ర నిరంకుశత్వంపై పోరాడే ఒక వేదిక తప్ప కూటమి కాదని



> **బీజేపీ ఎన్నికల విజయాలు, కొంతమంది నేతల ఫిరాయింపులు నిజమే. కానీ నాణేనికి మరోవైపు చూడవలసిన పనిలేదా? ఉదాహరణకు బీహార్‌లో నితీశ్‌కుమార్ ఫిరాయింపు కొత్తేమీ కాదు, అనుకోనిదీ కాదు. ఆయన పేరులో మొదటి అక్షరానికి దీర్ఘం లేదని అందరికీ తెలుసు. కానీ 2019 ఎన్నికల నాటికి ఆయన బీజేపీతో కలిసే పోటీ చేశారు. అత్యధిక లోక్‌సభ సీట్లు వాళ్లకే వచ్చాయి. కనుక రాజకీయంగా ఇండియాకు దెబ్బ అనడం సరైందే గానీ ఇప్పుడు కొత్తగా కలిగే నష్టం లేదు. ఆయన అలా చేస్తాడనేది అందరి దృష్టిలో వున్నదే. అసలు ఇండియా పేరిట హడావుడి చేస్తున్న సమయంలో కూడా ఎవరూ పెద్దగా విశ్వసించింది లేదు.**

చెబుతూనే వుంది. ఆ మాటకొస్తే ఒక నిర్మాణ రూపం వద్దని కూడా సూచించింది.మల్లికార్జున ఖర్గేను ఛైర్మన్‌గా ప్రకటించిన రోజునే నితీశ్ నిష్క్రమణ ఖాయమైపోయింది. దాంతో ఆయన్ను నియమించకపోవడమే సరైందని అప్పుడే అర్థమైంది.అందుకే ఇండియాలో సభ్యత్వం గల పార్టీలేవీ నితీశ్ కోసం విచారించింది లేదు!ఆయన గురించిన అంచనా అది. రేపటి ఎన్నికల్లో కూడా 45 స్థానాలు గల ఆయన వెళ్లిపోయినా ఆర్జేడీ కాంగ్రెస్ వామ పక్షాల బలంతో గట్టిగా సవాలు చేయడం తథ్యమే. పక్కనే వున్న జార్ఖండ్‌లో మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సొరేన్‌పై ఈడి దాడులతో అరెస్టు చేయడం ప్రతిపక్షాలను బెదిరించే కుట్రల్లో భాగమే. బీహార్‌లో లాలూ కుటుంబాన్ని, కర్నాటకలో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌నూ,ఢిల్లీలో కేజ్రీవాల్‌నూ ఇంకా ఎందరినో ఈ విధంగానే వేటాడటంలో ఆంతర్యం అదే.వారిలో ఎవరు ఏదైనా తప్పు చేశారా లేదా అనేది ఇక్కడ కీలకం కాదు, బీజేపీని గట్టిగా వ్యతిరేకించే రాజకీయ శక్తులను వేధించి అడ్డులేకుండా చేసుకోవాలి. ఈ కేసులన్నిటినీ చాలా వివరంగా చిత్రించే బడా మీడియా బీజేపీకి సంబంధించిన వారిపై వచ్చిన ఆరోపణలను మాత్రం నామమాత్రంగా చెబుతుంది. ఎవరో ఎందుకు, అదానీ వార్తలే అమాంతం మారిపోయాయి. ఆయనపై అంతర్జాతీయంగా అనుమానాస్పద కథనాలు వచ్చినా విచారించింది లేకపోగా ఆదుకోవడానికే మోడీ ఆరాట పడ్డారు. ఆ క్రమంలో ఆయన లాభాలు గతంకంటే మరింత పెరిగాయనేది ఇప్పుడు మీడియా ఇష్టమైన స్టోరీ! కనుక సమాచారం వడపోత, మోడీ మోత ఏ స్థాయిలో వుంది తెలియడానికి ఈ ఉదాహరణ చాలదా?

కథ ఇంకా చాలా వుంది!

తాజాగా ప్రవేశపెట్టిన అనామతు బడ్జెట్ ఆర్థికంగా దేశదుస్థితిని కళ్లకుకడుతున్నది. దేశం అంతగా దూసుకుపోతుంటే ఎన్నికల కోసమైనా ఏవైనా తాయిలాలు, పథకాల మోత మోగించేవారు కదా? ఎలాగో ప్రహ సనం ముగించి మళ్లీ గద్దెక్కాలన్న ఆరాటం తప్పితే ప్రజానుకూల పథకాలు ఒకటైనా ప్రకటించ గలిగిందా? ఓట్ల కోసమైనా రాష్ట్రాలకు మేలు చేసిందా? ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ప్రత్యేక హోదా, పోలవరం వంటి వాటిని పట్టించుకుకోక పోగా వైసీపీ, టీడీపీ భుజాలపైకెక్కి తన పబ్బం గడుపుకునే తాపత్రయమే సాగుతున్నది. తెలంగాణలోనూ కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బీఆర్ఎస్‌తో చెప్పిస్తూ మరోవైపు దాన్నీ బెదిరిస్తున్నది.తనతో వుందంటున్న జనసేనతోనూ దాగుడు మూతలాడుతున్నది. ఈ ప్రాంతీయ పార్టీలన్నీ కూడా స్థానిక అధికారం కోసమే పాకులాడుతూ కేంద్రాన్ని పల్లెత్తుమాట అనకుండా కీచులాడుకుంటున్న దుస్థితి. తెలంగాణలో అధికార పార్టీగా, ఏపీలో వైఎస్ షర్మిల నాయకత్వంలో కదలిక పెరిగిన పార్టీగా కాంగ్రెస్ కూడా బీజేపీపై సైద్ధాంతిక రాజకీయ పోరాటానికి, ఎన్నికల సమరానికి విశాల కలయిక అవసరం పూర్తిగా గుర్తించడం లేదు. ఏపీలో అన్నాచెల్లెళ్ల తగాదా ప్రధానమైతే, తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ యుద్ధం ముఖ్యమైపోయింది. మొన్న మూడు రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ అందరినీ కలుపుకుని వుంటే ఫలితాలు మారివుండేవి. తెలంగాణలోనూ మెజార్టీ పెరిగి మరింత నిలకడ వచ్చేది. ఇలాంటి లోపాలు కాంగ్రెస్‌వైపు ఇతర ప్రాంతీయ పార్టీల వైపు వున్న మాట నిజమే గాని బీజేపీకి తిరుగులేదనడం పాక్షిక సత్యం. బీజేపీయేతర బీజేపీ వ్యతిరేకశక్తుల ఉమ్మడి బలం వారి కంటే ఎక్కువ. ఎన్‌డిఎ కూటమిలో చెప్పుకోదగిన పార్టీ కొత్తగా చేరిన జెడియు మాత్రమే. ఎన్నికల పోరాట ఫలితాన్ని ముందే చెప్పేసి చేతులెత్తేయమనడం దురుద్దేశ పూరితం. కథ ఇంకావుంది. చేయవలసిందీ వుంది.

పోరాటాల రాములు... నీకు లాల్ సలాములు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ప్రపంచ స్థాయిలో ప్రత్యేక స్థానం ఉంది.సామాన్య ప్రజలు ఆయుధాలు ధరించి వెట్టికి వ్యతిరేకంగా, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా కుల మతాలకు అతీతంగా నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి ప్రజలు గెలిచిన పోరాటం అది...ఆ పోరాటానికి ఆయువుపట్టుగా నిలిచిన గ్రామమే ఉమ్మడి నల్లగొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని కర్విరాల కొత్తగూడెం.ఆ ఊరు పేరు చెప్పగానే పోరాటం గుర్తుకొస్తుంది... ఎర్రజెండానెత్తిన వీరులు గుర్తుకొస్తారు. ముఖ్యంగా భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వర్దెల్లి వీరులు (బుచ్చి రాములు) గుర్తు కొస్తారు. గ్రామంలో ఒక సామాన్య గీత కార్మిక కుటుంబంలో 1945లో పుట్టిన ఎర్రమందారమే మన వర్దెల్లి రాములు. ఆయన చదివింది మూడోతరగతి కానీ మార్క్సిజం -లెనినిజం విధానాన్ని అర్థం చేసుకున్న నికార్సయిన కమ్యూనిస్టు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను అర్థం చేసుకుని తోటి సహచరులకు సునాయాసంగా చెప్పిన దిశాలి. పాటలంటే ఇష్టం...పార్టీ ఊరేగింపులో ముందుండి నినాదాలిచ్చి జైకొట్టి గాండ్రించిన నాయకుడు. తండ్రి వారసత్వంగా వచ్చిన కళావృత్తిని పన్నేండ్ల వయసులో చేపట్టి, గీత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, అధిక శిస్తులకు, అబ్కారీ అవినీతికి వ్యతిరేకంగా నిలబడ్డ నిస్వార్థపరుడు. 1978లో తుంగతుర్తి రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌గా మొట్టమొదటగా గెలిచాడు. కర్విరాల వాటర్ షెడ్ చైర్మన్‌గా గెలిచి సన్న, చిన్నకారు రైతులకు పంటరుణాలిప్పించి రైతులకు దగ్గరయ్యాడు. వాటర్‌షెడ్ చైర్మన్‌గా ఉండి వరద కాలువలు కట్టి చెక్‌డ్యాంలు నిర్మించి ప్రజలుమెచ్చిన ప్రజాప్రతినిధిగా నిలిచాడు.


- నెమ్మాది వెంకటేశ్వర్లు
9848720533

నిర్బంధాలెన్ని ఎదురైనా...

1980 సంవత్సరంలో... అప్పటి దాకా ఎర్రజెండాను చేతబట్టి సీపీఐ(ఎం)లో ముఖ్యమైన ప్రజా నాయకుడిగా ఉన్న కుశలవరెడ్డి పార్టీని విడిచి టీడీపీలో చేరారు. వాస్తవానికి కుశలవ రెడ్డి పేరు చెప్పితే చుట్టూరా గ్రామాల దొరలకు, కాంగ్రెస్ గుండాలకు హడల్. వర్దెల్లి రాములుకు రాజకీయ గురువు కుశలవ రెడ్డినే... గురువు వెంట నడవాలా? పార్టీ లైన్‌లో ఉండాలా? అనే సమస్య వస్తే వ్యక్తులు ముఖ్యం కాదు పార్టీ వైపు ఉండడమే ముఖ్యమని భావించి అన్న బుచ్చి రాములు మాట జవదాటని తమ్ముడే రాములు. వెంటనే కుశలవరెడ్డి గ్రూపు నుంచి కష్టాలు, నిర్బంధాలు, దాడులు, దౌర్జన్యాలు గ్రామంలో పెరిగాయి. రాజకీయా గురువు కుశలవరెడ్డికి దీటుగా గ్రామంలో ఉన్న యువకులను కూడగొట్టి రాజకీయా తర్ఫీదుతో పాటూ కర్రసాము, వడిచేల తిప్పడం, శత్రువుల నుండి ఎలా కాపాడుకోవాలో పైపార్టీ డైరెక్షన్‌లో శిక్షణ తీసుకున్నారు. మొట్టమొదటిసారిగా కుశలవరెడ్డికి ఎదురు నిలిచాడు రాములు.

చావును సవాల్ చేసిన ధైర్యశాలి

అది 1994 సంవత్సరం. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తర్వాత రోజు కుశలవ రెడ్డి మనుషులకు పార్టీ కార్యకర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. ఆ సందర్భంగా గుండాల గుంపును పార్టీ కార్యకర్తలు తరిమికొట్టారు. కానీ శత్రువులంతా ఒక దగ్గర పోగై వ్యవ సాయ బావి దగ్గర ఒక కామ్రేడ్‌తో ఉన్న రాములును చుట్టుముట్టి మారణాయుధాలతో తీవ్రంగా దాడి చేశారు. ఈ సందర్భంగా రాములు తన చావు తప్పదనుకొని గొడ్డలితో శత్రువులపై ఎదురుదాడి చేశాడు. కానీ ఆగ్రహంతో ఉన్న శత్రువులు రామన్న కాళ్లు, చేతులు నరికారు. ఇక చనిపోయాడని వదిలేసి వెళ్ళారు. కొనఊపిరితో ఉన్న రాములును హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ చేర్పించగా, చాలాకాలం పాటు చికిత్సపొంది ప్రాణాలతో బయటపడ్డాడు. వర్దెల్లి రాములు చిన్నకుమారుడు కృష్ణ ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ యూటీఎఫ్‌లో పని చేసేవారు. ఆయన భార్య అరుణ కర్విరాల కొత్త గూడెం సీపీఐ(ఎం) నుండి 2006లో ఎంపీటీసీగా గెలిచారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎంపీటీసీ స్థానం ఉంటే ఎంపీపీ అయ్యే అవకాశం ఉంది. 'మన అరుణను ఎంపీపీ చేస్తాం. మా వైపు రండి అని ఒత్తిడి చేశారు. రూ.10లక్షలు ఇస్తాం' అని, తమ పార్టీలో చేరమని ఆశ చూపారు. ఆ సమయంలో వర్దెల్లి రాములు ఆయన సతీమణి లింగమ్మ ఒక్కటే చెప్పారు. 'చావనైనా చస్తాము కాని పార్టీ మారం. అమ్ముడుపోయే పరిస్థితి ఉండదు' అని ఆ నాయకులకు తెగేసి చెప్పారు. దీంతో వారికి ఎంపీపీ అయ్యే అవకాశం లేకుండా చేసి పార్టీ నిర్ణ యాన్ని కట్టుబడి ఉన్నారు.




నిబద్ధతకు నిదర్శనం వర్దెల్లి సోదరులు

వాస్తవానికి గ్రామం వదిలితే పెద్ద నాయకుడయ్యే అవకాశం ఉంది.. తన అన్న వర్దెల్లి బుచ్చి రాములు (తుంగతుర్తి, సూర్యాపేట) ఉమ్మడి తాలూకా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. రాములు ఊర్లో లేకపోతే కుశలవరెడ్డి కార్యకర్తలను మిగలనీయడు. కార్యకర్తలకు రక్షణ లేక చెదిరిపోతారు. రాములు కొత్తగూడెంలో ఉంటేనే చుట్టూరా గ్రామాల్లో పార్టీ నిలబడుద్ది అని బుచ్చి రాములు డైరెక్షన్ ప్రకారం ఊరిని అంటి పెట్టుకొని నిలబడ్డాడు. పార్టీని కుశలవ రెడ్డి గుంపు నుండి కాపాడుకునేందుకు రాములు ఇద్దరు కుమారులు శ్రీహరి (ఇంజనీరు), కృష్ణ (ఉపాధ్యాయుడు) కర్ర పట్టుకుని కార్యకర్తలకు అండగా నిలిచారు. శ్రీహరి, భార్య లక్ష్మీ దంపతులిద్దరు సూర్యాపేటలో కౌన్సిలర్లుగా పనిచేశారు. వర్దెల్లి రాములు చనిపోయే వరకు పార్టీలో కొనసాగుతూ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తల మధ్య ఎర్ర జెండా పాటలు పాడుతూ అందరినీ ఉత్సాహపరుస్తూ ఉండేవాడు. చాలాకాలం నుండి వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రాములు 79 ఏండ్ల వయసులో గత నెల 25న నిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన స్వగ్రామం కర్విరాల కొత్తగూడెంలో వేలాది మంది అభిమానులు, కార్యకర్తల మధ్య అంతిమయాత్ర జరిగింది. కడసారి చూపునకు చుట్టు పక్కల ప్రజలు హాజరై అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. తన జీవితంలో కమ్యూనిస్టు కార్యకర్తగా, ఉద్యమ నాయకునిగా మచ్చలేని జీవితాన్ని గడిపిన రాములు నేటి తరానికి ఆదర్శం. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరుతూ కామ్రేడ్ వర్దెల్లి రాములుకు జోహార్లు.

(నేడు కర్విరాల కొత్తగూడెంలో వర్దెల్లి రాములు సంతాపసభ)

> **అది 1994 సంవత్సరం. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తర్వాత రోజు కుశలవ రెడ్డి మనుషులకు పార్టీ కార్యకర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. ఆ సందర్భంగా గుండాల గుంపును పార్టీ కార్యకర్తలు తరిమికొట్టారు. కానీ శత్రువులంతా ఒక దగ్గర పోగై వ్యవసాయ బావి దగ్గర ఒక కామ్రేడ్‌తో ఉన్న రాములును చుట్టుముట్టి మారణాయుధాలతో తీవ్రంగా దాడి చేశారు. ఈ సందర్భంగా రాములు తన చావు తప్పదనుకొని గొడ్డలితో శత్రువులపై ఎదురుదాడి చేశాడు. కానీ ఆగ్రహంతో ఉన్న శత్రువులు రామన్న కాళ్లు, చేతులు నరికారు. ఇక చనిపోయాడని వదిలేసి వెళ్ళారు. కొనఊపిరితో ఉన్న రాములును హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ చేర్పించగా, చాలాకాలం పాటు చికిత్సపొంది ప్రాణాలతో బయటపడ్డాడు.**

గుడ్డిభక్తి



"రావోయ్ కృష్ణా! చాలా రోజులకు తీరిక దొరికినట్లుంది!" అంటూ స్నేహితుడిని ఇంట్లోకి ఆహ్వానించాడు రాము.

"ఏం చేస్తాం! అంతా బిజీ లైఫ్! తీరిక దొరకటం లేదు! అంతా క్షేమంగా ఉన్నారా?" అంటూ పలకరించాడు కృష్ణ.

అవీ ఇవీ మాట్లాడుకుంటూ రాజకీయాల వైపు చర్చ మళ్ళింది!

నీవు ఎన్నైనా చెప్పు! గత పదేళ్ల మన దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయం! ఎంత అభివృద్ధి? ఎన్ని గొప్ప చట్టాలు? ఎన్ని మార్పులు? ఇంతటి ఘనమైన మార్పు ఎవరూ ఊహించలేదు! నభూతో నభవిష్యత్ అన్నంతగా మారింది! ఒక్క మాటలో చెప్పాలంటే 2014లోనే స్వాతంత్ర్యం వచ్చిందనుకో! తన్మయత్వంగా అన్నాడు రాము.

నిజమా! 1947లో వచ్చిన స్వాతంత్ర్యం అనేక మంది త్యాగమూర్తుల పోరాట ఫలితంగా వచ్చిందని చిన్నప్పుడు మనం పుస్తకాలల్లో చదివినట్లు గుర్తు! మరి ఇప్పుడు ఎవరి త్యాగం వల్ల స్వాతంత్ర్యం వచ్చిందంటావ్! అన్నాడు కృష్ణ.

ఊహించని ప్రశ్నకు ఖంగుతిన్నాడు రాము! అయినా తమాయించుకున్నాడు. "ఒకే ఒక్క వ్యక్తి కారణంగా ఇది సాధ్యమయ్యింది! ఆయన అపార మేధస్సు. సునిశిత పలరిశీలన, దేనికీ భయపడని ధీరత్వం మొ॥ కలి,. మన దేశ రూపు రేఖలే మార్చివేశాయి. అందుకే స్వాతంత్ర్యం వచ్చిందంటున్నాను" అన్నాడు రాము.

"అయితే ఆ ఒక్క మనిషి దేశంకోసం ఎలాంటి త్యాగం చేయలేదంటావు!" అన్నాడు కృష్ణ.

"ఎందుకు ఆయన్ను విమర్శిస్తారు! ఆయన దేశం కోసం తన కుటుంబాన్ని వదులుకున్నాడు!

తల్లికి కూడా దూరంగా ఉన్నాడు! ఇంత కన్నా ఇంకేం చేయాలి!" అన్నాడు రాము.

"దేశం కోసం తన తండ్రిని, నాయనమ్మను కోల్పోయానని రాహుల్ గాంధీ అంటున్నాడు!" అన్నాడు కృష్ణ.

"అయితే నీవు కాంగ్రెస్ వాదివన్నమాట!" అన్నాడు రాము.


"నేను కాంగ్రెస్ వాదిని కాను. ఏ వాదినీ కాను. సగటు మనిషిని. నా కోసం ఎవరు ఏం చేసారో అన్నదే నాకు ముఖ్యం!"అన్నాడు కృష్ణ.

"మొత్తం పరిపాలనే నీ కోసం జరుగుతున్నది! అది అర్థం చేసుకో!" అన్నాడు రాము.

"నిజమా! మచ్చుకు రెండు వదులు!" అన్నాడు కృష్ణ.

"నీ కోసమే డీమానిటైజేషన్ చేసి, నల్లధనం వెలికి తీశాడు!" అన్నాడు రాము.

"బయటకు వచ్చిన నల్లధనం ఎంతో ఈ రోజుకీ లెక్క చెప్పలేదు. రిజర్వు బ్యాంకు చెప్పిన దాని ప్రకారం. నల్లధనం రాలేదు! కాని చిన్న చిన్న వ్యాపారులు దెబ్బ తిన్నారు. ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయింది! నల్ల ధనం బయటకు తెప్పించి, అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామన్నారు! కానీ గత గత పదేళ్లలో రూ.15 కూడా అకౌంట్లలో పడలేదు! అన్నాడు కృష్ణ.



"నీ కోసం అంటే సగటు మనిషి కోసం ఎన్ని చట్టాలు మార్చాడు దాని వల్ల ఎంతో మనకు లాభం జరిగింది!" అన్నాడు రాము.

"మార్చిన చట్టాలేవీ నాలాంటి వాళ్ళకు లాభం కలిగించలేదు. పైగా ఎంతో నష్టాన్ని కల్గించాయి! కార్మికులు ఎన్నో ఏళ్ళు పోరాడి త్యాగాలు చేసి, సాధించుకున్న కార్మిక చట్టాలను, లేబర్ కోడ్స్ అనే పేరుతో యజమాన్యాలకు అనుకూలంగా మార్చి వేశాడు. మీ పెద్దాయనకన్నా బ్రిటీషోడే నయం! కార్మికులకు అనుకూలంగా కొన్ని చట్టాలు చేశాడు" అన్నాడు కృష్ణ.

"అదిగో నీకు దేశభక్తిలేదు! అందుకే బ్రిటీష్ వాడికి సపోర్టు చేస్తున్నావు!" అన్నాడు రాము.

"ఆక్సిడెంట్ జరిగితే కేవలం రెండేళ్ల జైలు శిక్ష, లేదా జరిమానా మాత్రమే ఉండేలా బ్రిటీష్‌వాడు చట్టం చేశాడు. కాని ఆక్సిడెంటుని హత్యానేరంగా మార్చుతూ ఐదేండ్ల జైలు శిక్షతో పాటు రూ.పదిలక్షల జరిమానాగా మార్చుతూ మీ పెద్దాయన చట్టం చేశాడు. నీవు కారు డ్రైవింగ్ చేస్తావు కదా! ఎప్పుడైనా హత్య చేయాలని ప్రయత్నించావా?" ప్రశ్నించాడు కృష్ణ.

"మనందరం గుళ్లో పూజ చేయాలని, రాములవారికి అయోధ్యలో గుడి కట్టించాడు!" అంటూ మాట మార్చాడు రాము.

"మనకు భద్రాచలం రాముడి దయ చాలదా! అయోధ్య రాముడి దయే కావాలా? అయోధ్య రాముడు మాత్రమే ఒరిజినలా? మిగిలిన రాముళ్ళంతా డూప్లికేటా? అయినా ఒక గిరిజన మహిళను గుళ్లోకి రానివ్వని అయోధ్య రాముడి కన్నా, గుడి బయటకే వచ్చి, అందరి ముందూ పెళ్లి చేసుకునే భద్రాచలం రాముడే నాకు కావాలి" అన్నాడు కృష్ణ.

"ఇప్పుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను రూపురేఖలు మార్చుకునేలా చేస్తోంది! ప్రపంచంలో మనది మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిపోయింది! ఇదంతా మా పెద్దాయన చలవే. గత 60 ఏళ్లలో పదిశాతం అభివృద్ధి సాధిస్తే కేవలం పదేండ్లలో 90 శాతం అభివృద్ధి సాధించాము!" అన్నాడు రాము.

"ఊర్లోని దొర పొలమూ, నా పొలమూ కలిసి వందెకరాలు అని ఒక ఆసామీ చెప్పేవాడు. దొర పొలము 99 ఎకరాలైతే, ఆసామీ పొలము ఒక్క ఎకరానే! మన ఆర్థిక వ్యవస్థ బండారమూ అంతే! దేశంలోని కష్టజీవులు సృష్టించిన సంపదంతా. అంబానీలకు, ఆదానీలకు వెళ్ళిపోతోంది! దేశంలోని పేదరికం పెరిగిపోతుంది! పదేళ్ళలో నీ ఆస్తి ఎంత పెరి గింది! ఎన్ని కోట్లు సంపాదించావు!" అడిగాడు కృష్ణ.

"ఎక్కడి కోట్లు, ఎట్లా సంపాదిస్తాను, వస్తున్న జీతంలో 30శాతం ఆదాయపన్ను కడుతుంటే, డబ్బులు ఎట్లా మిగులుతాయి!" అన్నాడు రాము.

"అదీ అసలు విషయము! గత పదేళ్ళలో జీతం ద్వారా బతికే నీవు అభివృద్ధి చెందలేదు వ్యవసాయం చేసుకుని బతికే రైతు అభివృద్ధి చెందలేదు! అడ్డమీద పని చేసుకుని బతికే కూలి కనీస అవసరాలు కూడా తీరలేదు! అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలు పెరగలేదు! ఒక పరిశ్రమ లేదు! ఒక్క ప్రాజెక్టు లేదు! పట్టుమని పదిమందికి ఉపాధి దొరకలేదు! పేదవాడు చదువుకునేందుకు ఒక్క విశ్వవిద్యాలయము నిర్మించలేదు! ఇవన్నీ నిజాలేనా కాదా!" అడిగాడు కృష్ణ. తలదించుకున్నాడు రాము.

"మరింకేమి అభివృద్ధి చెందిందో తెలుసా! ఆదానీ, అంబానీల ఆస్తులు! ఆ ఆస్తులు ఎలా పెరిగాయో తెలుసుకోకుండా మనలాంటి వారికి అయోధ్య రాముడిపై భక్తి, పాకిస్తాన్, చైనాలపై ద్వేషము పెంచుతున్నారు! ఈ రంధిలో పడి మనలోమనమే కొట్టుకుని పోతున్నాము. ఇప్పటికైనా మనలాంటి వాళ్ళంతా కళ్లు తెరవటం అవసరం! అన్నాడు కృష్ణ.

- ఉషాకిరణ్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

పదవి కాలం ముగిశాక చెక్ పవర్ ఇచ్చిన అధికారులపై న్యాయపోరాటం చేస్తా

- వెంకటాపురం అప్పటి ఉప సర్పంచ్ కృష్ణకుమారి

నవతెలంగాణ-వేంసూరు



తీర్మానాలు లేని చెక్కులకు సంతకాలు చేయనందుకు అధికారాన్ని అడ్డుపెట్టుకొని రద్దు చేశారని ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వి.వెంకటాపురం గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచి ఎర్ర సాని కృష్ణ కుమారి అన్నారు. శనివారం వెంకటాపురం గ్రామపంచాయతీ కార్యాలయం నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 21-03-2020 తీర్మానం లేని చెక్కుపై సంతకం చేయాలని పంచాయతీ కార్యదర్శి బలవంతం పెట్టిన సంతకం చేయనందుకు ఫోర్జరీ చేసిన తీర్మానాలు పెట్టి అధికారాలు ఉపయోగించుకొని చెక్ పవర్ రద్దు చేయడంతో 2020 ఏడో నెలలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. నాటి నుండి ముఖ్యమంత్రి నుండి మంత్రులు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెండుసార్లు తూతూ మంత్రంగా విచారణ చేసి రాజకీయ అండదండలతో కాలయాపన చేస్తూ వచ్చారని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే జిల్లా స్థాయి నుండి మండల స్థాయి అధికారుల వరకు పట్టించుకోలేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయపోరాటానికి వెళ్ళటంతో తప్పించుకునే క్రమంలో జనవరి 30న చెక్ పవర్ ఇస్తూ ఆర్డర్ కాపీని పోస్టు ద్వారా పంపారు. ఫిబ్రవరి 3న ఉపసర్పంచ్కి ఇస్తున్నట్లుగా అందింది. తను తప్పు చేసినట్లుగా చెక్ పవర్ రద్దుచేసి నాలుగు సంవత్సరాల పాటు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అధికారం పోయిన తర్వాత తప్పించుకునే దానికి పదవి ముగిసిన తర్వాత చెక్ పవర్ ఇస్తున్నట్టుగా చూపిన అధికారులపై న్యాయస్థానానికి వెళ్లినట్టు తెలిపారు. అధికారులు ప్రలోభాలకు ఆశపడి చెక్కు పవర్ రద్దుచేయించిన వారిపై ఎమ్మెల్యే సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ వార్డు నెంబర్లు బండి సునీత, కొండ్రు కృష్ణారావు, గండ్ర పుష్పావతి, స్థానిక నాయకులు జంగా శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, చిలుకూరు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, ఎస్కె. నాగుల మీరా తదితరులు పాల్గొన్నారు.

'మిస్ట్'లో ముగిసిన బీటెక్, ఎంటెక్ విద్యార్థుల వర్క్‌షాప్

- తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన విద్యార్థులు

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లిలోని మదర్ థెరెసా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్, ఎంటెక్ ట్రిపుల్‌ఈ విద్యార్థులకు మూడురోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. సిములేషన్ ఆఫ్ పవర్ కన్వర్టర్ పెడ్‌డ్రైవ్స్‌పై జరిగిన ఈ వర్క్‌షాప్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. మెంటర్స్ డాక్టర్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ వీవీ రామారావు పాల్గొని భవిష్యత్‌లో విద్యార్థులకు ఎక్కువగా ఉపయోగపడే ఎలక్ట్రిక్ వాహనాలు, సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేట్ అయ్యే పవర్ కన్వర్టర్లు, డ్రైవ్‌లను రూపొందించడం, వాటి ఆపరేషన్‌ను వివిధ సిములేషన్ సాఫ్ట్‌వేర్స్ ద్వారా చేసే విధానాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీంతో పాటు డీసీ మోటారులో ఓపెన్, క్లోజ్డ్ కంట్రోల్ లూప్స్‌ను మ్యాట్‌ల్యాబ్ ద్వారా కంట్రోల్ చేసే విధానాన్ని వివరించారు. ఫజీ బేస్డ్‌తో బీఎల్‌డీసీ మోటారు, డీసీ మోటారు స్పీడును ఎలా కంట్రోల్ చేసే విధానాన్ని చూపించారు. వీటిపై విద్యార్థులు అడిగిన పలు సందేహాలను మెంటర్స్ నివృత్తి చేశారు. వర్క్‌షాప్ ముగింపు సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతికతో కూడిన స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ రామచంద్రరావు, ఈఈఈ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ వై రాజశేఖరరెడ్డి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

నవతెలంగాణ-వైరాటౌన్

ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని సీఐటీయూ వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు పిలుపునిచ్చారు. శనివారం ఈనెల 16వ తారీఖున జరిగే దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన కార్మికులు వైరా ఎంఈఓ ఆఫీస్‌లో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా అనుమోలు రామారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బత్తుల ప్రమీల, రూప, సుధా, సైదా, మాధవి, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కల్లూరు

మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 16 నుండి సమ్మెలో దిగుతామని శనివారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలనితదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 16వ తేదీన జరిగే సమ్మెకు నోటీసును మండల విద్యాశాఖ కార్యాలయంలో షఫీకి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్‌రావు, మధ్యాహ్న భోజన కార్మికులు రమాదేవి, మారెమ్మ చిట్టెమ్మ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావుతో కలిసి భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. ఆలయానికి వెళ్లిన బీఆర్ఎస్ నాయకుల బృందం శ్రీసీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. హరీశ్‌రావు, సండ్రతో పాటు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదనరావు, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, టీఎస్ఎంఎస్ఐడీసీ మాజీ ఛైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ దిండిగాల రాజేందర్ భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

6 ఏండ్ల చిన్నారితో వృద్ధుడు అసభ్యకర ప్రవర్తన

ఫోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-వైరా

అభంశుభం తెలియని చిన్నారి అల్లారు ముద్దుగా ఆడుకుంటుంటే 70 ఏళ్ల వృద్ధుడి పాపపు కళ్ళు కామంతో మూసుకు పోయి చిన్నారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన మండలం లోని గోల్లేన పాడు గ్రామం లో జరిగింది. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు వృద్ధుడి పై శుక్రవారం అర్ధరాత్రి వైరా పోలీస్ స్టేషన్లో ఫోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా వైరా మండలం గొల్లెనపాడు గ్రామానికి చెందిన చెరుకూరి లాలయ్య (70) అనే వృద్ధుడు శుక్రవారం వీధిలో ఆడుకుంటున్న అదే గ్రామానికి చెందిన ఆరేళ్ల చిన్నారిని దగ్గరకు పిలిచి చిన్నారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దాంతో ఆ చిన్నారి లాలయ్య చేసిన వెకిలి చేష్టలను తన తండ్రికి తెలపింది. దీంతో చిన్నారి తండ్రి వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ నిర్వహించి వృద్ధుడు లాలయ్య మీద పోక్సో కేసు నమోదు చేశారు.

ఇద్దరు రౌడీషీటర్లు, ఐదుగురు అనుచరులు అరెస్ట్

పోలీస్ కమిషనర్ సునీల్ దత్

నవతెలంగాణ-ఖమ్మం

దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్న రౌడీషీటర్ ఆవుల అశోక్‌తో పాటు తన ఐదుగురు అనుచరులను అరెస్ట్ చేసి 15 రోజుల రిమాండ్ కు తరలించినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. నేర ప్రవృత్తి కలిగిన ఆవుల అశోక్ గత అర్ధరాత్రి తన అనుచరులతో కలసి నగరంలోని బైపాస్ రోడ్డులో గల ఓ రెస్టారెంట్ పై కర్రలతో దాడి చేసి రెస్టారెంట్ సంబంధించిన వ్యక్తులను గాయపరచడంతో పాటు ఫర్నిచర్ ధ్వంసం చేసి, దుర్భషలాడుతూ.. బెదిరించిన ఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు ఖమ్మం టూ టౌన్ పోలీసు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఇటీవల రెస్టారెంట్ పార్కింగ్ గోడలపై న్యూ డెమోక్రసీ పార్టీకి పెయింటింగ్ రాయడం విషయంలో రెస్టారెంట్ నిర్వహకులతో రౌడీషీటర్ కు మధ్య జరిగిన వివాదాన్ని మనస్సులో పెట్టుకొని తన అనుచరులతో కలిసి దాడి చేశాడని తెలిపారు.

అరెస్టు అయిన నిందుతులు

ఖమ్మంకు చెందిన ఆవుల అశోక్ , గొడ్డిటి అశోక్, బచ్చలకుర పుల్లయ్య, కొణిజర్ల మండలం తీగల బంజారకు చెందిన నునావత్ శ్రమ, తిరుమలాయపాలెం మండలం బచ్చోడుకు చెందిన తిమ్మడ హనుమంత రావు, కొణిజర్ల మండలం రామనర్సయ్య నగర్ చెందిన గడ్డం లక్ష్మణ్, అదేవిధంగా ఖమ్మం వన్ టౌన్ పరిధిలోని పాత నేరస్థుడు పెరెల్లి ప్రవీణ్ కుమార్ ను వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. నగరంలోని ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ముసుగులో దందాలు చేసే కరుడుకట్టిన నేర స్వభావం కలిగిన రౌడీషీటర్ అయిన పేరెల్లి ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి నగరంలోని జిల్లా పరిషత్ సెంటర్ లో గల డ్రు గోల్డ్ ఆర్గనైజేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి 6 లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించకుండా తప్పించుకొని తిరుగుతూ.. డబ్బులు ఆడిగితే చంపుతానని, బెదిరిస్తున్నాడని కంపెనీ అధికారుల ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. గతంలో ఓ హత్య కేసుతో పాటు దోపిడీ, దౌర్జన్యలు, హత్యాయత్నం వంటి మూడు కేసుల్లో నేరాలు రుజువు కావడంతో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తనతో జైలు నుండి విడుదలై తిరిగి నేర ప్రవృత్తి కొనసాగిస్తున్నాడని తెలిపారు. గతంలో ఇతనిపై ఖమ్మం, నల్గొండ జిల్లాలో 21 కేసుల్లో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి బెయిల్ పై తిరుగుతున్న పెరెల్లి ప్రవీణ్కుమార్ ఏదైనా భూ వివాదం ఉంటే తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా అక్రమించడం, బాధితులపై దౌర్జన్యం చేయడం, అడ్డుకున్న వారిని చంపుతానని బెదిరించడం నైజంగా మారిందని తెలిపారు.

గామీణ బంద్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఖమ్మం

: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నాలుగు లేబర్ కోడ్స్, విద్యుత్ బిల్లు రద్దు చేయాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య అన్నారు. శనివారం ఖమ్మంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్టియు ఖమ్మం ఏరియా కమిటీ సమావేశం కంకణాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు వాటాలు అమ్మడం ప్రైవేట్ పరాం చేయడం ఆపాలని, కాంట్రాక్టు విధానం రద్దుచేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మిట్ చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం శాఖలో ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్ని భర్తీ చేయాలనే డిమాండ్స్‌తో దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు , రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మె గ్రామీణ బందును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎఫ్టియు ఖమ్మం ఏరియా కార్యదర్శి కే. శ్రీనివాసు, నాయకులు పెరబోయిన వెంకన్న, బొమ్మకంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కూసుమంచి



మండలంలోని పోచారం గ్రామంలో శనివారం కల్లు గీత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ కల్లుగీత కార్మికుల సంఘం మండల కార్యదర్శి రెడ్డిమల్ల వెంకటయ్య గౌడ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సర్పంచి రెడ్డిమల్ల వెంకటయ్య, ఉప సర్పంచ్ రెడ్డిమల్ల వెంకన్న, రాతికింది సత్యం, రెడ్డిమల్ల చిన్న వీరభద్రం, ఉర్లకొండ మధు, రెడ్డిమల్ల చిన్న వెంకన్న, బుడిగె చిన్న కనకయ్య కుక్క శంకర్, బుడిగె రాములు, రెడ్డిమల్ల రాములు, రెడ్డిమల్ల చిన్న ఉపేందర్, మొక్క వెంకన్న, గుండ్ల కిరణ్, రెడ్డిమల్ల అప్పయ్య, కుక్క పెద్ద వెంకన్న శోభనబోయిన సోమయ్య, జటంగి లింగయ్య, కుక్క బ్రహ్మం, మండల సోషల్ మీడియా (కన్వీనర్) రెడ్డిమల్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన కోనాయిగూడెం





- ఘనంగా నరసయ్య సంస్మరణ సభ
- హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని, బండి రమేష్
- ఎర్రజెండా ముద్దుబిడ్డ నరసయ్య సేవలు
- నేటి తరానికి స్ఫూర్తిదాయకం
- ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి

నవతెలంగాణ నేలకొండపల్లి

సీపీఐ(ఎం) సీనియర్ నేత కోనాయిగూడెం ఎర్రజెండా ముద్దుబిడ్డ తిగుళ్ల నరసయ్య పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన సేవలు, కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. శనివారం మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పార్టీ నేత తిగుళ్ల నరసయ్య సంస్మరణ సభలో ఆయన ముఖ్యంగా అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నరసయ్య స్మారక స్థూపాన్ని పార్టీ మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాలతో గ్రామం మారుమోగింది. అనంతరం జోన్ కమిటీ బాధ్యులు పగిడికత్తుల నాగేశ్వరావు అధ్యక్షతన జరిగిన సభలో పోతినేని మాట్లాడుతూ తిగుళ్ల నరసయ్య కుటుంబం మొత్తం పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. కోనాయిగూడెం గ్రామంలో రైతు కూలి పోరాటాలతో ప్రజలందరిని ఐక్యం చేసి పార్టీని అగ్ర భాగాన నిలపడంలో నరసయ్య చేసిన కృషి చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని ప్రతి కార్యకర్త అంకితభావంతో ముందుకు తీసుకెళ్లాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్ మాట్లాడుతూ నరసయ్య ఎర్రజెండా పట్ల ఎనలేని అభిమానంతో ప్రజలందరిని ఐక్యం చేసి ప్రజా ఉద్యమాలను నిర్మించారన్నారు. ఎవరైనా తమ మరణానంతరం ఎంత సంపాదించాడనే కొలమానంగా భావిస్తారని నరసయ్య మాత్రం ఆస్తిపాస్తుల కన్నా ప్రజల ఆదరాభిమానాలు, ఎర్రజెండాను అగ్రభాగాన నిలపడమే లక్ష్యంగా భావించి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అందుకు ఇక్కడికి వచ్చిన జనసంద్రమే ప్రత్యక్ష సాక్షమన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో రానున్న కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఉద్యమించడమే నరసయ్యకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు, నాయకులు ఏటుకూరి రామారావు, రచ్చ నరసింహారావు, భూక్య కృష్ణ, బెల్లం లక్ష్మి, కట్టెకోల వెంకన్న, మందడపు మురళీకృష్ణ, మీగడ లింగరాజు, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి బోయినపల్లి కొండలరావు, బోయినపల్లి వీరయ్య పాల్గొన్నారు.

విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న 'హార్వెస్ట్' కు అభినందనలు





- మంత్రి తుమ్మల
- నూతన విద్యారంగాభివృద్ధిలో 'హార్వెస్ట్' మేటి :
- డీఈవో సోమశేఖర శర్మ
- ఒత్తిడిలేని, బాల్యానికి భరోసా 'హార్వెస్ట్' అభిమతం :
- కరస్పాండెంట్ రవిమారుత్

నవతెలంగాణ-ఖమ్మం

విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న 'హార్వెస్ట్' కు అభినందనలు అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఖమ్మంలోని హార్వెస్ట్ పాఠశాలలో 22వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు , జిల్లా విద్యాశాఖాధికారి ఇ. సోమశేఖర శర్మ గారు, హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవిమారుత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నేటి సమాజంలో పోటీతత్వం బాగా పెరిగిందని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో ఎన్నోమార్పులు చోటుచేసుకుంటున్నాయని, అందుకు అనుగుణంగా సువిశాల ప్రాంగణంలో హార్వెస్ట్ పాఠశాలను నెలకొల్పి గత రెండు దశాబ్దాలకు పైగా విజయవంతంగా ముందుకు వెళుతూ, ఎంతోమందిని ఉన్నత విద్యాలయాలకు పంపిన ఘనత 'హార్వెస్ట్' పాఠశాలకు సొంతమని, చక్కటి ఈ అవకాశాలను వినియోగించుకొని భవిష్యత్తు చక్కగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఇ. సోమశేఖర శర్మ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకనుగుణంగా విద్యావిధానంలో ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ బోధించాలన్నారు. విద్యార్థులకు బోధించే పద్ధతులలో పర్క్ లెర్న్ పద్ధతిలో పాఠం నేర్పిస్తే జీవితకాలం గుర్తుంటుందని సూచించారు. ప్రధానంగా సైన్స్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఈ పద్ధతిని అవలంబించి విద్యార్థులకు చదువునేర్పిస్తే శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తి చూపుతారని తెలిపారు. చిన్నారులలో దాగిఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హార్వెస్ట్ ఇటువంటి కృషి జరపడం అభినందనీయమన్నారు. హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ మాట్లాడుతూ

ఒత్తిడిలేని విద్యను అందిస్తూ, బాల్యానికి భరోసాను అందించమే హార్వెస్ట్ విద్యాసంస్థల అభిమతమని, పాఠశాల విద్యలో అనేక మార్పులకు సమయం వచ్చిందని అన్నారు. రేపటి తరానికి కావలసిన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, విద్యార్థినీ, విద్యార్థులు సమాయత్తం కావాలని, ఉన్న అవకాశాలను అన్నింటినీ వినియోగించుకొని, శ్రమకి, పరిశోధనకి, సృజనాత్మకతకు ప్రాధాన్యతను ఇవ్వాలని అన్నారు. సూత్రాలను వల్లెవేయడంకాక, అన్వయించటాన్ని నేర్పాలని ఉపాధ్యాయులను కోరారు. తల్లిదండ్రులు తమ కోరికలకు అనుగుణంగా పిల్లలను ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. ఇంటిపనిలో చిన్న చిన్న అవసరాలలో తోడ్పడటానికి కావల్సిన శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులు గ్రహించాలని కోరారు. ప్రిన్సిపాల్ పార్వతీ రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల్లో చదువుతోపాటు శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించి విద్యార్థులకు విలువైన అవగాహన కల్పించడంలో ఎప్పుడూ ముందుంటున్నాయని, సైన్స్ ఫెయిర్ కి సంబంధించి తమ విద్యార్థులకు ఎంతో అవగాహనను పెంపొందించడం వల్ల తమ విద్యార్థులు అనేక చోట్ల జరిగిన సైన్స్ ఫెయిర్లో పలు పతకాలను పొందారని, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలలో గెలుపొందిన వివరాలను వార్షిక నివేదికలో తెలిపారు. తమ విద్యార్థులు ప్రస్తుత పోటీ పరీక్షలలో ప్రపంచస్థాయిలో పోటీ పడుతున్నారని, దేశంలో, ప్రపంచంలోని పలు ఉన్నత విశ్వవిద్యాలయాలలో విద్యనభ్యసించడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం నూతన బోధనా పద్ధతులపై శిక్షణ ఇస్తున్నామన్నారు. బోధనలో పరిపూర్ణతకి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. అందుచేత విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నారన్నారు. ఆద్యంతం ఆహ్లాదభరితంగా జరిగిన వార్షికోత్సవ వేడుకలో చిన్నారుల నృత్యాలు, యోగా, కరాటే, పిరమిడ్, కర్రసాము విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, హార్వెస్ట్ విద్యాసంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పదవిపోయిందని

బాధపడాల్సిన అవసరం లేదు

- మళ్లీ అవకాశం రావచ్చు.. ప్రజల్లో ఉండి పనిచేయండి

- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నవతెలంగాణ-తల్లాడ

"పదవిపోయిందని బాధపడాల్సిన అవసరం లేదు మళ్లీ అవకాశం రావచ్చు, ప్రజల్లో ఉండి పనిచేయండి" మాజీ సర్పంచులకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దిశా నిర్దేశం చేశారు. మండల పరిధిలోని అన్నారుగూడెం శ్రీ మహాలక్ష్మి కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన మండల సర్పంచ్ల వీడ్కోలు సభలో మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాజీ సర్పంచ్లను సన్మానించి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి సర్పంచ్లు చేసిన సేవలు అభినందనీయమన్నారు. ప్రజలకు సేవలు చేసిన సర్పంచులు చిరస్థాయిగా ప్రజల గుండెల్లో ఉంటారన్నారు. స్పెషల్ ఆఫీసర్ల పాలన వల్ల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. తాము ఓడిపోయిన, చేసిన అభివృద్ధి స్పష్టంగా కనబడుతుందన్నారు. మన పని విధానం మనకు గీటురాయి అన్నారు. ప్రజా సేవకులుగా ఉంటామని గతంలో కంటే ఎక్కువగా కార్యకర్తలకు అందుబాటులో ఉంటామన్నారు. పదవి ముఖ్యం కాదని కమ్యూనిస్టులు ఏ పదవిని ఆశించి పోరాడుతున్నారని గుర్తు చేశారు. అభివృద్ధి పనులను అధికారులు ప్రజాప్రతినిధులు నిలిపివేస్తున్నారని, ఇది సక్రమ పద్ధతి కాదన్నారు. అధికారంలో, ఎవరు ఉన్నా అభివృద్ధి పనులను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, అధికారులను రేషన్ డీలర్లను బెదిరిస్తున్నారని, అప్పుడే మనం తొందర పడాల్సిన అవసరం లేదు, కొంత సమయం ఇద్దాం అనంతరం, అవసరమైనప్పుడు ప్రశ్నిద్దాం అన్నారు. మౌనం అంగీకారం కాదని, కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామన్నారు. కేసీఆర్ గొప్ప పాలన అందించారని, నిత్యం ప్రజల్లో ఉండే పని చేస్తే, పార్టీని పట్టాలెక్కించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి.భద్రరాజు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆర్ వీరమోహన్ రెడ్డి, డి వెంకట్ లాల్, జెడ్పిటిసి సభ్యురాలు దిర్సాల ప్రమీల, సర్పంచ్, దుగ్గిదేవర సామ్రాజ్యం, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ యూసఫ్, జోనల్ చైర్మన్ దిరిశాల దాసరావు, బద్దం కోటిరెడ్డి, కేతినేని చలపతిరావు, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కోడూరు వీర కృష్ణ, సొసైటీ చైర్మన్ వీరభద్రం, మాజీ సర్పంచులు షేక్ షాదిక, శ్రీనివాసరావు, జొన్నలగడ్డ కిరణ్ బాబు, ఐలూరి లక్ష్మి, సేలం కోటిరెడ్డి వనిగండ్ల అలేఖ్య, వరపర్ల ఉమా, బద్దం నిర్మల కోసు వెంకట నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-తల్లాడ

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశాలను విజయవంతం చేయాలని తల్లాడ శాఖ పిలుపునిచ్చింది. మండలంలోని అన్ని పాఠశాలలకు వెళ్లి సమావేశాలను విజయవంతం చేయాలని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ నెల 4 న నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించే సమావేశాలకు ముఖ్యఅతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, ప్రముఖులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టిఎస్యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కే.శ్రీకాంత్, బి.సుధాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె.ఝాన్సీ రాణి, జె.వెంకటేశ్వర్లు, జి.పాపయ్య, బి.కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మధిర : ఈనెల 4వ తేదీ ఆదివారం రోజున నేలకొండపల్లిలో జరిగే టీఎస్ యుటిఎఫ్ ఖమ్మంజిల్లా స్థాయి విస్తృత కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని మధిర మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏ. వినోద్‌రావు, ఇ.వీరయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానికంగా వారు మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మధిర మండల ఉపాధ్యక్షులు యం. కస్తూరి బాయి, యస్‌కె. ఇబ్రహీం, కోశాధికారి బి. చెన్నయ్య పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : నేటి నుండి నేలకొండపల్లిలో జరిగే టిఎస్ యుటీఎఫ్ ఖమ్మం జిల్లా స్థాయి విస్తృత కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ స్థాయి పుస్తక సమీక్ష పోటీల్లో 34 మంది విజేతలు

- త్వరలోనే పుస్తకావిష్కరణ, బహుమతి ప్రదానోత్సవ సభ

- వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు

నవతెలంగాణ-ఖమ్మం

సమాజ హితం కోరి సాహిత్యాభివృద్ధి జరగాలనే తపనతో బాల సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థుల్లోనున్న ప్రతిభను వెలికితీసేందుకు వురిమళ్ల ఫౌండేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్షల పోటీల్లో 34 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్నమైన రీతిలో పోటీలను పెడుతూ, వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ, పుస్తక ప్రచురణలతో ముందుకు సాగుతున్న తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పుస్తక సమీక్షల పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి 200 మందికిపైగా విద్యార్థులు సమీక్షలు పంపారని తెలిపారు. వీరిలో 34 మందిని విజేతలుగా ఎంపిక చేశామని తెలిపారు. విద్యార్థులు చక్కటి సమీక్షలు రాసే ప్రయత్నం చేసారని, వారిని ఇంకా ప్రోత్సహిస్తే బాగా రాయగలరనే నమ్మకం కలిగిందని పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులకు ప్రోత్సాహకరంగా 34 సమీక్షలన్నింటినీ కలిపి పుస్తక రూపంలో తీసుకొస్తున్నట్లు తెలిపారు. విజేతలకు సమాన నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందచేయనున్నట్లు తెలిపారు. సమీక్షలు పంపించిన విద్యార్థులకు, చేయూతనందించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. త్వరలో ఖమ్మం కేంద్రంగా సమీక్షల పుస్తక ఆవిష్కరణ, విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరుగనుందని తెలిపారు.

నవతెలంగాణ
ఖమ్మం
6
ఆదివారం ఫిబ్రవరి 04, 2024 www.navatelangana.com

సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు రంగారావు మృతి

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు నల్లమోతు రంగారావు (65) అనారోగ్యంతో శనివారం లక్ష్మీపురం గ్రామంలో మృతి చెందారు. మృతునికి భార్య సత్యవతి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. నల్లమోతు రంగారావు లక్ష్మీపురం గ్రామంలో సీపీఐ(ఎం) అభివృద్ధికి నిరంతరం కృషి చేశాడు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికలలో సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గ అభ్యర్థి పాలడుగు భాస్కర్ విజయం కోసం గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాడు. అయితే గత కొంతకాలంగా నల్లమోతు రంగారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ తుళ్లూరు రమేష్, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యురాలు గుడ్డూరి ఉమ, లక్ష్మీపురం ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు సిపిఎం లక్ష్మీపురం శాఖ కార్యదర్శి గుడ్డూరి వెంకట నరసయ్య సిపిఎం సీనియర్ నాయకులు తాతా వెంకయ్య సిపిఎం లక్ష్మీపురం మాజీ శాఖ కార్యదర్శి పత్తి రాధాకృష్ణ, లక్ష్మీపురం మాజీ సొసైటీ అధ్యక్షులు ఉమ్మనేని కోటయ్య, లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ ఇరుగు శ్రీమతి, కెవిపిఎస్ నాయకుడు ఏసుపోగు బాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

జాతీయ కుష్టు నివారణ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో బని గండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించా రు. ఈ సందర్భంగా జనవరి 30వ తేది నుంచి ఫిబ్రవరి 13వ తేది వరకు జరిగే స్పర్శ్ కుష్టు వ్యాధి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పలత విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. కుష్టు వ్యాధి గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రమణారెడ్డి, సూపర్ వైజర్ కె.వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు శాయిరెడ్డి, సుధాకర్, అశోక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మజూర్ అహ్మద్, కళాశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, సుధ, అటెండర్‌లు సాయి, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ సేవా పశు వైద్య శిబిరాలు విజయవంతం

నవతెలంగాణ-బోనకల్

జాతీయ సేవా పథకంలో భాగంగా మండల పరిధిలోని రావినూతల, రామాపురం గ్రామాలలో ఖమ్మం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పశువైద్య శిబిరాలు విజయవంతంగా ముగిశాయి. ఈ శిబిరంలో అధ్యాపక బృందం, ప్రొఫెసర్లు, కళాశాల విద్యార్థులచే పశువులకు చికిత్సలు అందించారు. ఈ శిబిరంలో తిరిగి కట్టే పశువులు, గర్భకోశ వ్యాధులు, దూడలకు నట్టల నివారణ, వివిధ రకాల వ్యాధులు, పేడ పరీక్షలు నిర్వహించి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అధ్యాపక బృందం, వెటర్నరీ కళాశాల విద్యార్థులు, జిల్లా పశు వైద్యాధికారులు మాట్లాడుత9ఊ మేలైన పశు గ్రాసాల పోషక విలువలు, పాల ఉత్పత్తి, యాజమాన్యం పద్ధతులను వివరించారు. ఈ వైద్య శిబిరంలో పశువుల మండల పశు వైద్యుడు డాక్టర్ ఎర్రగుంట్ల అన్వేష్, సిబ్బంది గోపాల్‌రావు, నాగేంద్ర కుమార్, చిన్నయ్య శ్రీకాంత్, బోనకల్ మండలంలోని గోపాలమిత్రులు నాగుల్ మీరా, కరీం, అశోక్, నాగేశ్వరావు, వాసు, వీరయ్య, సురేష్, ప్రవీణ్, త్రివేణి, తదితరులు వైద్య సేవలు అందించారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వసంత

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మండల పరిధిలోని అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కొట్టే వసంత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన స్టాఫ్ నర్సింగ్ ఉద్యోగంలో 44 వ ర్యాంకు సాధించి ఉద్యోగం సంపాదించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గోసు రామారావు గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ ఒకటవ తరగతి నుండి 7వ తరగతి వరకు అయ్యవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో 8 నుండి 10వ తరగతి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భీమవరంలో ఇంటర్మీడియట్ బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివానని అన్నారు. నా విజయం వెనుక ఉన్న ఉపాధ్యాయులు, నా తల్లిదండ్రులు, వివేకానంద నర్సింగ్ అకాడమీ, సుజాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేశారు.

ప్రజాప్రతినిధుల సేవలు అభినందనీయం

నవతెలంగాణ-కామేపల్లి



కామేపల్లి మండలంలో పింజరమడుగు గ్రామ పంచాయతీలో ఐదు సంవత్సరాలు పూర్తి అయిన ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం శనివారం కొనసాగింది. ప్రజా ప్రతినిధులకు ఘనంగా గ్రామ పెద్దలుసాలువాలు బోకేలు పూలదండ లతో ఘనంగా సన్మానించారు. కామేపల్లి మండలం పింజరమడుగు గ్రామ పంచాయతీలో ఆగ్రామ పంచాయతీ సర్పంచ్ గుగులోత్ దేవి, ఉపసర్పంచ్ వింజం నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి అనురాధా వీరితోపాటు వార్డు మెంబర్, గ్రామ పంచాయతీ సిబ్బందిని గ్రామపెద్దలు పార్టీలకు అతీతంగా కలిసి పదవి విరమణ పొంది గ్రామ పంచాయతీ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషిచేసిన ప్రజా ప్రతినిధులను సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మూకర వెంకమ్మకు నివాళులు

నవతెలంగాణ-తల్లాడ



మండల పరిధిలోని సీపీఐ(ఎం) మల్లవరం సభ్యుడు మోకర భూషయ్య తల్లి, మూకర వెంకమ్మ (90) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, గోపాల్పేట మాజీ సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావు, ఎస్వి.రాఘవులు మృతదేహాని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వ్యక్తిగత దూషణ, చంపుతామని బెదిరింపులపై కేసు నమోదు

నవతెలంగాణ-కల్లూరు

పట్టణానికి చెందిన కొరకప్పు రామారావును చంపుతామంటూ వ్యక్తిగతంగా దూషిస్తూ ఉండటంతో తనకు ప్రాణ రక్షణ కల్పించాలంటూ బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయడంతో ఎస్సై ఎస్కే. షాకీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని కప్పల బంధం గ్రామానికి చెందిన నందిగామ ప్రసాద్, బత్తులపల్లి గ్రామానికి చెందిన మంచాల కృష్ణ, కల్లూరుకి చెందిన ఉబ్బన వెంకటరత్నం, బోల్లెపోగు పెద్ద రామకృష్ణ, తేల్లూరి మల్లయ్య, కంభంపాటి రమేశ్ తదితరులు దళిత ఉద్యమ నేత కొరకొప్పు రామారావును జూన్ 6,2023లో దాడి జరిగినప్పుడు ఆ దాడి విషయం మీద కల్లూరు పోలీస్ స్టేషన్‌లో పిటిషన్ ఇవ్వటానికి వచ్చినప్పుడు స్టేషన్లోనే దుర్భాషలాడుతూ బండ బూతులు తిడుతూ దాడి చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయబడినట్లు ఎస్ఐ షాకీ తెలిపారు.

ఘనంగా 'సాహితి' 8వ వార్షికోత్సవ వేడుకలు



ఖమ్మం : నగరంలోని బురాన్ పురంలోని సాహితి జూనియర్ కాలేజి 8వ వార్షికోత్సవం శనివారం ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తొలుత సీఏ అంజలి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ వెంకన్న స్వాగతోపన్యాసంతో విద్యాసంవత్సరంలో సాధించిన ప్రగతి నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా సిఏ అంజలి మాట్లాడుతూ విద్యతో పాటు నైతిక విలువలు బోధించాలని, చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాలలో కూడా ప్రావీణ్యం కల్పించి వారిని ఉత్తములుగా తయారు చేయటానికి లెక్చరర్లు, యాజమాన్యం పాటుపడాలని, సాంకేతిక రంగంలో వస్తున్నా విప్లవత్మాకమైన మార్పులకు అనుగుణంగా అదునాతన పద్ధతులను అవలంభించి విద్యా బుద్దులు నేర్పాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అతిథి చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ నాగేశ్వరరావు, సెక్రటరి శ్రీనివాస రావు, ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ కొండె వెంకన్న, డైరెక్టర్ తిరుపతయ్య, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరుగూడెంలో నీటి ఎద్దడి

- అల్లాడుతున్న గ్రామస్తులు
- అందుబాటులో లేని ప్రత్యేక అధికారి

నవతెలంగాణ-వేంసూరు



మండల పరిధిలోని కల్లూరు గూడెం గ్రామపంచాయతీలో గత కొన్ని రోజులుగా త్రాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాక చాలా కాలమైనదని, అడిగిన పట్టించుకునే నాధుడే లేడని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ బోరు కాలిపోవడంతో ప్రత్యయం లేక అవస్థలు పడుతున్న నూతనంగా వచ్చిన ప్రత్యేక అధికారి దృష్టికి సమస్యలు తీసుకుందాం అన్నా ఫోను కూడా దొరకని పరిస్థితి. అవగాహన లేని అధికారులను గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారిగా నియమిస్తే ఎలా ఉంటుంది అనేదానికి నిదర్శనం. కల్లూరుగూడెం గ్రామపంచాయతీ త్రాగు నీటి సమస్య సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదని ఆరోపణ అధికార పార్టీకి చెందిన ఓ ప్రముఖ నాయకుడు నవతెలంగాణతో మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు గొల్లగూడానికి రాక నెలలు గడుస్తున్నాయని ఆ సమస్యను పరి ష్కరించడంలో అధి కారులు పూర్తిగా విఫలమయ్యారని తె లిపారు. కల్లూరు గుడానికి గత కొన్ని రోజులుగా త్రాగునీటి సరఫరా లేకపోవడం వాస్తవమేనని అన్నారు. ఈ సమస్యపై పంచాయతీ ప్రత్యేక అధికారి రవిచంద్ర ప్రకాష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించిన అందుబాటులో లేకపోవడంతో పలుమార్లు ఫోన్ ద్వారా ప్రయత్నించిన లిఫ్ట్ చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శని వివరణ కోరగా మోటార్ కాలిపోవడంతో నీటి సమస్య వచ్చిందని శనివారం మోటర్ అమర్చి నీటిని అందిస్తామన్నారు. గ్రామ పంచాయతీలలో సమ స్యలను ఎవరితో చెప్పుకోవాలో కూడా అర్థం కాని పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. ఆ అధికారి ఫోనులో కూడా దొరకరని విమర్శలు ఉన్నాయి. జిల్లా అధికారులు స్పందించి రానున్న కాలంలో తీవ్ర నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఎక్కువగా ఉన్నాయని గ్రామాలపై దృష్టి పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఓటమి ప్రజాసేవకు అడ్డంకి కాకూడదు

- సర్పంచుల సన్మాన సభలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-పెనుబల్లి



ప్రజాస్వామ్యంలో పదవి ప్రజలు ఇస్తే వస్తుంది తప్ప..నాయకునికి ఓటమి చెందిన ప్రజాసేవకు అడ్డంకి కాదని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య అన్నారు. శనివారం పెనుబల్లి మండలంలోని అడివి మల్లెల గ్రామంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు అధ్యక్షతన మండలంలోని సర్పంచ్ సర్పంచులను సండ్ర వెంకట వీరయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సండ్రా మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో 85శాతం అభివృద్ధి పూర్తి చేశామని, రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన కార్యక్రమాలు ఇక్కడ జరిగే జరిగాయన్నారు. పెనుబల్లి మండలంలోని బిఆర్ఎస్ పార్టీకి చెందిన 25 మంది సర్పంచులను శాలువా, పూలమాలవేసి ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంల జడ్పీటీసి చెక్కిలాల మోహన్‌రావు, లక్కినేని అలేఖ్య వినీల్, కోటగిరి సుధాకర్, భూక్య ప్రసాద్, దొడ్డపనేని రవి, కనగాల సురేష్ బాబు, తేల్లూరి నాగేశ్వరరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, మందడపు అశోక్, తాళ్లూరి శేఖర్‌రావు, చెలికానీ నీలాద్రిబాబు, లగడపాటి శ్రీను, వంగా గిరిజాపతి, బెల్లంకొండ చలపతి పాల్గొన్నారు.

విద్యా, వైద్య రంగాలను ప్రభుత్వ పరం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు విక్రమ్
- మెగా మెడికల్ క్యాంపుకు విశేషం విశేష స్పందన

నవతెలంగాణ-ఖమ్మం



విద్యా, వైద్యం రంగాలను పూర్తిగా ప్రభుత్వ పరం చేయాలని, ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల సంఘం భారీగా పెంచాలని, రాబోయే కాలంలో ప్రతి నెలా ఒక ప్రత్యేకమైన హెల్త్ డాక్టర్‌తో ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై. విక్రమ్ తెలిపారు. శనివారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో సీపీఐ(ఎం), ఖమ్మం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బివికె) ఆధ్వర్యంలో బిపి, షుగర్ మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఉచితంగా ఖమ్మం జిల్లాలో నడుస్తున్న ఏకైక మెడికల్ క్యాంపు ఇదే అని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం అవసరం ఉందని, ఆరోగ్యకరమైన జీవితాలను ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని తెలిపారు. క్యాన్సర్, హార్ట్ తదితర రోగాలు ఈమధ్య కాలంలో బాగా పెరిగాయని, వీటికి చికిత్స కోసం ప్రయివేటు ఆసుపత్రికి వెళితే ఆస్తులు అమ్ముకునే స్థితికి వచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను రక్షించాలని డిమాండ్ చేశారు. కంటి పరీక్షలు, షుగర్, బిపి సేవలను ఉచితంగా నిర్వహించారు. అనంతరం బిపి షుగర్‌కు నెలకు సరిపడా మందులు అందించారు. ఈ క్యాంపులో ప్రముఖ వైద్యులు శీలం పుల్లారెడ్డి, బుగ్గవీటి గౌతమ్ రోగులను పరీక్షించి ఉచితం మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ సి.భారవి, డాక్టర్ రావిళ్ళ రంజిత్, డాక్టర్ కొల్లి అనుదీప్, డాక్టర్ పి. సుబ్బారావు, డాక్టర్ జెట్ల రంగారావు, నాయకులు వై.శ్రీనివాసరావు, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, ఎం. సుబ్బారావు, పి.ఝాన్సీ, అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, అరుణ, కళ్యాణం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మల్లు నందిని నామినేషన్‌కు మద్దతుగా బయలుదేరిన మధిర కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మధిర

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దరఖాస్తు చేయడానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సతీమణి, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క భారీ ర్యాలీగా బయలుదేరి వెళుతున్న సందర్భంగా మధిర మండలం పట్టణం నుండి 100 కార్లలో కాంగ్రెస్ నాయకులు బయలుదేరి వెళ్లారు. మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురంశెట్టి కిషోర్ జండా ఊపి కార్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు, మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, పాటిబండ్ల సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఎర్రుపాలెం



తెలంగాణ రాష్ట్ర జన విజ్ఞాన వేదిక ఖమ్మంలో నిర్వ హించిన చెకుముకి సైన్స్ జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మీనవోలు గ్రామానికి చెందిన శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ విద్యార్థులు యన్నం జస్వంత్ రెడ్డి, తోట నితిన్ సాత్విక్, దునుకు విశాల్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో గల మూడు దశలు స్క్రీనింగ్ టెస్ట్ క్విజ్, ప్రయోగశాల పరీక్ష లలో శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకులో నిలిచారు. గ్రామీణ ప్రాంతంలో చదువుకున్నప్పటి కీ సబ్జెక్టు పట్ల అంకిత భావంతో చదివి జిల్లా ప్రథమస్థా నంలో నిలిచిన విద్యార్థులను,ఉపాధ్యాయులను స్కూ ల్ యాజమాన్యాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఏటూ రి సోమశేఖర్ శర్మ, జన విజ్ఞానిక వేదిక జిల్లా స్థాయి అ ధ్యక్షుడు శివ నారాయణ,ఎంఈఓ ఎం ప్రభాకర్ అభి నందించారు. శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ భట్ల పెనుమర్తి సూర్యనారాయణ, డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, రాజేశ్వరశర్మ ప్రిన్సిపల్ వై. శ్రీదేవి, ఉపాధ్యాయులు మారబత్తుల కాటయ్య, సాలిక వాసు, ప్రియాంక వెంకటేశ్వరరావు, పర్విన, మేరీ, గిరిబాబు గ్రామీణ ప్రాంతంలో చదివి నప్పటికీ క్రమ శిక్షణ అంకిత భావంతో తల్లి దండ్రుల ప్రోత్సాహంతో అభ్యసించడం వల్ల ఉత్తమ ఫలితం సాధించారని పేర్కొన్నారు.

ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయమం

- జిల్లా కలెక్టర్ వీపీ. గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం



వికలాంగులకు చేయూతనిస్తున్న ఖమ్మం ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ విపి. గౌతమ్ అన్నారు. శనివారం ఖమ్మంలోని కృషి భవన్ రోడ్లోని డిఎస్ఎఫ్ సంస్థ కార్యాలయం, గణేష్ బోనాల నిలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్, 25 మంది వికలాంగులకు 3 లక్షల రూపాయలు విలువ చేసే వీల్ చైర్స్, ఎస్బిఐటిలో బీటెక్ చదువుతున్న ఒక పేద విద్యార్థినికి 50 వేల రూపాయలు విలువచేసే లాప్ టాప్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు, విద్యార్థులకు, మహిళలకు ఎన్నారై ఫౌండేషన్ వారు వివిధ రకాల సేవలతో వారి జీవితాల్లో వెలుగులు నింపటం అభినందనీయమన్నారు. వికలాంగులకు దాతలు ముందుకు వచ్చి సహాయం చేయడం వల్ల వికలాంగుల జీవితాలకు లబ్ధి చేకూరుతుందని, ఫౌండేషన్ వారు చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలను ప్రస్తావించారు. ఎన్నారై ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బయ్యన బాబురావు, ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బోనాల రామకృష్ణ, బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నారై ఫౌండేషన్ ప్రారంభించిన నాటి నుంచి జిల్లా వాసులైన అనేకమంది ఎన్నారైలు తమవంతు సాయం అందించడం వల్ల సేవా కార్యక్రమాలు చేశామని, ఈ విధంగా మాతృభూమి రుణం తీర్చుకునే అవకాశం తమకు కలిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఎన్నో సేవా కార్యక్రమం చేయడానికి మాకు అవకాశం దొరికిందని, ఇంకా సుమారుగా వందమంది దివ్యాంగులకు వీల్ చైర్లు అందించడానికి సిద్ధం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 54 డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, ఫౌండేషన్ బాధ్యులు మిక్కిలినేని నరేంద్రచౌదరి, కోశాధికారి పసుమర్తి రంగారావు, కొంగర పురుషోత్తమరావు, కురివెళ్ల ప్రవీణ్, అన్నం శ్రీనివాసరావు, వాసిరెడ్డి శ్రీనివాస్, కళ్యాణపు సాంబశివరావు, అంబేత్కర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, పద్మిని, వాసిరెడ్డి అర్జునరావు, ముదాలగర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ అవార్డుగా ప్రకటించడం పట్ల కళాకారుల హర్షం

నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గద్దర్ అన్న జయంతి సందర్భంగా ఈ ఏడాది నుండి నంది అవార్డుకు బదులు ప్రజా కవి గద్దర్ అవార్డుగా ప్రకటించడం పట్ల ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన జిల్లా కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తంబూరి దయాకర్ రెడ్డి కళాకారులను అభినందించారు. గద్దర్ అన్న అవార్డులుగా ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సేన జిల్లా అధ్యక్షులు గుడిపల్లి పుల్లారావు, ప్రధాన కార్యదర్శి అరెంపుల సతీష్, సహాయ కార్యదర్శి కాలంగి లలిత, ఉపాధ్యక్షులు చేకూరి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కొచ్చర్ల గురవయ్య, పుల్లయ్య, కర్ష బొడ్డు నరేష్, డప్పు శివ, గురవయ్య, అనిల్, వెంకన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



వైరాటౌన్

నవతెలంగాణ-వైరాటౌన్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయాన్ని కాపాడాలని, రైతులను ఆదుకోవాలని, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు ఈనెల 16న గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కె.అర్జున్‌రావు అన్నారు. శనివారం వైరాలోని సిపిఐ(ఎం) కార్యాలయం బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ బంద్, కార్మిక సమ్మె జయప్రదం చేయడానికి వైరా మండల కార్మిక కర్షక సదస్సు ఫిబ్రవరి 6న వైరా సిపిఐ(ఎం) కార్యాలయంలో జరుగుతుందని రైతులు, కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి గారపాటి అశోక్, ఐఎఫ్ టియు నాయకులు యలదండి బాబు, రైతు సంఘం నాయకులు పైడిపల్లి సాంబశివరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు

కల్లూరు : ఈనెల 16న కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు ఖమ్మం జిల్లా నాయకులు కే. పుల్లారావు మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త బందును జయప్రదం చేయాలని, ప్రజలు ప్రజాస్వామిక వాదులు వ్యాపార సంస్థలు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు ఎం. సీతారాములు, ఎస్కే .హుస్సేన్, వి. నరసింహారావు, బి. వీరాంజనేయులు, జె. గోపాలకృష్ణ, కే.గోవిందరావు, ఎస్. రాము, టి.శేషగిరిరావు, కె. రాము, ఎండి.రఫీ, ఎస్‌కే.జానీ తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండ

ముదిగొండ : కార్మిక హక్కుల పరిరక్షణ కొరకు ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ టిఎస్ కళ్యాణ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ముదిగొండలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బట్టు హనుమంతరావు, ఆర్.నాగేశ్వరరావు, తాళ్ల వీరయ్య ఉసికల ఉపేందర్, బంక సైదులు, రామారావు, నాగుల్ మీరా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు లెప్రసీ వ్యాధి పై అవగాహన

నవతెలంగాణ-కల్లూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలతో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్ ఆధ్వర్యంలో కల్లూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శనివారం లెప్రసి కుష్టు వ్యాధిపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పల్లె దవాఖన వైద్యాధికారి డాక్టర్ శ్రీజన్య వ్యాధి లక్షణాలు పరీక్షలు, చికిత్స గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలత, సూపర్వైజర్ రామారావు, విజయశ్రీ, ఏఎన్ఎం నాగమణి, ఆశా జమలమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో మెడిటేషన్ పై వర్క్ షాప్

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

మండల పరిధిలో మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మూడు రోజులుగా హార్ట్ ఫుల్నెస్ మెడిటేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్క్ షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మెడిటేషన్ ట్రెనర్ నార్ల కరుణాకర్ విద్యార్థులకు మెడిటేషన్ గురించి వివరించారు. విద్యార్థులు ఒత్తిడిని తట్టుకొని,మానసికంగా ధైర్యంగా ఎలా ఉండలానే విషయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీరాణి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మీ, అధ్యాపకురాలు ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలో హరీష్ రావు, వద్దిరాజు పర్యటన

నవతెలంగాణ-పినపాక



మండలంలో మాజీ మంత్రి హరీష్ రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆకస్మికంగా పర్యటించారు. శనివారం ఈ బయ్యారం సబ్ స్టేషన్‌లో సబ్‌స్టేషన్ ఏఈ కావ్య, సబ్ ఇంజనీర్ వీరారెడ్డిని అడిగి విద్యుత్ రైతులకు ఎన్ని గంటలు అందిస్తున్నారని వివరాలు తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అందించిన విధంగా అందుతుందా లేదా అని సిబ్బందిని అడిగారు. రైతులకు 24 గంటల కరెంట్ అందిస్తున్నామని ఏఈ కావ్య తెలియజేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ రైతులకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని మాజీ మంత్రి హరీష్ రావుకు విద్యుత్ శాఖ సిబ్బంది తెలియజేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే వెళ్లి పరిష్కరిస్తున్నామని తెలియజేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. లాక్ బుక్కులు పరిశీలించారు. విద్యుత్ శాఖ ఏఈ కావ్య పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్‌లకు రక్షణ కల్పించాలి

- హైకోర్టు ఆదేశాలు జారీ

నవతెలంగాణ-ఇల్లందు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపాలిటీలో దమ్మలపాటి వెంకటేశ్వర్లు (డివి) పై పెట్టిన అవిశ్వాసం ఈనెల 5న, మునిసిపాలిటీ హౌస్ జరుగనుంది. అవిశ్వాసము సందర్భంగా ఆటంకాలు లేకుండా సెక్యూరిటీ కల్పించాలని రాష్ట్ర హైకోర్టును ఇల్లందు మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్స్ ఆశ్రయించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు మున్సిపాలిటీ కౌన్సిలర్లకు రక్షణ కల్పించాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది.

వైద్య శిబిరాలు, కుష్టు వ్యాధి పై అవగాహన

నవతెలంగాణ-దుమ్ముగూడెం



పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్ణశాల, గౌరవరం, ములకనాపల్లి పైడిగూడెం గ్రామాలలో శనివారం హెల్త్ క్యాంపులు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు రేణుక రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాలలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి మొత్తం 69 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో బాలింతలు ఒకరు, జ్వరం పీడీతులు నలుగురు కాగా మిగిలిన వారు చిరు వ్యాధులతో ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధిపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏ నాగేశ్వరరావు, హెచ్‌వి అనసూర్య ఏఎన్ఎం సావిత్రి నర్సమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మల్లు నందినికి మద్దతుగా కదిలిన అమ్మ సైన్యం

నవతెలంగాణ-జూలూరుపాడు

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ చైర్మెన్ మల్లు నందిని విక్రమార్క ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శనివారం గాంధీ భవన్ నందు దరఖాస్తు నమోదు చేస్తున్న సందర్భంగా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్, ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల నరసింహారావు, మండల కాంగ్రెస్ నాయకులు కొలిపాక శ్రీనివాసరావు, గుగులోత్ ప్రియాంక నాయక్, నాగవేణి, గుగులోత్ శ్రీనివాసరావు, కిషన్ నాయక్, సామ్య నాయక్, శ్రీను నాయక్, రాంబాబు నాయక్, ఉష, సరోజ, విజయ, తార తదితరులు పాల్గొన్నారు.



మనోధైర్యంతో విద్యార్థులు పరీక్షలు రాయాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

10వ తరగతి విద్యార్థులకు కామన్ పరీక్షలు సమయంలో మనో ధైర్యంతో పరీక్షలు రాయాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య అన్నారు. శనివారం విషయ పరిజ్ఞానం పై యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో రామయ్య, పాఠ్య పుస్తకాలు రచయిత రాచర్ల గణపతి, చక్రవర్తులు శ్రీనివాసు ఆధ్వర్యంలో సబ్జెక్టులు వారీగా విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ విద్యార్థులు బట్టి పట్టే చదువుని వీడి అర్థం చేసుకొని పరీక్షలు రాసే విధంగా ఎదగాలని, అప్పుడు మాత్రమే విద్యార్థులు పరీక్షలు మనో ధైర్యంతో పరీక్షలు రాయగలుగుతారన్నారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు చుసించారు. ఈ కార్యక్రమంలో పాటశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

నవతెలంగాణ-చంద్రుగొండ



మండంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పనపల్లి యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కే.అబ్రహం (56) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శనివారం ఆరోగ్యంగా నిలకడగా లేకపోవడంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడు ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల వాసి ఉపాధ్యాయుని మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు సంతాపాన్ని ప్రకటించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నవతెలంగాణ-ములకలపల్లి

కస్తూరి ఫౌండేషన్ సహకారంతో పుష్పాల చంద్రరావు ఆధ్వర్యంలో మండల పరిధిలోని పొగళ్లపల్లి, ములకలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవతరగతి చదివే 180 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ను శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులందరూ స్టడీ మెటీరియల్ అందించిన కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీ చరణ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మెహరామణి, పుష్పాల వెంకన్న, బండి కొమరయ్య, శెనగపాటి సీతారాములు, పుష్పాల సాయి, నరి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వృత్తి శిక్షణా తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియాలో ఉచిత వృత్తి శిక్షణా తరగతులను శనివారం కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవ సమితి అధ్యక్షురాలు జి.మధుర వాణి షాలెం రాజు ప్రారంభించారు. కొత్తగూడెం, ఆర్.సి.ఓ.ఎ క్లబ్ నందు కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్, గౌతమ్ పూర్, రామవరం నిరుద్యోగ మహిళలు, గృహిణుల కోసం ఉచిత వృత్తి శిక్షణ తరగతులను కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవ సమితి ప్రారంభిస్తున్నట్లు ఈ అవకాశం మహిళలు వినియోగించుకోవాలని జి.మధుర వాణి షాలెం రాజు కోరారు. సింగరేణి సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమములో కొత్తగూడెం ఏరియా సింగరేణి సేవా సభ్యులు బి. భవాని రవీందర్, పర్సనల్ మేనేజర్ బి.శివకేశ్వరరావు, సీనియర్ పిఓ జి.సంఘమిత్ర, సింగరేణి సేవా సమితి కో-ఆర్డినేటర్ సిహెచ్ సాగర్, సింగరేణి సేవా సెక్రటరీ ఆదిలక్ష్మి శిక్షకులు ఫ్యాకల్టీ, సేవ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నవ్య తెలుగు దినపత్రిక

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

జాతీయస్థాయి పుస్తక సమీక్ష పోటీల్లో 'పేట' విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఉరిమళ్ళ ఫౌండేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్ష పోటీలలో అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ కవి, రచయిత, పుస్తక సమీక్షకులు సిద్ధాంతపు ప్రభాకాచార్యులు తనయుడు, బాల కథకుడు సాత్విక్ సాయికుమార్ ప్రతిభ కనబరిచాడు. బహుమతి సైతం బహుమతి లభించింది. ఈ మేరకు ఉరిమళ్ళ ఫౌండేషన్ నిర్వాహకులు భోగోజు ఉపేంద్ర, ఉరిమళ్ళ సునందలు సాత్విక్‌కు సమాచారం అందించారు. అమ్మిన శ్రీనివాసరాజు రాసిన చంద్ర వంకలు అనే బాలల కథా సంపుటి పై సమీక్ష రాసి పోటీలకు పంపించాడు. జాతీయస్థాయిలో 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో 34 ఉత్తమ సమీక్షలను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సాత్విక్ స్థానిక సూర్య స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఉరిమళ్ల ఫౌండేషన్ త్వరలో నిర్వహించబోయే బహుమతి ప్రధానోత్సవ సభలో బహుమతిని అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాత్విక్‌కు బహుమతి లభించడం పట్ల ఎంఈఓ పి.కృష్ణయ్య సూర్య పాఠశాల కరస్పాండెంట్ పోతన రాంబాబు, ప్రధానోపాధ్యాయులు నాగరాజు సాత్విక్‌ను అభినందించారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రత్యేక అధికారులు

కీలకపాత్ర పోషించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు
- కలెక్టర్ ప్రియాంక అల

నవతెలంగాణ-పాల్వంచ





గ్రామాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి, నివారణ చర్యలు, ఉపాధి హామీ పథకం పనులు పలు అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రియాంక అలతో పంచాయతీరాజ్ అధికారులు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతి నిధులను ఆహ్వానించాలని చెప్పారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో మహిళా స్వయ సహాయక సంఘాలను యువతను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. 15వ తేదీన పండుగ వాతావరణంలో ముగింపు కార్యక్రమం నిర్వహించి, ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి కలెక్టర్లు ప్రశంస పత్రాలు జారీ చేయాలని చెప్పారు. యువత గంజాయ్, గుట్కా, మద్యం వంటి దురాలవాట్లకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ప్రత్యేక కార్యక్రమాల ద్వారా గ్రామాలను పరిచయం పరిచేందుకు బాధ్యతగా నిర్వహించడం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. గ్రామ పంచాయతీల విధులు నిర్వహణపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం ఓరియంటేషన్ కార్పెంటర్ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో విద్యాలత, డీపీఓ రమాకాంత్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, పంచాయతీరాజ్ ఇంజనీరు శ్రీనివాసరావు, ఏపీడీ రవి, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

- బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సింహారావు

నవతెలంగాణ-కొత్తగూడెం





రాష్ట్రంలోని బిల్డింగ్ వర్కర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని, వారి సంక్షేమానికి నిధులు కేటాయించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పతల నర్సింహారావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కొత్తగూడెంలో బిల్డింగ్ వర్కర్స్ కొత్తగూడెం పట్టణ మహాసభ జరిగింది. ఈ సభలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పతల నర్సింహారావు, సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్నలు మాట్లాడారు. భారతదేశంలో14 కోట్ల మంది బిల్డింగ్ వర్కర్స్ ఉన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 25 లక్షల మంది వివిధ పనులు చేస్తున్నవారున్నారని చెప్పారు. తాపీ మేస్త్రి, పెయింటర్స్, సెంట్రింగ్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న వారు వెల్ఫేర్ బోర్డు ద్వారా బిల్డింగ్ వర్కర్లకు లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.10 లక్షలు ఇవ్వాలని, కూలి రేట్లు పెంచాలని, వెల్ఫేర్ బోర్డులో ప్రసవానికి, పెళ్లిళ్లకి రూ.30 వేల చొప్పున ఇస్తున్న దాన్ని రూ.1లక్ష వరకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మహాసభలో నూతన కమిటీని ఎన్నిక చేయటం జరిగింది. అధ్యక్షులుగా లిక్కి బాలరాజు, కార్యదర్శిగా ఆవుల శ్రీరాములు, 10 మంది ఆఫీస్ బేరర్స్‌ని ఎన్నుకున్నారు.

పంచాక్షరయ్యను కలిసిన మాజీ మంత్రి హరీష్ రావు

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామానికి చెందినతాళ్ళూరి చారిట బుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాళ్ళూరి పంచాక్షరయ్యను రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు శనివారం మర్యాద పూర్వ కంగా కలిశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చిన హరీష్ రావు ఇరవెండిలోని పంచాక్షరయ్య నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. అదే విధంగా మాజీ మంత్రి హరీష్ రావును పంచాక్షరయ్య శాలువాతో సన్మానించి, సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం తాజా రాజకీయ పరిస్థితులను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు మాలోత్ కవిత, వద్ది రాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఇరవెండి మాజీ ఎంపీటీసీ సభ్యుడు వల్లూరిపల్లి వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాఘవపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- నినాదాలతో హోరెత్తిన తెలంగాణ భవన్
- బీఆర్ఎస్ జిల్లా సమావేశంలో కార్యకర్తల ఆందోళన

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం రసబసగా మారింది. స్థానిక రైటర్స్ బస్తీలోగల బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశం ప్రశాంతంగా జరగాల్సింది పోయి గందరగోళానికి దారితీసింది. ఈ సమావేశానికి హాజరైన మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో పాటుగా ఆందోళనకు దిగడంతో తెలంగాణ భవన్ హోరెత్తిపోయింది. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం వనమా రాఘవేంద్రరావుపై వేసిన సస్పెన్షన్ వేటును వెంటనే ఎత్తివేయాలని ఆయనను పార్టీలోకి తక్షణమే తిరిగి తీసుకోవాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తు నినాదాలు చేశారు. పెద్దపెట్టున నినాదాలు చేయడంతో సమావేశం కొద్దిసేపు గందరగోళంగా మారింది. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం (తెలంగాణ భవన్)లో కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నియోజక వర్గస్థాయి సమావేశానికి ఖమ్మం జిల్లా ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో పాటుగా జిల్లా పరిషత్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖరరావు హాజరయ్యారు. ముందుగా సమావేశంలో కొందరు నాయకులు మాట్లాడిన అనంతరం ఒక్కసారిగా బీఆర్ఎస్ పార్టీలోని కొందరు కార్యకర్తలు వేదిక ముందుకు వచ్చి వనమా రాఘవపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని నినాదాలు చేస్తుండగా స్టేజి మీద ఉన్న వారు వారిని వారిస్తున్న వినిపించుకోకుండా జై..రాఘవ జై.. జై.. రాఘవ అంటూ నినాదాలు చేయడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

మొత్తంగా జరిగిన హైడ్రామా వనమా రాఘవేంద్రరావుపై ఉన్న సస్పెషన్ ఎత్తివేయాలని, లేకుంటే కొత్తగూడెంలో బీఆర్ఎస్ పార్టీని కాపాడే వారు లేరన్నట్లుగా చిత్రీకరించారు. ఏది ఏమైన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం గందరగోళానికి దారి తీయడం చర్చనీయాంశంగా మారింది.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న హరీష్ రావు

- మాజీ మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో భద్రాచలం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి భద్రాచలంకి వచ్చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు శనివారం భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మరో ఎమ్మెల్సీ వద్ది రాజ్ రవిచంద్ర, భద్రాచలం శాసనసభ్యులు తెల్ల వెంకటరావుతో కలిసి రామాలయం చేరుకున్న మాజీ మంత్రి హరీష్ రావుకి దేవస్థానం ఈవో రమాదేవి నేతృత్వంలో ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూలమూర్తుల వద్ద హరీష్ రావు బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకి ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ... రామాలయ అభివృద్ధికి కేసీఆర్ మాస్టర్ ప్లాన్ రచించారని యాదాద్రి అనంతరం భద్రాచలం రామాలయనే అభివృద్ధి చేయాలన్న ఎజెండా పెట్టుకున్నప్పటికీ సమయం భావం వల్ల అది సాధ్యపడలేదని అన్నారు. ఎన్నికలు రావడంతో రామాలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్ కార్యరూపం దాల్చలేదని భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే భద్రాద్రి రామాలయ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భద్రాచలం కరకట్ట తోపాటు మార్కెట్ ఆధునీకరణకు శంకుస్థాపన చేసిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే భద్రాచలంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్సీ తాత మధు నేతృత్వంలో కార్యకర్తలు శ్రమించి పనిచేసే వెంకటరావును గెలిపించినందుకు వారికి ప్రత్యేక అభినందనలు ఈ సందర్భంగా తెలియజేశారు.

రహదారి భద్రత పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-టేకులపల్లి



విద్యార్థులు చదువుతో పాటు రహదారి భద్రత నియమాలను తెలుసుకోవడం ప్రతి విద్యార్థికి ఎంతో ముఖ్యమని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారత్సవాల్లో భాగంగా శనివారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రహదారి భద్రత పై అవగహన కల్పించారు. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు క్యూ పద్ధతిని పాటించడం వలన కిందపడి గాయాల పాలుకాకుండా ఉంటారని అన్నారు. ఎవరైనా అమ్మాయి పట్లా అసభ్యంగా ప్రవర్తించిన, ఎవరైనా గంజా అక్రమంగా తరలిస్తున్న లేదా సేవించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సైబర్ క్రైమ్ పై అవగాహన

సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్.కల్పన, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై ఆశాల అవగాహన

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఆళ్ళపల్లి మండలం కాచనపల్లి సబ్ సెంటర్ పరిధిలోని తిర్లాపురం గ్రామంలో ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం జరిగిందని స్థానిక సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు ఎస్.సుగుణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు చంద్రకళ, వి.కావేరి, సావిత్రి, విజయ లక్ష్మి సావిత్రి, సుక్కమ్మ శిరోమణి, రమణ, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ కోర్టును నిర్వహించవద్దని ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి

- ఐలూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి.ప్రసాద రావు, రమేష్ కుమార్ మక్కడ్

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

భద్రాచలంలోని ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ భద్రాచలంలో మొబైల్ కోర్టును నిర్వహించవద్దని ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.వి.ప్రసాద రావు, రమేష్ కుమార్ మక్కడ్‌లు కోరారు. శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ జారీ చేసిన ఆదేశాలు ఎలాంటి అధికారం లేకుండా అధికార పరిధి లేకుండా జారీ చేసారని వారు పేర్కొన్నారు. పేర్కొన్న ఉత్తర్వులు ఏజెన్సీ, షెడ్యూల్డ్ ఏరియాలో న్యాయ ప్రక్రియను అనవసరంగా నిలిపివేసిందని కనుక అటువంటి ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ప్రస్తుతమున్న సబ్ కలెక్టర్ లేదా రెవెన్యూ డివిజనల్ అధికారుల న్యాయ నిర్ణయ అధికార పరిధిని తప్పించి జి.ఓ.406 ప్రకారం భద్రాచలం వద్ద మొబైల్ కోర్టును ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం మొబైల్ కోర్టు సివిల్ వ్యాజ్యాలను ఏజెన్సీ రూల్స్ 1924 ప్రకారం పరిష్కరిస్తోందని, కానీ ఆ కోర్టులో కనీస సిబ్బందిని కేటాయించలేదని, తగినంత బడ్జెట్ అందించబడతమ్ లేదని వారు పేర్కొన్నారు. ఇలాంటి స్థితిలో మొబైల్ కోర్టును స్తంభింప చేయడం సమంజసం కాదని తెలిపారు. వంద సంవత్సరాల క్రితం నిర్ణయించిన ఏజన్సీ కోర్టుల ఆర్థిక అధికార పరిధిని సివిల్ కోర్టులతో సమానంగా పెంచాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. న్యాయ ప్రక్రియలో శిక్షణ పొందిన వారిని మొబైల్ కోర్టు జడ్జీలుగా నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు.

టీఎస్ఎస్‌టీఎఫ్ ఫోరమ్ ఎగ్జామ్‌లో త్రివేణి విజయ కేతనం

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్



స్థానిక కొత్తగూడెం క్లబ్ నందు తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరమ్ వారు జిల్లా స్థాయిలో నిర్వహించిన పదవ తరగతి సోషల్ బిట్స్ ఎగ్జాంలో త్రివేణి సరస్వతి క్యాంపస్‌కు చెందిన విద్యార్థి ఎస్.సాయి హర్షన్ మొదటి స్థానం సంపాదించి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యాడు. జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర చారి, ఫోరమ్ అధ్యక్షుడు బీ.తారా సింగ్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీశ్, డా.గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సి.అర్.ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్ వై.వి.సురేష్ పాల్గొన్నారు.




ఘనంగా ఫీడ్ ద నీడ్ స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవం

నవతెలంగాణ-దమ్మపేట

మందలపల్లికి చెందిన గారపాటి దంపతుల ఆధ్వర్యంలో రూపొందించిన ఫీడ్ ద నీడ్ స్వచ్ఛంద వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ తరఫున 30 మంది వృద్ధులను దత్తతగా తీసుకుని నిత్యం వారికి ఆహారం అందిస్తూ, పండుగలకు, ముఖ్య పర్వ దినాలలో వారికి నూతన వస్త్రాలు ఇస్తూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి వైద్య సదుపాయాలు అందిస్తూ నేటికీ అయిదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంస్థ చైర్మెన్, దిశ కమిటీ సభ్యులు గారపాటి సూర్యనారాయణ-అనురాధ దంపతులు వృద్ధులకు స్వీట్లు పంచి సంతోషం వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా సంస్థ ద్వారా సహాయం పొందుతున్న వృద్ధులు మాట్లాడుతూ గత అయిదు సంవత్సరాలుగా ఏ ఆటంకం లేకుండా తమ కడుపు నింపుతూ, ముఖ్యంగా కరోనా కాలంలో కూడా వృద్ధులందరికీ ఏ చిన్న ఇబ్బంది కలగకుండా సొంత పిల్లల వలె కాపాడుకుంటూ వస్తున్న ఈ పుణ్య దంపతులు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో విలసిల్లాలని దీవించారు.

మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్స్ షెడ్యూల్ ప్రకటించిన జీఎం

నవతెలంగాణ-ఇల్లందు



ఏరియాలో మల్టీ డిపార్ట్మెంటల్ మీటింగులు నిర్వహణకు షెడ్యూల్‌ను నిర్ణయించడం జరిగిందని జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జీఎం మాట్లాడుతూ ఏరియాలో ఈ షెడ్యూల్ ప్రకారం జేకే ఉపరితల గని నందు 6 న ఉదయం 7.30 గంటలకు మొదటి, రాత్రి బదిలీ వారికిఅదేవిధంగా మధ్యాహ్నం 3.30 గంటలకు రెండో బదిలీ వారికిఅదే రోజు ఉదయం 10 గంటలకు ఏరియా ఆసుపత్రి ఉద్యోగులందరికీ, కోయగూడెం ఉపరితల గని నందు, తేదీ. 7న ఉదయం 7.30 గంటలకు మొదటి, రాత్రి బదిలీ వారికి,అదేవిధంగా మధ్యాహ్నం 3.30 గంటలకు రెండో బదిలీ వారికి, సి.హెచ్.పి వద్ద 08.02.24న ఉదయం 7.30 గంటలకు ఏరియా వర్క్ షాప్, సి.హెచ్.పి ఉద్యోగులకు, అదే రోజు ఉదయం 11.30 గంటలకు జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ మల్టీ డిపార్ట్మెంటల్ మీటింగులు నిర్వహించడానికి కమిటీ సభ్యులు కూడా తెలియజేసిన తేదీలలో అందుబాటులో ఉండాలని తెలియజేశారు.

పీలా రామకృష్ణ ప్రశంసా పత్రం స్వీకరణ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



హైదరాబాద్ పీలా రామకృష్ణ మెమోరియల్ జీవ రక్షా సంఘం ప్రశంసా పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఫౌండర్, ప్రెసిడెంట్ సతీష్ ఖండేల్ వాల్ చేతుల మీదుగా అందుకున్నట్లు ఆళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన సంఘసంస్కర్త గుండెబోయిన రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవహింస చేయొద్దనేది ఈ సంఘం ముఖ్య ఉద్దేశం అని, "జంతు సంక్షేమమే-మన సంక్షేమం" అనే నినాదంతో ఈ సంఘం పని చేస్తుందన్నారు. అన్ని రకాల మాంసాహారాలను తినడం మానేసి పూర్తిగా శాకాహారిగా మారినందుకు గాను ఈ మెమోరియల్ ప్రశంసా పత్రాన్ని తనకు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

హరీష్‌రావును కలిసిన మండల నాయకులు



నవతెలంగాణ-దమ్మపేట

మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును మండల బీఆర్ఎస్ నాయకులు సోయం వీరభద్రం, మాజీ సొసైటీ చైర్మెన్ రావు జోగేశ్వరరావులు శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలోని పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ ఎన్నికల సన్నహక సమావేశంకు పార్టీ నాయకులకు దిశ, నిర్దేశం చెయ్యడానికి తన్నీరు హరీష్ రావు విచ్చేశారు. ఈ క్రమంలో ముందుగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని హరీష్ రావు దర్శించుకొని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.



నిరుపేదలకు న్యాయం చేయండి

నవతెలంగాణ-బూర్గంపాడు

జాతీయ రహదారి సమీపంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి న్యాయం చేయాలని భద్రాద్రి మహిళా వెల్ఫేర్ ఫౌండేషన్ కోరగా దీనికి నాయకురాలు తాతా మాధవీలత శనివారం మద్దతు పలికారు. ఎన్నో ఏళ్లుగా గూడు లేని పేదలు సారపాక ఎన్హెచ్-30 సమీపంలో తాత్కాలికంగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అధికారులు ఆ గుడిసెలను తొలగించాలని హెచ్చరికలు చేయడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ప్రభుత్వ స్థలం మంజూరు చేసి వారికి న్యాయం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి మహిళా వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కందుల సుజాత, పాలెపు భవానీ, పప్పుల జయ, ఎండి.పర్వీన్, సుమతి, మాధవి, రాణి తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటల సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి మరియన్న
- శాస్త్రవేత్తలు మామిడి తోటల సందర్శన
- రైతులకు సూచనలు



నవతెలంగాణ-పాల్వంచ

మామిడి తోటలను సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు శనివారం పాల్వంచ, చుంచుపల్లి, చంద్రుగొండ, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి తదితర మండలాల్లో కృషి విజ్ఞాన కేంద్రం కొత్తగూడెం శాస్త్రవేత్తలతో ఉద్యాన అధికారులు మామిడి తోటలను సందర్శించి, పరిశీలించి ప్రస్తుతం చేపట్ట వలసిన సస్యరక్షణ చర్యలు రైతులకు తెలియజేసినారు. రైతులు సూక్ష్మ పోషకాలు వాడాలని తెలిపారు. తామర పురుగుల నివారణకు ఫిప్రోనీల్ 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని, అలాగే బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 2గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు పండు ఈగ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు ఫ్రూట్ బ్యాగింగ్ చేయుట, కార్బయిడ్ రహితంగా మాగించుట లాంటి మేలైన పద్ధతులతో పాటు కోత అనంతర చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం డా.వి.లక్ష్మీనారాయణమ్మ హెడ్ అండ్ కీటక శాస్త్రవేత్త డా.ఎస్.నవీన్, శాస్త్రవేత్త, డా.ఆర్.శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్లు వితరణ

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని కృష్ణసాగర్ అంగన్ వాడీ కేంద్రానికి జాతీయ మాలమహానాడు మండల అధ్యక్షుడు, ఏఎన్డీ నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి రవివర్మ ఆధ్వర్యంలో ఐటీసీ ఉద్యోగి బాణాల నాగబ్రహ్మంచే మూడు ఫ్యాన్లు కొనుగోలు చేసి అంగన్వాడీ కేంద్రానికి శనివారం వితరణ చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ పాలక వర్గం పదవీకాలం ముగిసిన కారణంగా కృష్ణసాగర్ పంచాయతీ సర్పంచ్ కోడి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ గోవింద్, వార్డుసభ్యులను ఆయన శాలు వాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నాగరత్నం, పంచాయతీ కార్యదర్శి నవీన్, పాఠశాల హెచ్ఎం రామిరెడ్డి, ఆర్ఎంపీ గోవింద్, ఆశాలు, పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటు నమోదు వేగవంతం చేయండి

- తీన్మార్ మల్లన్న సోదరుడు వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-చర్ల

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్ట భద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరగనున్నందున ఓటు నమోదును వేగవంతం చేయాలని తీన్మార్ మల్లన్న సోదరుడు చింతపండు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం చర్లలో విస్సా నాగభూషణం అధ్యక్షతన జరిగిన మల్లన్న అభిమానుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టు భద్రుల ఓటు నమోదుకు ఈ నెల ఆరవ తేదీ చివరి రోజు కావడంతో ఆలోగా సాధ్యమయినంత మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. గతంలో జరిగిన పట్ట భద్రుల ఎన్నికలలో దాదాపు 40 వేల మంది పట్టభద్రులు గత బీఆర్ఎస్ ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకతతో బ్యాలెట్ పేపర్ పై తమ అభిప్రాయాలను రాయడంతో అవి చెల్లకుండా పోయాయని గుర్తు చేసారు. ఆ ఓట్లన్నీ మల్లన్నకు అనుకూలంగా పడినప్పటికీ చేతి రాతల కారణంగా స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారన్నారు. ఈ సారి అలా జరగకుండా ఓటర్లకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేసారు. పట్టభద్రులు స్వచ్ఛందంగా ఓటర్లుగా నమోదు చేయించుకొని జనం సమస్యలపై ప్రశ్నించే గొంతుకయిన మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించడంలో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుండేపూడి భాస్కర్ రావు, జవ్వాది మురళీకృష్ణ, గాలి గోపి, దరిగల హరిబాబు, తాండ్ర రాయుడు, పూదోట సూరిబాబు, బండి వేణు, పుప్పాల నర్సింహారావు, ఆవుల పుల్లారావు, మురళీదర్ నాయుడు, ఎడ్ల సత్తిబాబు, ఆవుల శివప్రసాద్, అలవాల మురళీ, వారాల వేణు పాల్గొన్నారు.

ట్రాన్స్ఫర్ కాదు డిస్మిస్ చెయ్యాలి

- చట్టానికి అప్పచెప్పాలి : వామపక్ష విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-ఇల్లందు



స్థానిక సింగరేణి పాఠశాలలో గత నెల 24న జరిగిన ఘటన నిమిత్తం విద్యార్థినిల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుని ట్రాన్సుర్ చేస్తూ తీసుకున్న నిర్ణయం సరైంది కాదని వామపక్ష విద్యార్థి సంఘ నాయకులు అన్నారు. ఈ మేరకు శనివారం పర్సనల్ జీఎం మోహన్ రావు కలిసి నటి పత్రం సమర్పించారు. ఎంక్వయిరీ కి 15 రోజులు పడుతుందాని అధికారులు చెప్పడం నిజంగా బాధాకరమని అన్నారు. విద్యార్థినిలకు న్యాయం జరగని పక్షంలో విద్యార్థి సంఘాల సత్తా ఏంటో చూస్తారని ఈ సందర్భంగా వారికి తెలియజేశారు. పర్సనల్ జీఎం ని కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బాయ్యా అభిమన్యు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు హరీష్ , పిడిఎస్యు జిల్లా కోశాధికారి గణేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | ఫిబ్రవరి 04, 2024 | www.navatelangana.com

విద్యా వార్షిక తనిఖీలు నిర్వహిస్తాం

- సమీక్షా సమావేశంలో ఎంఈఓ



నవతెలంగాణ-ఇల్లందు

ఈ విద్యా సంవత్సరం ప్రీ ప్రైమరీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలలో విద్యా వార్షిక తనిఖీలు నిర్వహిస్తామని ఎంఈఓ పి.శ్రీనివాస్ అన్నారు. మండలంలో పనిచేయుచున్న అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందుకు అందరు ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డులు పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కోరారు. నెలవారీ నివేదికలు సమయానికి సమర్పించాలని తెలిపారు. 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు పాఠశాల స్థాయి కాంప్లెక్స్ స్థాయి మరియు మండల స్థాయిలో నిర్వహిస్తామని అన్నారు. ఆన్లైన్‌లో నివేదికలు సమయానికి నమోదు చేయాలని పాఠశాల విద్యాకార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టివిఆర్ యస్ స్వామి, యాదమ్మ ఉమాశంకర్, రాంబాబు, సుధాకర్ శర్మ రమేష్ పాల్గొని సందేశమిచ్చారు.

దేశ్‌కి బచావో-మోడీకి హటావో నినాదంతో 16న దేశవ్యాప్త సమ్మె



- గ్రామీణ భారత్ బంద్
- అఖిల పక్ష కార్మిక సంఘాల జిల్లా సదస్సు తీర్మానం

నవతెలంగాణ-కొత్తగూడెం

గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఎన్డీఏ నాయకత్వంలో ఉన్న బీజేపీ, మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా దేశం ప్రమాదంలో పడిందని, దేశాన్ని రక్షించుకోవడం కోసమే ఫిబ్రవరి 16న దేశ వ్యాప్త సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెని జిల్లా వ్యాప్తంగా జయప్రదం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాల జిల్లా సదస్సు తీర్మానం చేసింది. కొత్తగూడెంలో సిఐటియూ జిల్లా కార్యాలయంలో సిఐటియూ, ఐఎన్టియూసీ, బీఆర్టియూ, ఐఎఫ్టియూ, ఇఫ్ట్యూ, ఐఎఫ్టియూ సంఘాల జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మాచారి, నాగభూషణం, బాల్ రెడ్డి, విశ్వనాథం, గౌని నాగేశ్వర్ రావు, సుందర్‌లు అధ్యక్షవర్గంగా జిల్లా సదస్సు జరిగింది. సదస్సులో ప్రధాన వక్తలుగా సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, ఐఎన్టియూసీ రాష్ట్ర నాయకులు జలీల్, బీఆర్టియూ జిల్లా అధ్యక్షులు సానికొమ్ము శంకర్ రెడ్డి, ఐఎఫ్టియూ రాష్ట్ర నాయకులు ప్రసాద్, ఇఫ్ట్యుయూ రాష్ట్ర నాయకులు సీతారామయ్య, ఐఎఫ్టియూ రాష్ట్ర నాయకులు గోపాలరావులు సమ్మె ప్రాధాన్యతను వివరిస్తూ సంపద సృష్టి కర్తలుగా ఉన్న కార్మికులు, రైతులు కలిసి చేస్తున్న సమ్మెగా ఈ సమ్మె ఉంటుందని, గ్రామీణ భారత్ బంద్ పేరుతో సంయుక్త కిసాన్ మోర్చ నాయకత్వంలో జరుగుతుందని, పారిశ్రామిక బంద్, సమ్మెని కార్మిక వర్గం చేస్తున్నదని అన్నారు. ప్రపంచంలో ఆకలి సుచిలో భారతదేశం 125వ స్థానంలో ఉన్నదని, పౌష్టికాహారం లోపంతో చనిపోయే పిల్లల శాతం మన దేశంలోనే అత్యధికంగా ఉన్నదని అన్నారు. మత విధానాలను అమలు చేస్తూ, దేశాన్ని అత్యంత ప్రమాదంలోకి తీసుకెళ్తున్నారన్నారు. ఈ దుర్మార్గ విధానాల నుండిదేశాన్ని రక్షించుకోవడానికి 16న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నామన్నారు. ఈ సదస్సులో వక్తలను వేదికపైకి సిఐటియూ జిల్లా కార్యదర్శి ఏ.జె.రమేష్ పిలుపునిచ్చారు. సదస్సులో ఆయా యూనియన్ల జిల్లా నాయకులు జిలకర పద్మ, గద్దల శ్రీను, వెంకటమ్మ డి.వీరన్న, దొడ్డ రవి కుమార్, కె.సత్య, పిట్టల అర్జున్, రమేష్, మొగిలి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు సీఐటీయూ సమ్మె నోటీసు అందజేత

భద్రాచలం రూరల్ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుదామని, ఫిబ్రవరి 16న జరిగే సార్వత్రిక సమ్మె గ్రామీణ బందును జయప్రదం చేద్దామని సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికులు భద్రాచలం మండల ఎంఈఓ సమ్మయ్యకు సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ బందులో భాగస్వామ్యం అవుతారని, ప్రత్యక్షంగా సమ్మెలో పాల్గొనడం జరుగుతుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. అనంతరం కార్మికులు పనిచేస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కూడా సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు పి.శివమ్మ, ఎం.రాజేశ్వరి, ఎం సత్యవేణి, సిహెచ్ రమాదేవి, సిహెచ్ దమయంతి, అక్కల జ్యోతి, లక్ష్మి, నాగమణి, సుధా తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు : 16న జరుగు సమ్మె, గ్రామీణ బందుకు సంబందించి నోటీసును ఇల్లందు ఐసిడీఎస్ ప్రాజెక్టు అధికారిణి లక్ష్మీ ప్రసన్న అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పార్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె నోటీసును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఈసం వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు రాంబాయి, మరియ, కోశాధికారి ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

పినపాక : 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న పిలుపిచ్చారు. శనివారం పినపాక మండలం ఈ.బయ్యారంలో ఆయన మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న అసంఘటిత కార్మిక రంగానికి తగిన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

బిటీపీఎస్ సీఈకి సమ్మె నోటీస్

మణుగూరు: 16న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు సత్ర పల్లి సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం బీటీపీఎస్ సీఈ బిచ్చన్నకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతు కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దడిగల సత్యనారాయణ, కృష్ణ, రవి, రమణ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట : 16న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎస్‌కెఎం జిల్లా నాయకులు అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సుంకుపాక ధర్మ, వగ్గెల ప్రసాద్, కురసం ముత్యాలరావు, కేసరి వెంకటేష్, తోడెం దుర్గ, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు : 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. మండలం సారపాకలోగల సీపీఐ(ఎం) కార్యాలయంలో శనివారం సీఐటీయూ, వ్యకాస, రైతు సంఘాలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు శ్యామల అజయ్ కుమార్, రైతు సంఘం మండల నాయకులు కందుకూరి నాగేశ్వరావు, యార్లంకి అప్పారావు, పాల్గొన్నారు.



తునికాకు ప్రూనింగ్ పనులు ప్రారంభించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి

ఈ ఏడాది తునికాకు సేకరణకు సంబంధించి వెంటనే టెండర్లు పిలిచి ప్రూనింగ్ పనులు ప్రారంభించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. శనివారం ములకలపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనులకు రెండవ పంటగా ఆదాయానిచ్చే తునికాకు సేకరణ పై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, సీజన్ సమీపిస్తున్నా ఫారెస్టు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాగే గత ఐదు సంవత్సరాల తునికాకు బోనస్‌ను వెంటనే విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. తునికాకు సేకరణకు వెళ్లి గాయపడిన వారికి రూ.50వేలు, మరణించిన వారికి రూ.10 లక్షలు ఎక్స్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు గౌరి నాగేశ్వరరావు, రావుజా, రవికుమార్, మదు, సారయ్య, శ్రీను వెంకటనర్సమ్మ, ప్రసాద్ లక్ష్మినర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పర్యావరణపై మక్కువ చూపాలి

- పర్యావరణ పరిరక్షణ కమిటీ 2004 పిలుపు
- గ్రీన్ చర్ల పేరుతో 20 ఏండ్ల క్రితమే ఓ హరిత ఉద్యమానికి తెర లేపిన మధుర క్షణాలు



నవతెలంగాణ-చెర్ల

ప్రస్తుత యంత్రిక జీవితంలో మానవ మనుగడ కోసం ప్రతి ఒక్కరూ పర్యావరణ పై మక్కువ చూపాలని హనుమకొండ డిప్యూటీ కలెక్టర్ వై.వి.గణేష్ పిలుపునిచ్చారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగిన హరితహారం పై అవగాహన గతంలో మొక్కలు పెంపకం కోసం చేసిన కృషి పై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హరిత హారం, మొక్కల పెంపకం, గ్రీన్ రెవెల్యూషన్ వంటి పథకాలు లేని 2004 సంవత్సరంలో ప్రజల్లో కూడా వీటిపై కనీస అవగాహన కొరవడిన రోజులు రోజులు కావడం ఆనాడు అనగా సుమారు 20 సంవత్సరాల క్రితం అప్పటి చర్ల తహసీల్దార్‌గా ఉన్న వై.వి గణేష్ ప్రస్తుతం హనుమకొండ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహించే ఓ అధికారి ఇచ్చిన స్ఫూర్తితో, మండలంలోని ఔత్సాహికులతో ఓ సంఘటిత శక్తిగా ఏర్పడి, కొంత డబ్బులు సభ్యుల ద్వారా, మరికొంత అమౌంట్ పుర జనుల నుండి సేకరించి సుమారు రూ.2 లక్షల పైచిలుకు నిధులు సేకరించి 350 ట్రీ గార్డ్‌లను తయారు చేసి, చర్లలోని పలు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటి ఆ మొక్కలను కమిటీ సభ్యుల బాధ్యులచే పెంచడం ఓ అపూర్వ ఘట్టం. అంతేగాక సుమారు 4,000 మొక్కలను అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు, ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసి ప్రభుత్వ ఉద్యోగులను సైతం ప్రోత్సహించారు. వీటిలో 70 శాతం ప్రస్తుతం రోడ్లకు ఇరువైపులా 247 భారీ వృక్షాలు బాటసారులకు నీడను ఇస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ శుభ సమయాన్ని పురస్కరించుకొని నాటి గ్రీన్ చర్ల జట్టు అంతా కలిసి ఓ వీడియో షూట్ చేసి, ప్రజల్లో మరింత స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశ్యంతో చర్ల గాంధీ బొమ్మ సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 2004 హరితహారం కమిటీ చైర్మన్ సాగిరాజు వెంకట ఆంజనేయరాజు, సెక్రెటరీ చీమలమర్రి మురళి కృష్ణ, కోశాధికారి నీలి ప్రకాష్, వైస్ చైర్మన్ విస్సా నాగభూషణం, జాయింట్ సెక్రెటరీ కొత్తపల్లి ఆంజనేయులు (రైతు క్లబ్ చైర్మన్) పిఆర్వో చిట్టి మల్ల శేషగిరి, దొడ్డి తాతారావు, దొడ్డి రమణ, పివి రమణ, దొడ్డా ప్రభుదాస్, కొప్పుల రాంబాబు, ముమ్మినేని అరవింద్, గొట్టి పాటి శ్రీను, తాండవ రాయుడు, పి.రామకృష్ణ, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.



దొంగలను పొలిమేర దాటించి.. సైరన్ మోగించిన పంచాయతీ అధికారులు

నవతెలంగాణ కథనంతో బయటికొచ్చిన అతిపెద్ద అవినీతి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

శ్రీనగర్ కాలనీ పంచాయతీ పరిధిలో 2021లో జరిగిన అవినీతికి సంబంధించిన కోటిన్నర గోల్మాల్ అని వార్తతో శ్రీనగర్ పంచాయతీలో జరిగిన అవినీతిని వెలుగులోకి తీసుకొని వచ్చారు. కొంతమంది గ్రామపంచాయతీలోని ప్రజలు పంచాయతీలో జరిగిన అవినీతిపై మండల పరిషత్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది. తర్వాత దాన్ని అధికారులు జరిగిన అవినీతిని బయటికి రానీయకుండా చేశారు. 2022లో స్థానిక ప్రజలు, ఫిర్యాదుదారులతో కలిసి కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శి పై షోకాజు నోటీసులు జారీ చేశారు. అధికారులు అవినీతిపరులకు కొమ్ముకాసి దాన్ని మసిపూసి మారేడు కాయ చేసి విచారణలను జాప్యం చేశారు. విచారణకు సంబంధించి ప్రజల సొమ్ము పంచాయతీ నిధులు అయినప్పటికీ విచారణ చేసేటప్పుడు గ్రామసభల ద్వారానే ప్రజల సమక్షంలో గాని, ఫిర్యాదుదారుల సమక్షంలో గాని చేయవలసి ఉంటుంది, కానీఎవరికి తెలియకుండా గోప్యంగా అవినీతిపరులైన ప్రజాప్రతినిధులను కాపాడుకోవడం కోసం అధికారులు ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై పదవీకాలం అయిపోయిన తర్వాత మసిపూసి మారేడు కాయ చేసి దాన్ని నీరుగార్చారు. పెద్ద ఎత్తున ప్రజల సొమ్ము దుర్వినియోగం జరిగింది. ఇంత జరిగినప్పటికీ నాలుగు సంవత్సరాల కాలంలో రాజకీయనాయకులు, అధికారుల అండదండలతో సొమ్ము రికవరీ కాకుండా జాప్యం చేశారు. ప్రభుత్వం మారినప్పటికీ అధికారుల్లో ఎటువంటి మార్పు రాలేదు. ఏ అధికారి పర్యవేక్షణలో ఇంత పెద్ద అవినీతి జరిగిందో వారే విచారణ అధికారులుగా వచ్చి ప్రజలకు తెలియకుండా గ్రామ సభలు పెట్టకుండా ఫిర్యాదుదారులకు తెలియకుండా గోప్యంగా అంత పెద్ద అవినీతిని నీరుగార్చారు. కలెక్టర్ స్పందించిన మండల అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారు. పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యదర్శులపై వచ్చిన షోకాజు నోటీసులో పెట్టిన బిల్లులు కూడా పర్యవేక్షణ అధికారులు సృష్టించారని, దొంగ బిల్లులు, పెట్టారని స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జరిగిన అవినీతి మీద క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిష్పక్షపాతంగా నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది. అలా నిగ్గు తేల్చాలంటే గ్రామసభల ద్వారా ప్రజల సమక్షంలో ఫిర్యాదులుదారుల సమక్షంలో విచారణ చేపట్టాలి.

కుటుంబ దాడిలో తండ్రి మృతి

నవతెలంగాణ - అశ్వారావుపేట

మద్యానికి బానిసైన భర్త భార్యపై దాడి చేస్తుండగా తండ్రిని నిలువరించే క్రమంలో కొడుకు చేసిన ప్రతి దాడిలో తండ్రి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అశ్వారావుపేటకు చెందిన కోవా భద్రం (72) నిత్యం మద్యం సేవిస్తూ భార్య రాములమ్మపై దాడి చేస్తూ శారీరకంగా వేదిస్తుంటాడు. భర్త వేదింపులు తట్టుకోలేక రాములమ్మ మండల పరిధిలోని ఆసుపాక లో ఉంటున్న తన కూతురు విజయలక్ష్మి ఇంటికి వెళ్ళింది. శుక్రవారం మధ్యాహ్నం అక్కడకు వెళ్ళిన భద్రం యథాప్రకారం భార్యపై దాడికి దిగాడు. కుమారుడు నరేష్ అడ్డుకోబోయాడు. అయినా దాడి చేస్తుండటంతో భార్య రాములమ్మకుమారుడు నరేష్ కర్రలతో ప్రతి దాడి చేశారు. ఈ దాడిలో భద్రం తీవ్రంగా గాయపడ్డాడు. భద్రంను చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడిపై గాయాలు ఉండడంతో మృతుని మేనల్లుడు గురుమూర్తి అనుమానం వచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక విచారణలో ప్రతి దాడిలో భద్రం మృతి చెందినట్లు నిర్ధారణ కావటంతో హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్.హెచ్.ఒ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. భార్య రాములమ్మ, కుమారుడు నరేష్ తో పాటు కుమార్తె విజయలక్ష్మి పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఇంచార్జి సీఐ పెద్దన కుమార్ దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

అన్నదానం

నవతెలంగాణ-మధిర

శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వర్తక సంగం మధిర లో వేంచేసి ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు ప్రతి శనివారం అన్న గోవిందం జరుగును.ఈ అన్నదానం దాతలు, నెట్టెల అన్నపూర్ణాదేవి , నెట్టెల శ్రీనివాసరావు -శ్రీదేవి , వెచ్చా వినీత్ , వెచ్చా మల్లికార్జునరావు - లక్ష్మీ, వీరభద్రం వారి ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కపిలవాయి జగన్మోహన్రావు, వెచ్చ శ్రీనివాసరావు, కాలం వీరభద్రం, కొల్లా శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు టు మర్కోడు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

- మేడారం నిండు జాతరకూ ప్రత్యేక బస్సు నడపాలి
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు తులం ముత్తిలింగం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఇల్లందు పట్టణం ఆర్టీసీ డిపో నుంచి ఆళ్ళపల్లి మండలంలోని మర్కోడు గ్రామం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, కోశాధికారి తులం ముత్తిలింగం అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మండల కేంద్రంలో నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా ఆళ్ళపల్లి మండలం ప్రజలు నిత్యావసర సరుకులు, వ్యాపార లావాదేవీలు, విద్య, వైద్యం నిమిత్తం రాకపోకలు ఇల్లందుకు అధికంగా ఉండేవన్నారు. వారితో పాటు మండలానికి వచ్చే వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు సైతం బస్సు సౌకర్యం సద్వినియోగం చేసుకుని ఆక్యూపెన్సీ పెంచి ప్రభుత్వానికి, బస్సు యాజమాన్యానికి అధిక లాభాలు చేకూర్చిన రోజులు ఉన్నాయని తెలిపారు. అంతంత మాత్రంగానే ఉన్న నాటి రోజుల్లో ప్రైవేట్, ఆర్టీసీ బస్సులు నడిచాయని, గ్రావెల్ మార్గంలో ప్రస్తుతం కిన్నెరసానిపై వంతెన, ఇల్లందు నుంచి మండల పరిధిలోని మర్కోడు వరకు ఎక్కడా అవాంతరం లేని బీటీ రోడ్డు ఏర్పాటై సంవత్సరాలు గడుస్తున్నా గాని, ఇల్లందు నుంచి ఆళ్ళపల్లి మండలానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది 2023లో నూతనంగా ఇల్లందు పట్టణంలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేసినా బస్సు సౌకర్యం ఆళ్ళపల్లికి పునః ప్రారంభం కాకపోవడం దారుణమన్నారు. కాగా అనంతోగు కాచనపల్లి గ్రామాల మధ్య అడవిలో 6 కిలోమీటర్ల మేర బీటీ సింగిల్ రోడ్డు ఉండి, ఆ బాటన ప్రైవేట్ వాహనాల ద్వారా వెళ్లి కేవలం గత ఏడాది కాలంలోనే నలుగురు మృతి చెందారని, అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురై వికలాంగులుగా మారిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, సురక్షితమైన ప్రయాణాలకు ఇకనైనా విద్య, వైద్య, వ్యాపారం, ఉద్యోగం, తదితర ప్రజల అవసరాల దృష్ట్యా పినపాక, ఇల్లందు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్యలు ఆర్టీసీ బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మేడారం నిండు జాతర ముగిసేవరకు ఆళ్ళపల్లి భక్తుల సౌకర్యార్థం కొత్తగూడెం లేదా ఇల్లందు డిపో నుండి మండలానికి వచ్చి వయా గుండాల మీదుగా బస్సు మేడారంకు వెళ్లేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు నడపాలని విజ్ఞప్తి చేశారు.

సర్పంచ్ గా మారాళ్ళ మమత సేవలు అనుసరణీయం

- సర్పంచ్ దంపతులను సన్మానించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మారెళ్ళ మమత, మల్లికార్జున్ దంపతులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలు గ్రామ అభివృద్ధికి సర్పంచ్ దంపతులు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం.దామోదర్ ప్రసాద్, పంచాయతీ రాజ్ అశోక్, సెక్రటరీ వేణు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారేపల్లి ఎంపీవోగా పర్వీన్



నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండల పంచాయతీ అధికారి(ఎంపీవో)గా పర్వీన్ నియమితులైనారు. ఆమె వరంగల్ జిల్లా నెక్కొండ నుండి బదిలీపై కారేపల్లి మండలానికి వచ్చారు. పర్వీన్ తన నియామక ఉత్తర్వులను ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 41 పంచాయతీలకు సంబంధించి పూర్తి అవగాహన చేసుకొని, స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులతో సమన్వయంతో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం దానిని జాగ్రత్తగా కాపాడుకోవాలి

న్యాయమూర్తి జావేద్ పాషా



నవతెలంగాణ-ఖమ్మంలీగల్

మంచి ఆరోగ్యానికి మించిన విలువైనది ఏదీ లేదని, దానిని జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవా సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్లు, న్యాయశాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వైద్యశాస్త్ర నిపుణులు డాక్టర్ పి.కనకలక్ష్మి మాట్లాడారు. ఒత్తిడి లేని ప్రశాంతమైన జీవితం, శారీరక వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లు, నియమ బద్ధమైన జీవితం మనిషికి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయని వైద్యురాలు తెలిపారు. వేడి చేసిన ఆహారాన్ని మళ్లీమళ్లీ వేడి చేయడం, వాడిన వంటనూనె తిరిగి వాడటం వంటి ప్రమాదకరమైన చర్యలను త్యజించాలని ఆమె పిలుపునిచ్చారు. రోజు ఉదయం లేదా సాయంత్రం సూర్యరశ్మి పడేలా నడక సాధన చేయటం, మానసిక ప్రశాంతతకు యోగా వంటివి సాధన చేయటం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



కామన్ విద్యకు కమీషన్ ఏర్పాటు చేయాలి

- యూటీఎఫ్ మండల అధ్యక్షులుగా కేవీ కృష్ణారావు

నవతెలంగాణ-కారేపల్లి

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందరికి ఉచిత కామన్ విద్యనందించటానికి విద్యా కమీషన్ ఏర్పాటు చేయాలని టీఎస్‌యూటిఫ్ జిల్లా అధ్యక్షులు జీవీ నాగమలేశ్వరరావు కోరారు. టీఎస్ యూటీఫ్ కారేపల్లి మండల 10వమహాసభ కారేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈమహాసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 9 ఏండ్లుగా విద్యారంగంపై సమీక్ష లేకుండా సమస్యల కుప్పగా మార్చిందని విమర్శించారు. ఉద్యోగుల ఆశలకు అనుగుణంగా నూతన ప్రభుత్వం 6 గ్యారంటీలతో పాటు 7వ గ్యారంటీగా విద్యాకమీషన్ ఏర్పాటు చేర్చాలని కోరారు. జిల్లా కార్యదర్శులు బానోత్ రాందాస్, డీఎస్ నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక నిరాశ నిస్పృహలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఆశ్రమ,కేజీబీవీ, గురుకుల సీఆర్‌టీలను మినిమమ్ బేసిక్ వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

మండల నూతన కమిటీ ఎన్నిక

మండల టీఎస్ యూటిఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కేవీ కృష్ణారావు, ప్రధానకార్యదర్శిగా బీ.మంగీలాల్, ఉపాధ్యక్షులుగా ఆర్.నాగలక్ష్మి, బీ.సూర్య, కోశాధికారి గా ఎం.నాగేశ్వరరావు, కార్యదర్శులుగు కే.గంగాధర్, కే.నాగలక్ష్మి, ఎన్. రామకృష్ణ, పీ.రామారావు, వీఎల్ సావిత్రి, హెచ్. భాస్కర్, ఆడిటర్‌గా డీ.రాంబాబు, అకాడమిక్ కన్వీనర్‌గా డీ.ఈర్యా, మహిళా కన్వీనర్‌గా బీ.సునిత, క్రీడా కన్వీనర్‌గా ఏ.సుస్మితలను ఎన్నుకున్నారు.

మోడీది మోసపూరిత ప్రచారం

- సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

నవతెలంగాణ-కారేపల్లి

అచ్ఛేదిన్, ఆత్మనిర్భర్, మేకిన్ ఇండియా, విశ్వగురు నినాదాలతో మోడీ మోసపూరిత ప్రచారం చేస్తున్నాడని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ విమర్శించారు. శనివారం కారేపల్లి, కామేపల్లి మండలాల సీపీఐ ముఖ్యకార్యకర్తల సమావేశం కారేపల్లి క్రాస్ రోడ్‌లో ఏపూరి లతాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేసంలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పన హామీ అమలు నోచుకోక నిరుద్యోగం 50 ఏండ్ల గరిష్టస్థాయికి చేరిందన్నారు. మోడీ విధానాలతో ధరలపై నియంత్రణ లేక ప్రజల కొనుగోలు శక్తి తగ్గిందని అదేసమయంలో కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్టస్థాయికి చేరాయన్నారు. ఈనెల 16న నిర్వహించతలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ వైరా నియోజవర్గ ఇంచార్జ్ యర్రా బాబు, కారేపల్లి, కామేపల్లి మండలాల కార్యదర్శులు బోళ్ల రామస్వామి, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీమా చెక్ అందజేత

నవతెలంగాణ-కారేపల్లి

మండలంలోని మేకలతండాలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గుగులోత్ మల్సూర్ కుటుంబానికి బీఆర్ఎస్ సభ్యత్వ బీమా చెక్‌ను శనివారం మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, ప్రముఖ న్యాయవాది నర్సింగ్ శ్రీనివాసరావు, నాయకులు హన్మకొండ రమేష్, బత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి కుంజ శ్రీనివాసరావు దరఖాస్తు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంజ శ్రీనివాసరావు శనివారం దరఖాస్తు చేసుకున్నారు. కాగా మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి ఇప్పటివరకు సుమారు 20 మంది ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. వీరిలో కుంచ శ్రీనివాసరావు ఒకరు.

వేసవికాలంలో మంచినీటి ఎద్దడి లేకుండా ముందుస్తుగా జాగ్రత్తలు చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-కల్లూరు

వేసవికాలంలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతీ స్పెషలాఫీసర్ల పరిపాలనపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు రాబోయే వేసవికాలంలో తాగునీరు నీటి ఎద్దడి తట్టుకునే విధంగా ప్రణాళిక చేయాలని, పంచాయతీల అభివృద్ధిలో మహిళా సంఘాలకు యువతకు సామాజిక అభివృద్ధికి చైతన్య కార్యక్రమాలకు భాగస్వామ్యం కల్పించాలని తెలియజేయడం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మండల అధికారులు ఎండిఓ బి. రవికుమార్, తహసీల్దార్ సాంబశివుడు, డిప్యూటీ తహసీల్దార్ జంగా బాబ్జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలో ఉన్న.. ప్రజల పక్షాన ఉన్నాం

- ఆటో కార్మికుల ఆత్మహత్యలను ఆపాలి
- నెలకు పదివేలు ఇచ్చే ఆదుకోవాలి
- గత ప్రభుత్వం అభివృద్ధి పనులు నిలిపివేస్తే నిరసన తెలపండి
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

నవతెలంగాణ-మణుగూరు

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మంది ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. 12 మంది ఆత్మహత్య చేసుకున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఆటో కార్మికుడికి 10 రూపాయలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం హనుమాన్ ఫంక్షన్ హాల్ లో బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గం స్థాయి సమావేశం మాజీ శాసనసభ్యులు జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు మాట్లాడుతూ ఓటమిపాలైనప్పటికీ ఉత్సాహంగా ఉన్నామన్నారు. ప్రజల పట్ల విశ్వాసంతో ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మూడవసారి బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకొని హ్యాట్రిక్ సాధించాలన్నారు. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. జనవరి నెలలో ఆసరా పెన్షన్లు ఇవ్వలేదని అన్నారు. మంత్రులు కళ్ళు నెత్తికెక్కి మాట్లాడుతున్నారని అన్నారు. రైతుబంధు, ఇతర సంక్షేమ పథకాలను అడిగితే కేసులు పెడుతున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల శాసనసభ్యుల జీతాలను నిలుపుదల చేసి రైతుబంధు అందించామని చెప్పారు. ప్రాజెక్టులన్ని ఢిల్లీ చేతులు పెట్టారన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణ బోర్డుకి ఇచ్చారని అన్నారు. దీని కారణంగా రైతులు రోడ్డున పడుతున్నారు.

పినపాక నియోజకవర్గం లో కోట్లాది రూపాయల నిధులను రద్దు చేసిన పాయం వెంకటేశ్వర్లను నిలదీయాలన్నారు మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ దేశంలోని అత్యధిక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు. రేగా రేకాంతరావు మాట్లాడుతూ ఓటమిని సమీక్షించుకొని రాబోయే కాలంలో అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచేందుకు కార్యకర్తలు నాయకులు పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, దిండిగల రాజేందర్, భవాని శంకర్, పోశం నరసింహారావు, ముత్యం బాబు, రామిడి రామిరెడ్డి, బొలిశెట్టి నవీన్, కురి నాగేశ్వరరావు, దొండేటి మోహన్రావు, ధారావత్ రమణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీకి సమగ్ర చట్టం చేయాలి

- వ్యవసాయ కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు


నవ తెలంగాణ -ఖమ్మం కార్పొరేషన్



వ్యవసాయ రంగంపై ఆధారపడి పనిచేస్తున్న వ్యవసాయ కార్మికులకు వారి ఆర్థిక అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చట్టాలు చేసి అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీకి సంవత్సరానికి రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలి, 200 రోజులు పని దినాలు కల్పిస్తూ రోజుకు 600 రూపాయలు చొప్పున కూలి వేతనం ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు కూలి బీమా సౌకర్యం కల్పించాలని కూలి బందు పథకాన్ని అమలు చేస్తూ నెలకు 5000 రూపాయలు చొప్పున వ్యవసాయ కార్మికులకు ఇవ్వాలని నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు ఇల్లు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ శనివారం ఖమ్మం అర్బన్ మండల తాసిల్దార్ సిహెచ్ స్వామి కి మెమోరాండం ఇవ్వటం జరిగింది. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక. రైతు. వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తేదీన గ్రామీణ బంధు కార్మిక సమ్మెను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాపనేని వెంకటేశ్వరావు, జిల్లా నాయకులు సారంగి పాపారావు, రావన్నపేట తిరుపయ్య, ఉపేంద్ర చారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకంగా నిర్మల సీతారామన్ బడ్జెట్

- సంక్షేమ రంగాన్ని పూర్తిగా విస్మరించారు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్



నవతెలంగాణ-సత్తుపల్లి

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ విమర్శించారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమ రంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. పేదలకు అందాల్సిన విద్య, వైద్యానికి మొండిచేయ్యి చూపించారన్నారు. ఉపాధిహామీ పథకానికి ప్రతియేటా నిధులు తగ్గిస్తూ వస్తున్న మాదిరిగానే ఈసారి కూడా తగ్గించారన్నారు. సంపన్న వర్గాలకు అనుకూలంగా బడ్జెట్‌ను రూపకల్పన చేశారన్నారు. కార్పొరేట్ శక్తులకు భారీగా రాయితీలు కల్పించారన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ బడ్జెట్ పూర్తిగా రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రవేశపెట్టిన బడ్జెట్‌గా ఉందన్నారు. ప్రజలకు నష్టం కలిగించే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని శ్రీనివాస్ విమర్శించారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

- ఇన్సూరెన్స్ చెక్కుల పంపిణీలో బాణోత్ మదన్ లాల్

నవతెలంగాణ-వైరాటౌన్

బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి, వైరా మాజీ శాసనసభ్యులు బాణోత్ మదన్ లాల్ అన్నారు. శనివారం వైరా మున్సిపాలిటీలో 1, 13 వార్డుల్లో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండి ఇటీవల మరణించిన వారి కుటుంబాలకు సంబంధించిన పార్టీ ఇన్సూరెన్స్ చెక్కులను బాణోత్ మదన్ లాల్ అందజేశారు. ఇంటికి వెళ్ళి నేరుగా వారికి మదన్ లాల్ చెక్కులు అందజేశారు. అనంతరం బాణోత్ మదన్ లాల్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని, ఎలాంటి ఆందోళన గురి కావద్దని, ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు, కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని, నాతో పాటు రాష్ట్ర పార్టీ కూడా మీకు నిత్యం అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీత రాములు, దిశ కమిటీ సభ్యులు కట్టా క్రిష్ణార్జునరావు, 1వ వార్డు కౌన్సిలర్ మరికంటి డేడి కుమారి శివ, లయన్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళి క్రిష్ణా, మట్టూరి క్రిష్ణారావు, రామాలయం చైర్మన్ మిట్టపల్లి సత్యంబాబు, మాదినేని ప్రసాద్ పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం బీఎస్పితోనే సాధ్యం

బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బుర్ర ఉపేంద్ర సాహూ

నవతెలంగాణ-ముదిగొండ

బీఎస్‌పీ ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బుర్ర ఉపేందర్ సాహూ అన్నారు. బీఎస్పీ మండల ముఖ్యకార్యకర్తల సమావేశం ముదిగొండ కేంద్రంలో మధిర అసెంబ్లీ ఇంచార్జ్ పల్లెపోంగు విజయ్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 శాతంగా ఉన్నటువంటి ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీలను ఆధిపత్య అగ్రకుల పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి ప్రజలను మోసం చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నిత్యం బహుజనుల సంపదను దోసుకుంటున్నాయన్నారు.

బీఎస్పి మండల అధ్యక్షులుగా నెమలి శ్రీకాంత్

బిఎస్పి మండల అధ్యక్షులుగా మండలం గోకినేపల్లి గ్రామానికి చెందిన నెమలి శ్రీకాంత్‌ని నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షులు బుర్ర ఉపేంద్ర సాహూ తెలిపారు. ఈ సమావేశంలో బిఎస్పి జిల్లా ఉపాధ్యక్షులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, జిల్లా కార్యదర్శి పల్లెపొంగు విజయకుమార్ పాల్గొన్నారు.

3వ రైల్వే లైన్ బాధిత రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించండి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ - బోనకల్

బోనకల్ రైల్వే స్టేషన్ పరిధిలోగల గోవిందాపురం ఏ గ్రామం వద్ద 3వ రైల్వే లైన్ కింద భూములను కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని ఖమ్మం ఆర్డీవో గుంటుపల్లి గణేష్ కు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించినట్లు గోవిందాపురం ఏ గ్రామ కాంగ్రెస్ నాయకుడు భాగం నాగేశ్వరరావు విలేకరులకు తెలిపారు. హైదరాబాదులో మంత్రి పొంగులేటి గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన బాధిత రైతులు, కాంగ్రెస్ నాయకులు శనివారం కలిశారు. గోవిందాపురం ఏ, ఆళ్ళపాడు, మోటమర్రి రెవిన్యూ గ్రామాల పరిధిలో మూడవ రైల్వే లైను విస్తరణలో భాగంగా రైతుల భూములు కోల్పోయారన్నారు. కాని బాధిత రైతులకు అందవలసిన నష్టపరిహారము పూర్తిగా అందలేదని మంత్రి దృష్టికి వారు తీసుకెళ్లారు. దీంతో పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించి వెంటనే ఖమ్మం ఆర్డిఓ గుంటుపల్లి గణేష్ కు ఫోన్ చేసి రైతులకు అందవలసిన నష్టపరిహారాన్ని త్వరగా అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో బోనకల్ మండల కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరరావు, బండి రామారావు, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని ఆదివాసీలకు కేటాయించాలి

- ఆదివాసీ జేఏసీ డిమాండ్



నవతెలంగాణ-చర్ల

ఆదివాసీలు అధిక సంఖ్యలో ఉన్న మహబూబాబాద్ ఎంపీ స్థానాన్ని ఆదివాసీ అభ్యర్థికి కేటాయించాలని ఆదివాసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ శనివారం ఆదివాసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మండల పరిధిలోని ఎదిర గుట్టలు శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీల సాంస్కృతిక, సంప్రదాయ, కళలతో పాటు జాతి హక్కులు, రిజర్వేషన్ ఫలాలు అన్ని రక్షించుకోవలని ఆత్మీయ సమ్మేళనంలో పిలుపునివ్వడం జరిగింది. ఆదివాసులకు దక్కాల్సిన రాజకీయ రిజర్వేషన్ల పరంగా మహబూబాబాద్ ఎంపీ స్థానంలో 2009, 2014, 2019 సంవత్సరలలో ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అవేదన వ్యక్తం చేశారు. ఈ సారి రాబోవు 2024 ఏప్రిల్ నెలలో జరగబోవు పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఈసారి కచ్చితంగా ఆదివాసులకు టికెట్ కేటాయించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేస్తుంది.



జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో...

వీవీ విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

- తృతీయస్థానాల్లో జెడ్పీఎస్ఎస్ కాకర్లపల్లి
- ప్రథమ, ద్వితీయ స్థానాల్లో చైతన్య టెక్నో

నవతెలంగాణ-సత్తుపల్లి

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఖమ్మంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో స్థానిక వీవీ విద్యాలయం 10, 9, 8 తరగతి విద్యార్థులు జీ నాగసాయి ఉపేంద్ర, ఎండీ మౌలానా షఫీక్, పి భరత్‌చంద్ర జిల్లా స్థాయిలో తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఒగ్గు భగవాన్‌రెడ్డి, హెచ్‌ఎం వంశీకృష్ణ, సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

జెడ్పీఎస్ఎస్ కాకర్లపల్లి విద్యార్థులకూ తృతీయస్థానం

మండలంలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తెలుగు విభాగంలో చరణ్‌తేజ, సౌజన్య, గీతాంజలి జిల్లాస్థాయిలో తృతీయస్థానం దక్కించుకున్నారు. ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో బహుమతిని సాధించిన విద్యార్థులను ఆ పాఠశాల హెచ్ నక్కా రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు బాల నాగేశ్వరరావు, రాంబాబు, మురళీ, రమాకుమారి, రమాదేవి, సుదర్శనమ్మ సురేశ్ అభినందించారు.

జిల్లాస్థాయి ద్వితీయ స్థానాల్లో చైతన్య టెక్నో స్కూలు విద్యార్థులు

గాంధీ గ్లోబల్, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సహకారంతో రాష్ట్ర సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో స్థానిక గుడిపాడు రోడ్డులోని చైతన్య టెక్నో స్కూలు విద్యార్థులు సీహెచ్ భవన్‌సాయి, జోత్స్న పల్లవి జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవశం చేసుకున్న విద్యార్థులను ఆ స్కూల్ ప్రిన్సిపాల్ వై మురళీకృష్ణ, డైరెక్టర్లు ఆర్ సుజాత, ఆర్ రాకేశ్, ఎం రవికుమార్, జీ యేసుబాబు, వై ఉష, ఆర్ రాధ, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు సాంబశివరావు అభినందనలు తెలిపారు.

కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో బాణాపురం గ్రామంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం మండల కార్యదర్శి మరికంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాణాపురం కల్లుగీత కార్మిక సంఘం సొసైటీ అధ్యక్షులు మరికంటి రామలింగం గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు వట్టికూటి వెంకటేశ్వర్లుగౌడ్, గ్రామ కల్లుగీత కార్మిక సంఘం సీనియర్ నాయకులు వత్సవాయి సైదులు గౌడ్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ ఉద్యోగానికి పమ్మి యువతి ఎంపిక



నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో పమ్మి గ్రామానికి చెందిన రాయబారపు (ఆవుల) నాగేశ్వరరావు పెద్దకూతురు శ్రీకన్య స్టాఫ్ నర్స్ ఉద్యోగానికి ఎంపికైంది. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి కుటుంబానికి, గ్రామానికి పేరు తెచ్చిన రాయబారపు శ్రీకన్యను సీనియర్ జర్నలిస్ట్ ఆవుల రామారావు, లాయర్, గాయకుడు పమ్మి రవిబాబులతో పాటు, గ్రామంలో పలువురు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తన కూతురికి ప్రభుత్వ ఉద్యోగం రావటం పట్ల తల్లిదండ్రులు రాయబారపు నాగేశ్వరరావు స్వరూప ఆనందాన్ని వ్యక్తపరిచారు.



విజయువంతంగా జేవీవీ జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

- ఈ నెల 9, 10, 11న జరిగే రాష్ట్రస్థాయి టెస్ట్‌కు ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం

జనవిజ్ఞాన వేదిక ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విజయువంతంగా ముగిసింది. జిల్లాలోని అన్ని మండలాల నుండి మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన ప్రభుత్వ ఇంగ్లీష్, తెలుగు మీడియం, ప్రైవేట్ పాఠశాలలకు 240 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రశ్నాపత్రాలను రిక్కాబజార్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంత కుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక దేశం అభివృద్ధి చెందాలంటే సైన్స్ అభివృద్ధి చెందాలన్నారు. జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు మల్లెంపాటి వీరభద్రం మాట్లాడుతూ పిల్లలు శాస్త్ర దృక్పదాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రజల్లో మూఢనమ్మకాలు తొలిగించడంలో జన విజ్ఞాన వేదిక గత 35 సంవత్సరాలుగా కృషి చేస్తుందన్నారు.

విజేతలు వీరే

ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ బహుమతిని జెడ్పీ హెచ్ఎస్ తనికెళ్ల, ద్వితీయ బహుమతిని టివిఎంజి హైస్కూల్ మధిర, తృతీయ బహుమతిని జెడ్పీహెచ్ఎస్ మాదాపురం, ముదిగొండ మండలంతో పాటు టిటిడబ్ల్యూఆర్(ఎస్ఓఇ) ఖమ్మం పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ప్రభుత్వ తెలుగు మీడియంలో ప్రథమ బహుమతిని జెడ్పీఎస్ఎస్ జక్కేపల్లి, కూసుమంచి మండలం, ద్వితీయ బహుమతిని జెడ్పీహెచ్ఎస్ఎస్ పమ్మి, ముదిగొండ మండలం, తృతీయ బహుమతిని జెడ్పీఎస్ఎస్ కాకర్లపల్లి, సత్తుపల్లి మండలం, జెడ్పీఎస్ఎస్ గొల్లపూడి, వైరా మండలం విద్యార్థులు గెలుచుకున్నారు. ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియంలో ప్రథమ బహుమతిని శ్రీ భాస్కర మోమోరియల్ హైస్కూల్, మీనవోలు, ఎర్రుపాలెం మండలం, ద్వితీయ బహుమతిని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, ఖమ్మం, తృతీయ బహుమతిని లక్ష్య టాలెంట్ స్కూల్ పెనుబల్లి విద్యార్థులు గెలుచుకున్నారు. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజేతైలన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. జిల్లా సైన్స్ అధికారి జగదీష్, రిక్కాబజార్ స్కూల్ హెచ్‌ఎం వి.శాంతకుమారి, జెవివి జిల్లా సీనియర్ నాయుకులు మల్లెంపాటి వీరభద్రరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.శివన్నారాయణ, కె.రామారావు తదితరులు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో చెకుముకి కన్వీనర్ మోహన్, ఎల్వి రెడ్డి శ్రీరాములు,పురుషోత్తం పాల్గొన్నారు.

దళితులను దగా చేసిన కేంద్ర బడ్జెట్

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దళితులను దగా చేసిందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ. 7 లక్షల కోట్లు కేటాయించాల్సి వుండగా, బడ్జెట్ లో కేవలం రూ. లక్షా ఆరు వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీకి రూ. 3లక్షల కోట్లు కేటాయించకుండా కేవలం రూ. 86 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు.ఉపాధి హామీ కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమిదేనని విమర్శించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, వివిధ సంఘాల నాయకులు శివలింగం, నర్సింహ్మా, నవిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై లైంగికదాడి..

- బాన్సువాడలో దారుణం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

విద్యార్థినిపై ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడలో శనివారం ఉదయం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన ఓ బాలిక బాన్సువాడ పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతోంది. కాగా, అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు బాన్సువాడకు వెళ్తుండగా.. తన కూతురు బడికి ఆలస్యమవుతుండటంతో ఆమెను బాన్సువాడలోని పాఠశాలలో విడిచిపెట్టాలని ఆ బాలిక తండ్రి ఆ యువకుడి బైక్‌పై పంపాడు. యువకుడు బాలికను పాఠశాలలో వదిలి పెట్టాల్సింది పోయి చిన్న పని ఉందని చెప్పి ఆమెను నమ్మించి బాన్సువాడ పట్టణంలోని ఓ రాజకీయ నేతకు చెందిన లాడ్జ్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కేకలు వేయడంతో లాడ్జ్ పక్కనున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దాంతో పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని అమ్మాయిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

ఆర్టీసీకి నిధులు విడుదల

- రీయింబర్స్‌మెంట్ పద్దు కింద రూ.212.50 కోట్లు
- రుణాల రీపేమెంట్ కోసం రూ.162.50 కోట్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)కి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ శ్రీనివాసరాజు జీవో నెంబర్లు 61, 62 విడుదల చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా టీఎస్ఆర్టీసీకి వివిధ వర్గాలకు ఇస్తున్న రాయితీల రీయింబర్స్‌మెంట్ పద్దు ద్వారా రూ.212.50 కోట్లు విడుదల చేశారు. ఈ పద్దు కింద రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మొత్తం రూ.850 కోట్లు కేటాయించగా, దానిలోంచి ఇప్పటికే రూ.637.50 కోట్లు విడదల చేశారు. మిగిలిన సొమ్మును తాజాగా ప్రభుత్వం ఆర్టీసీకి బదలాయించింది. టీఎస్ఆర్టీసీ రుణాల చెల్లింపు కోసం తాజాగా రూ.162.50 కోట్లు విడుదల చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పద్దు కింద మొత్తం రూ.650 కోట్లు కేటాయించగా, దానిలో రూ.487.50 కోట్లను గతంలో విడదల చేశారు. తాజా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆర్టీసీకి మొత్తంగా రూ.375 కోట్ల సొమ్మును చెల్లించింది.

'మహాలక్ష్మి' డబ్బులూ ఇవ్వండి

- మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోండి
- టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు సంబంధించి ఆర్టీసీకి రావల్సిన రూ. 374 కోట్ల సొమ్మును విడుదల చేయడం పట్ల టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. అదే సందర్భంలో 2023 డిసెంబర్ 9 నుంచి 'మహాలక్ష్మి' మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు ద్వారా గడచిన రెండు నెలల్లో దాదాపు రూ.900 కోట్ల ఆదాయాన్ని ఆర్టీసీ కోల్పోయిందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వీరాంజనేయులు,వీఎస్ రావు శనివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఆ డబ్బుల్ని వెంటనే విడుదల చేయాలనీ, జీరో టిక్కెట్ సొమ్మును ప్రతినెలా చెల్లిస్తూ,మూడు నెలల డబ్బుల్ని ముందస్తుగా ఆర్టీసీకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఆ మేరకు ఆదివారం జరిగే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు.అదే సందర్భంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలనీ,విలీన ప్రక్రియ పూర్తిచేయాలని పేర్కొన్నారు.కార్మికులకు 2017, 2021 వేతన ఒప్పందాలు చేసి,బకాయిలతో సహా వాటిని చెల్లించి,సంస్థలో యూనియన్ కార్యకలాపాలను అనుమతించాలని కోరారు.

సముద్ర సమాచార కేంద్రంపై ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఐఎన్‌సీఓఐఎస్) వ్యవస్థాపక వజ్రోత్సవాలను పురస్కరించుకొని పోస్టల్ శాఖ ప్రత్యేక స్టాంప్‌ను విడుదల చేసింది. బాచుపల్లిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన వజ్రోత్సవ వేడుకల్లో తపాలాశాఖ తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి ఈ ప్రత్యేక స్టాంపును ఆవిష్కరించారు. నిటి అయోగ్ సభ్యులు డాక్టర్ విజయకుమార్ సారస్వత్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ) కార్యదర్శి డాక్టర్ ఎమ్ రవిచంద్రన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోస్టల్ శాఖ చారిత్రక నేపథ్యంతో కూడిన అనేక ప్రత్యేక స్టాంపుల్ని రూపొందించి, విడుదల చేస్తుందనీ, దానివల్ల జనబాహుళ్యంలో చరిత్ర చిరస్థాయిగా నిలుస్తుందని డాక్టర్ పీవీఎస్ రెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక స్టాంపు ముఖ విలువ రూ.5 గా నిర్ణయించారు. వీటిని ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. సంస్థ వెబ్‌సైట్ www.indiapost.gov.in ద్వారా ఇతర వివరాలు తెలుసుకోవచ్చు.

గ్రామీణ, పారిశ్రామిక బంద్‌కు పీఓడబ్ల్యూ మద్దతు

- ప్రగతిశీల మహిళా సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే గ్రామీణ, పారిశ్రామిక బందుకు ప్రగతి శీల మహిళా సంఘం మద్దతు తెలియజేస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఝాన్సీ, మంగ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగ ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. పంటలకు మద్దతు ధర ఇవ్వాల్సిందేనన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం హరిస్తున్నదని విమర్శించారు. సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసేహక్కులను కాలరాస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కలిగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ఇప్పటికీ అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేదనీ, వాటికి కూడా బస్సు సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. దూర ప్రాంతాల్లో శ్రమ చేసే మహిళలకు రవాణా భారం తగ్గిందన్నారు. మహిళలకిచ్చిన మరి కొన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో పీఓడబ్ల్యూ ఉపాధ్యక్షులు జ్యోతి, కార్యదర్శి ఆర్ సీత, కోశాధికారి గీత ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జానకి, కావేరి, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అసోం సీఎం నిర్వాకం !

ఖజానా ఖర్చుతో పార్టీ ప్రచారం

- హెలికాప్టర్లు, విమానాల్లో విహారం
- వివాహాలకూ సర్కారు సొమ్ముతోనే ప్రయాణం



గౌహతి : బీజేపీకి చెందిన అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని సొంత పనుల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. రాష్ట్రంలోనూ, బయట బీజేపీ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ప్రతిసారీ హెలికాప్టర్లు, ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకొని విహరిస్తున్నారు. అందుకయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. పార్టీ కార్యక్రమాలతో పాటు వివాహాలకు హాజరయ్యేందుకు కూడా ఆయన ప్రభుత్వ సొమ్మునే వాడుకుంటున్నారు. ఇది ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణ కాదు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు అసోం ప్రభుత్వం ఇచ్చిన సమాధానం.

క్రాస్‌కరంట్ అనే స్వతంత్ర వార్తా సంస్థ 2022 ఆగస్ట్ 26న శర్మ ఖర్చులపై ఆర్‌టీఐ ద్వారా సమాధానం కోరింది. పన్ను చెల్లింపు దారుల సొమ్ముతో శర్మ హెలికాప్టర్లు, ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకొని పార్టీ సమావేశాలతో పాటు అనేక వివాహాలకు హాజరయ్యారని ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో తేలింది. అధికారేతర కార్యకలాపాల కోసం ఏ ప్రభుత్వమూ ప్రజా ధనాన్ని ఉపయోగించకూడదు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధం. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ కార్యక్రమాలకు హాజరవడం, ప్రైవేటు కార్యక్రమాలకు వెళ్లడం వంటివి అధికారేతర కార్యకలాపాల కిందికే వస్తాయి. ప్రభుత్వ కార్యక్రమాల కోసమే సొమ్ము చెల్లించి ఛార్టర్డ్ విమానాలను అద్దెకు తీసుకున్నామని గత సెప్టెంబరులో శర్మ ప్రభుత్వం శాసనసభ సాక్షిగా తెలిపింది. శర్మ చేసిన ఖర్చులకు సంబంధించి ప్రభుత్వ ఆర్థిక పద్దులపై సమాచారం కోరుతూ ఆర్‌టీఐ కింద అడిగిన ప్రశ్నకు తొలుత రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ స్పందించలేదు. దీనిపై క్రాస్‌కరెంట్ రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిగా పనిచేస్తున్న ప్రదీప్ శర్మ గత సంవత్సరం సెప్టెంబర్ 30న కొంత సమాచారం అందించారు. అయినప్పటికీ అది పాక్షికంగానే ఉంది.

కోడ్‌ను ఉల్లంఘించి...

ముఖ్యమంత్రి సొంత సామాజిక మాధ్యమ హ్యాండిల్స్ నుండి సేకరించిన ఫొటోల ప్రకారం ఆయన కనీసం ఐదుసార్లు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని తేలింది. బీజేపీ భాగస్వామ్య పక్షమైన యూపీపీఎల్ అభ్యర్థి తరఫున ప్రచారం కోసం 2021 అక్టోబర్ 17న బిశ్వ శర్మ హెలికాప్టర్‌ను ఉపయోగించారు.ఆ మరునాడే ఓ స్మారక సమావేశానికి హాజరయ్యేం దుకు మరోసారి హెలికాప్టర్‌ను వాడారు. ఆ మరునాడు యూపీపీఎల్‌కు మరో అభ్యర్థి తరఫున ప్రచారం చేసేందుకు హెలికాప్టర్‌లో వెళ్లారు. 2021 అక్టోబర్ 30న అసోంలోని కొన్ని శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఆయా స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు ముఖ్యమంత్రి హెలికాప్టర్లలోనే విహరించారు.చివరికి ఓ అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని దాఖలు చేస్తుంటే ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కూడా ప్రభుత్వ ఖర్చుతో ఆకాశ యానం చేశారు.

ఇతర రాష్ట్రాలకు కూడా...

రాష్ట్రంలోనే కాదు...ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేసేందుకు కూడా బిశ్వ శర్మ ప్రభుత్వ సొమ్మును వెచ్చించి హెలికాప్టర్‌ను అద్దెకు తీసుకున్నారు. త్రిపురలో పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ముఖ్యమంత్రి మాణిక్ సాహా నామినేషన్ దాఖలు చేస్తుంటే అక్కడికీ హాజరయ్యారు. అంతేకాదు...కర్నాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు ప్రభుత్వ సొమ్ముతో హెలికాప్టర్లు, ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకున్నారు. నాగాలండ్‌లో ప్రచారానికి వెళ్లినప్పుడూ ఇదే తంతు.

వివాహాలకూ ఖజానా ఖర్చే

ఐదు వివాహ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు కూడా బిశ్వ శర్మ సర్కారీ సొమ్ముతో హెలికాప్టర్లు అద్దెకు తీసుకొని వెళ్లడం గమనార్హం. 2022 నవంబర్ 11న నాగాలాండ్ ముఖ్యమంత్రి కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు హెలికాప్టర్ ప్రయాణానికి అయిన ఖర్చు 14 లక్షల రూపాయలు. గత సంవత్సరం జనవరి 31న యూపీ ఉప ముఖ్యమంత్రి కుమార్తె వివాహానికి వెళ్లినందుకు అయిన ఖర్చు రూ.23.43 లక్షలు. వీటితో పాటు మరో మూడు వివాహాలకు కూడా ఆయన ప్రభుత్వ సొమ్మునే వినియోగించి హెలికాప్టర్‌లో ప్రయాణించారు. 2021 సెప్టెంబర్ 22 నుండి 2023 జనవరి 24 వరకూ ఆయన ఏడుసార్లు ఛార్టర్డ్ విమానాలు అద్దెకు తీసుకొని బీజేపీ కార్యక్రమాలకు హాజరయ్యారు.

అసలే అప్పుల ఊబిలో కూరుకుపోయిన అసోంపై ముఖ్యమంత్రి బిశ్వ శర్మ విహార ఖర్చులు పెను భారాన్ని మోపుతున్నాయి. తరుణ్ గొగోయ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకూ రాష్ట్ర రుణ భారం రూ.41,963 కోట్లు. గత ఎనిమిది సంవత్సరాల బీజేపీ పాలనలో అది ఇబ్బడిముబ్బడిగా పెరిగి 2022-23 నాటికి అది రూ.1,26,281.4 కోట్లకు చేరింది.

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలు

- ఆరు నెలలు ఆగితే 30 శాతం రాబడి అంటూ గాలం
- ఇతర దేశాలకు బ్యాంక్ ఖాతాల వివరాలు
- ఐదుగురు సైబర్ నేరస్థుల అరెస్ట్
- రూ.8లక్షలు, 12 సెల్‌ఫోన్లు, ల్యాప్ టాప్ సీజ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక రాబడిని పొందొచ్చని ట్రేడింగ్ పేరుతో మోసాలకు పాల్పడున్న ఐదుగురు సైబర్ నేరస్థులను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 12సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, రూ.8లక్షలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం బషీర్‌బాగ్‌లోని పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీపీ డి.కవితతో కలిసి జాయింట్ సీపీ ఏ.వి.రంగనాథ్ మీడియాకు వివరాలు తెలిపారు. అహ్మదాబాద్‌కు చెందిన స్వయం తిమానియా, మీట్ తిమానియా, బ్రిజేష్‌పటేల్, హర్షపాండ్యా, శంకర్‌లాలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని సైబర్ నేరాలను ఎంచుకున్నారు. 'యూనిటీ స్టాక్' కంపెనీ పేరిట(నకిలీ) వెబ్‌సైట్ నిర్వహించారు. తాము చెప్పిన విధంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో అధిక లాభాలొస్తాయని దేశవ్యాప్తంగా అమాయకులను టార్గెట్ చేస్తున్నారు. అంతటితో ఆగకుండా యూనిటీ ఎక్స్చేంజ్, టీ-20 వంటి గేమింగ్ వెబ్‌సైట్‌లలో సైతం డిపాజిట్ చేయాలని గాలం వేస్తున్నారు.

ఆరు నెలలు ఆగితే పెట్టిన పెట్టుబడికి 30 శాతం అధిక లాభాలొస్తాయని నమ్మిస్తున్నారు. స్కీంలో కొత్త వారిని చేర్పిస్తే అదనంగా కమీషన్లు ఇస్తామని ఆశ చూపిస్తున్నారు. ఇదే తరహాలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని గతేడాది నవంబర్‌లో టార్గెట్ చేసిన నిందితులు స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే 100శాతం లాభాలను చూపిస్తామని నమ్మించారు. వారి మాటలను నమ్మిన బాధితుడు రూ.3,16,34,764ను వారు చెప్పిన వివిధ బ్యాంక్ ఖాతాలలో జమ చేశాడు. తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ప్రత్యేక దృష్టి సారించారు. నిందితులు దుబాయ్, హాంకాంగ్‌తోపాటు ఇతర దేశాల్లో ఉన్న సైబర్ మోసగాళ్లకు బ్యాంక్ అకౌంట్లు సప్లయ్ చేస్తున్నారని గుర్తించారు. రోనక్ తన్నా అనే నిందితుడు వందలాది బ్యాంక్ ఖాతాలను సరఫరా చేసినట్టు తేలింది. మోసపూరితంగా సంపాదిస్తున్న డబ్బులను అలాంటి ఖాతాల్లో డిపాజిట్ చేయిస్తున్న నిందితులు తిరిగి ఆ డబ్బులను హవాలా రూపంలో భారతీయ ఖాతాల్లోకి మళ్లిస్తున్నట్టు గుర్తించారు.

టెలీగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో పరిచయాలు చేసుకోవద్దని జాయింట్ సీపీ సూచించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులను ఆఫర్ చేస్తే స్పందించొద్దన్నారు. ఆన్‌లైన్ గేమింగ్ మోసపూరితమన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో ఆర్థిక లావాదేవీల విషయాన్ని షేర్ చేసుకోవద్దన్నారు. ఈ సమావేశంలో ఏసీపీ శివ మారుతితోపాటు టీమ్‌మెంబర్స్ సీహెచ్ ఉనిల్ కుమార్, ఎం.జి.సుదర్శన్, బి.నరేష్, పి.అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు మందుల అమ్మకం

- అర్హత లేకుండా ఔషధాల నిల్వ
- నకిలీ మందులతో చెలగాటం
- స్వాధీనం చేసుకున్న డీసీఏ అధికారులు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి అధికారులు రాష్ట్రవ్యాప్తంగా దాడులను కొనసాగిస్తున్నారు. తాజా దాడుల్లో ఖమ్మం జిల్లాలో నిర్దేశించిన ధర కన్నా ఎక్కువ ధరకు ఇట్రాలిక్స్ 100 క్యాప్సుల్స్ అమ్ముతున్నట్టు గుర్తించి ఖమ్మంలో వాటిని సీజ్ చేశారు. జాతీయ ఫార్మాస్యూటికల్ ప్రైజింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఒక్క క్యాప్సుల్ ధరను రూ.16.67గా నిర్ణయించి, జీఎస్టీతో కలిపి రూ.18.67కి మించవద్దని నిర్దేశించింది. దాని కన్నా ఎక్కువగా ఒక్కో క్యాప్సుల్ రూ.17.57 ఎక్కువగా రూ.36.24కు అమ్ముతున్నారు. దీంతో డ్రగ్ ఇన్ స్పెక్టర్లు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అత్యవసర మందుల ధరలను పెంచి అమ్మడం డ్రగ్స్ (ప్రైసెస్ కంట్రోల్) ఆర్డర్, 2013ని ఉల్లంఘన కిందికి రావడంతో ఆ మేరకు చట్టపరమైన చర్యలు చేపట్టారు.

జనగామ జిల్లా, రఘునాథపల్లి మండలం ఫతేషాపూర్ గ్రామంలో రూరల్ మెడికల్ ప్రాక్టీషనలర్‌గా చెప్పుకుంటున్న కందగట్ల వెంకటేశ్వర్లు క్లినిక్‌పై దాడి చేశారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా అమ్మేందుకు 62 రకాల మందులను నిల్వ ఉంచినట్టు గుర్తించి వాటిని సీజ్ చేశారు. ఎలాంటి డ్రగ్ లైసెన్స్ లేకుండా అమ్మేందుకు, నిల్వ ఉంచేందుకు ఔషధాలను వినియోగించే వారికి ఐదేండ్ల జైలు శిక్ష ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని మహిత మెడికల్స్‌పై దాడి చేసిన నిషేధిత పైల్ ట్రీట్ క్రీమ్‌ను అమ్ముతున్నట్టు గుర్తించి చర్యలు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో 9 నుంచి జాతీయ పుస్తక ప్రదర్శన

- 36వ జాతీయ పుస్తక ప్రాంగణానికి గద్దర్ పేరు
- బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం (తెలంగాణ కళాభారతి)లో ఈ నెల 9 నుంచి 19 వరకు జరగనున్న జాతీయ పుస్తక పుస్తక ప్రదర్శనను విజయవంతం చేయాలని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచాన్ని మార్చగల శక్తి పుస్తకానికుందన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ దశాబ్ద కాలంగా ముందుకు సాగుతోందన్నారు. జ్ఞానతెలంగాణ నిర్మాణానికి పుస్తక ప్రదర్శనలు ఒక మెట్టుగా ఉపయోగపడాలన్న ధ్యేయంతో ముందుకు సాగటం వల్ల పుస్తక ప్రదర్శనలు భారీగా విజయవంతం అవుతూ వస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పదేండ్లుగా హైదరాబాద్ పుస్తక ప్రదర్శన టీమ్ వర్కుగా ముందుకు సాగటం వల్ల ఇది జాతీయ పుస్తక ప్రదర్శనగా రూపుదాల్చిందని చెప్పారు. తమ టీమ్‌కు గత రాష్ట్ర ప్రభుత్వమే కాకుండా ఇప్పటి ప్రభుత్వం కూడా సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు.

రాజకీయాలతో సంబంధం లేకుండా ఈ పుస్తక ప్రదర్శనలకు ప్రభుత్వం దగ్గర్నుంచి అన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు, ప్రజాసంఘాలు, ప్రజలు అండదండగా నిలిచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పుస్తక ప్రదర్శనలకు అండగా నిలిచి ఎన్టీఆర్ స్టేడియం కళాభారతి స్థలాన్ని 20 రోజులు ఉచితంగా ఇవ్వటం పెద్ద ప్రోత్సాహంగా ఉందన్నారు. దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాల సంపాదకులు, యాజమాన్యాలు, జర్నలిస్టులు సంపూర్ణ మద్దతు తెలిపి అండగా నిలిచారని వారికి ధన్యవాదాలు తెలియజేశారు. 36వ జాతీయ పుస్తక ప్రాంగణానికి "గద్దర్ ప్రాంగణం"గా పేరు పెట్టామని, పుస్తక ప్రదర్శన వేదికకు "రవ్వా శ్రీహరి" వేదికగా నామకరణం చేశామని తెలిపారు. అలాగే పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో తెలంగాణ అమర వీరుల స్థూపాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కవులు, రచయితలను వెలుగులోకి తెచ్చే పనిని బుక్ ఫెయిర్ చేపట్టిందని, విస్మృత కవుల పేరు మీద వేదికలు, ప్రాంగణాలు పెడుతూ వస్తున్నామన్నారు. ఊరూరికి పుస్తకాన్ని తీసుకుపోయే పని చేపట్టామని, రొట్టమాకు రేవు నుంచి చిన్న పట్టణాలు వనపర్తి, కోదాడ, కామారెడ్డిలాంటి పట్టణాలకు విస్తరింపజేశామని తెలిపారు. పిల్లలకు, ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, కోయ చంద్రమోహన్, కోశాధికారి పి.రాజేశ్వరరావు, సహాయ కార్యదర్శి శోభన్‌బాబు, కార్యవర్గ సభ్యులు కవి యాకూబ్, జనార్థన్ గుప్తా, బాల్‌రెడ్డి, శ్రీకాంత్, మాటూరి సూర్యనారాయణ, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హర్ష్ మందర్‌పై వేధింపులు ఆపండి

- విచారణలు నిలిపివేయండి
- ప్రముఖుల డిమాండ్

న్యూఢిల్లీ : మానవ హక్కుల కార్యకర్త హర్ష్ మందర్‌పై వేధింపులు ఆపాలని, సీబీఐ ఎఫ్ఐఆర్ సహా ఆయన పైన, ఆయన సహచరుల పైన చేస్తున్న విచారణలను నిలిపివేయాలని వివిధ రంగాలకు చెందిన 250 మంది ప్రముఖులు డిమాండ్ చేశారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించారన్న ఆరోపణపై హర్ష్ మందర్, ఆయన నడుపుతున్న పరిశోధన, న్యాయవాద సంస్థ కేంద్రం పైన సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో వారంతా సంయుక్త పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీనిపై పీయూసీఎల్ అధ్యక్షులు కవితా శ్రీవాత్సవ, ఆర్థికవేత్త జీన్ డ్రెజ్, రచయిత, కాలమిస్ట్ అపూర్వానంద్, భారతీయ మహిళా జాతీయ సమాఖ్య అధ్యక్షురాలు అరుణా రాయ్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ సహ వ్యవస్థాపకుడు నిఖిల్ దే తదితరులు సంతకాలు చేశారు. డాక్టర్ హర్ష్ మందర్‌ను నిరంతరం వేధింపులకు గురిచేయడాన్ని, భయపెట్టడాన్ని వారంతా ముక్తకంఠంతో నిరసించారు.

2020 నుండి ఎన్సీపీసీఆర్, ఢిల్లీ పోలీసులకు చెందిన ఆర్థిక నేరాల విభాగం, ఐటీ, ఈడీ...ఇప్పుడు సీబీఐ హర్ష్ మందర్‌ను వెంటాడి వేధిస్తున్నాయని వారు తెలిపారు. అయితే ఎన్నో కేసులు పెట్టినప్పటికీ ఒక్క దానిలోనూ న్యాయస్థానంలో ఛార్జిషీటు దాఖలు చేయలేదని వివరించారు. మందర్, ఆయన కేంద్రంపై జరుగుతున్న దాడిని దేశంలోని పౌర సమాజంపై సాగిస్తున్న దాడిగా చూడాలని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కృషి చేసే వారందరి పైన ఇలాంటి దాడులకే తెగబడుతున్నారని విమర్శించారు. మందర్, సహచరులు, ఆయన కేంద్రంపై జరుపుతున్న విచారణలన్నింటినీ నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

దొడ్డిదారిన ఉపాధ్యాయ బదిలీలు

- బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్
- పైరవీ బదిలీలు షురూ...
- యాదాద్రి నుంచి మేడ్చల్‌కు డిప్యూటేషన్
- ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజాపాలనలోనూ పైరవీ బదిలీలు షురూ అయ్యాయి. బీఆర్ఎస్ దారిలోనే కొత్త ప్రభుత్వం పాలన సాగిస్తున్నది. దొడ్డిదారిన ఉపాధ్యాయ బదిలీలను చేపడుతున్నది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామం జెడ్పీహెచ్ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్న కొండాపురం మాతమ్మకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగోల్ జెడ్పీహెచ్ఎస్‌కు ఏడాదికాలం పాటు ఓడీ కల్పిస్తూ డిప్యూటేషన్ ఇచ్చింది. ఈ మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో కె నారాయణరెడ్డి శుక్రవారమే ఉత్తర్వులు జారీ చేశారు.

ఆమె తీన్మార్ మల్లన్న సతీమణి కావడం విశేషం. వారి పాప తీవ్ర అనారోగ్యం (పక్షవాతం)తో ఉన్నట్టు సమాచారం. అందుకే డిప్యూటేషన్ ఇచ్చినట్టు ప్రభుత్వం చెప్తున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో బదిలీలపై నిషేధం ఉన్నది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దొడ్డిదారిన బదిలీలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. పైరవీలకే పెద్దపీట వేయడం పట్ల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. 'ఇదేనా ప్రజాపాలన'అంటూ ఓ ఉపాధ్యాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ ద్వారా మార్పు వస్తుందనుకున్న ఉపాధ్యాయులకు ఈ నిర్ణయం నిరాశను మిగిల్చింది. ప్రభుత్వమే పారదర్శకతకు పాతర వేయడాన్ని ఉపాధ్యాయులు తప్పుపడుతున్నారు.

317 జీవో బాధితుల ఆవేదన

రాష్ట్రంలో 317 బాధిత ఉపాధ్యాయులు ఇంకా ఆవేదనతోనే ఉన్నారు. స్థానికతను పరిగణనలోకి తీసుకోకుండా సీనియార్టీ ప్రాతిపదికన 2021, డిసెంబర్ ఆరో తేదీన 317 జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో 22,418 మంది ఉపాధ్యాయులు, 13,760 మంది ఉద్యోగులు కలిపి 36,178 మంది ఇతర జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్లకు బదిలీ అయ్యారు.

వారి సొంత జిల్లా స్థానికతను వదిలి వేరే జిల్లాలకు స్థానికేతరులుగా కేటాయించారు. దీంతో వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు మానసికంగా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానికత ఆధారంగా సొంత జిల్లాకు బదిలీ చేయాలంటూ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని పట్టించుకోలేదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వారి సమస్యను పరిష్కరిస్తుందని ఎంతో ఆశతో ఉన్నారు. మరోవైపు భార్యాభర్తలు ఒకే జిల్లాలో ఉండాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సందర్భాల్లో ప్రకటించారు. అందులో భాగంగా 19 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. కానీ 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలపై నిషేధం విధించింది. ఆయా జిల్లాల్లోని ఉపాధ్యాయులు కూడా స్పౌజ్ బదిలీలు చేపట్టాలంటూ పలుమార్లు ఆందోళనలు చేపట్టారు. మంత్రులు, అధికారులకు వినతిపత్రాలను సమర్పించారు.

చలో హైదరాబాద్, చలో ప్రగతి భవన్ కార్యక్రమాలు చేపట్టి నిరసన తెలిపారు. అయినా ప్రయోజనం కలగలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గతేడాది జనవరిలో 615 మంది స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. మిగిలిన 1,500 మంది ఎస్జీటీ, భాషా పండితులు, పీఈటీల స్పౌజ్ బదిలీలను పెండింగ్‌లో ఉంచింది. వాటిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి స్పౌజ్ బదిలీలు చేపట్టాలని కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం పైరవీ బదిలీలకు తెరలేపడం సరైంది కాదని పలు ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. రాజకీయ పలుకుబడితో జరుగుతున్న ఆ బదిలీలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

శివసేన నేతపై కాల్పులు...

బీజేపీ ఎమ్మెల్యే అరెస్ట్

- పోలీస్ స్టేషన్‌లోనే ఘటన

ముంబయి : మహారాష్ట్రలో శివసేన (షిండే) నేత మహేష్ గైక్వాడ్‌పై బీజేపీ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ శుక్రవారం రాత్రి కాల్పులు జరిపారు. పోలీస్ స్టేషన్‌లోనే ఈ ఘటన జరగడం విశేషం. కల్యాణ్ ఈస్ట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గణపత్ శివసేనకు చెందిన కల్యాణ్ నగర అధ్యక్షుడు మహేష్‌పై ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి గణపత్‌తో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉల్హాస్‌నగర్‌లోని హిల్‌లేన్ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ ఇన్స్‌పెక్టర్ క్యాబిన్‌లో మహేష్, మరో వ్యక్తిపై గణపత్, ఆయన అనుచరుడు కాల్పులు జరిపారని డీఎస్పీ సుధాకర్ పథారే తెలిపారు.

గణపత్‌కు సహాయకులుగా వచ్చిన మరో ముగ్గురిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్టుకు ముందు గణపత్ ఓ మరాఠీ ఛానల్‌తో మాట్లాడుతూ తన కుమారుడిని పోలీస్ స్టేషన్‌లో కొడుతుంటే మహేష్‌పై కాల్పులు జరిపానని, అయితే ఇందుకు తానేమీ విచారించడం లేదని చెప్పారు. 'అవును. నేను కాల్పులు జరిపాను. ఇందుకు విచారించడం లేదు. పోలీస్ స్టేషన్‌లో పోలీసుల ముందే నా కుమారుడిని కొడుతుంటే నేనేం చేయాలి?' అని ప్రశ్నించారు. ఐదు రౌండ్ల కాల్పులు జరిపానని కూడా ఆయన అన్నారు. అయితే ఈ ఘటన వెనుక ఆత్మరక్షణ లేదా కవ్వింపు అనేవే లేవని పోలీస్ అధికారులు తెలిపారు. మొత్తం పది బులెట్లు కాల్చారని, వాటిలో ఆరింటిని మహేష్ శరీరం నుండి తొలగించారని చెప్పారు. ఈ ఘటనపై శివసేన (ఠాక్రే) తీవ్రంగా స్పందించింది. రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని ఆరోపించింది.

'పోలీస్ స్టేషన్‌లోనే కాల్పులు జరిగాయి. మా పార్టీ నేతపై బీజేపీ ఎమ్మెల్యే కాల్పులు జరిపారు. మహారాష్ట్ర ఓ ఆటవిక రాజ్యంగా ఎలా మారిందో ఊహించండి. ప్రజలకు మేలు చేయాల్సిన ఎమ్మెల్యే కాల్పులకు తెగబడడం దురదృష్టకరం. మన రాష్ట్రం ఏ దిశగా సాగుతోంది?' అని శివసేన (ఠాక్రే) ప్రతినిధి ఆనంద్ దూబే ప్రశ్నించారు.

మొటిమలు పోగొట్టుకోవాలంటే...

అందమైన మెరిసే చర్మం కావాలని అందరూ కోరుకుంటారు. అయితే వయసు, కాలాన్ని బట్టి చర్మంపై అప్పుడప్పుడు మొటిమలు వస్తుంటాయి. ఇవి చర్మ సౌందర్యాన్ని పాడు చేస్తాయి. వీటిని సులువుగా పోగొట్టాలంటే కొన్ని ఇంటి చిట్కాలు ఉన్నాయి. అవేంటంటే....

కలబంద : దీనిని అలోవెరా అని కూడా అంటాం. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఇందులో ఎక్కువ. ఇది మొటిమల వల్ల వచ్చే ఎరుపు, వాపును తీసేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. తాజా కలబంద జెల్‌ను నేరుగా ముఖంపై అప్లై చేసి, 15-20 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. దీనిని వారంలో ఒకటి లేదా రెండు సార్లు అప్లై చేసి చూస్తే తేడా గమనించవచ్చు.

పసుపు : ఇంటి, వంట అవసరాలలో ఉపయోగించే పసుపు చర్మ సంరక్షణలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులోని కర్క్యుమిన్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ గుణాలను కలిగి ఉంటుంది. పసుపును నీరు లేదా తేనెతో కలిపి పేస్ట్‌లా చేసి ముఖంపై 15-20 నిమిషాల పాటు అప్లై చేస్తూ ఉండాలి. ఆ తర్వాత కొద్దిసేపు అలాగే వదిలేసి, ఆరిన తర్వాత మెల్లగా మసాజ్ చేసినట్టు తడిచేసి రుద్దుతూ కడిగేయాలి. ఇలా చేస్తే ముఖంపై ఉండే మచ్చలు వంటివి, మృత కణాలు కూడా తొలగిపోతాయి.

టీ ట్రీ ఆయిల్ : కొన్నేళ్లుగా చర్మ సంరక్షణలో టీ ట్రీ ఆయిల్ ప్రధానపాత్ర పోషిస్తోంది. ఈ ఎసెన్షియల్ ఆయిల్‌లో ఉండే యాంటీ మైక్రోబయల్ లక్షణాలు మొటిమలను కలిగించే బ్యాక్టీరియాతో సమర్థవంతంగా పోరాడగలవని అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ఈ ఆయిల్‌ను డైరెక్ట్‌గా చర్మంపై అప్లై చేయకూడదు. దీని గాఢతను తగ్గించిన తర్వాతనే ఉపయోగించాలి. అంతేకాదు, ఇది ఉపయోగించేపుడు చేతులతో కాకుండా కాటన్ బాల్స్ ఉపయోగించడం మంచిది. రాత్రి పడుకునే ముందు ఈ ఆయిల్ మొటిమలు ఉన్న ప్రాంతంలో అప్లై చేయాలి. ఉదయానికి తేడా తెలుస్తుంది.

తేనె : తేనె సహజ మాయిశ్చరైజింగ్, యాంటీ బాక్టీరియల్ ఏజెంట్. మొటిమలు ఉన్న ప్రాంతంలో తేనెను రాసి, 15-20 నిమిషాలు అలాగే ఉంచి, గోరువెచ్చని నీటితో మీ ముఖాన్ని కడగాలి. ఇది మొటిమలను కలిగించే బ్యాక్టీరియాతో పోరాడడంతో పాటు చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. తేనెను నేరుగా కాకుండా ఏదైనా చర్మ సంరక్షణ సాధనంతో కలిపి ముఖంపై అప్లై చేసుకోవాలి.

వీటిని ఉపయోగించడం వల్ల చర్మం మెరవడంతోపాటు ఆరోగ్యంగా ఉంటుంది. మొటిమలను నివారించవచ్చు.



ఒక బృందావనం సోయగం..., మిన్నేటి సూరీడు వచ్చేనమ్మ... అంటూ వాణి జయరాం తన పాటలతో శ్రోతల మనసుల్లో శాశ్వతంగా ఉండిపోయారు. సంగీత కుటుంబంలో పుట్టి, వివాహానంతరం భర్త ప్రోత్సహంతో గాయనిగా ప్రస్థానం ప్రారంభించారు ఆమె. ఇరవై వేలకు పైగా అనేక భాషల్లో పాటలు పాడి 'సంగీత్ పీఠ్ సమ్మాన్' పురస్కారాన్ని అందుకున్న అతి పిన్న వయస్కురాలిగా చరిత్రలో నిలిచి పోయిన ఆమె వర్ధంతి నేడు.







సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర

తల్లి తండ్రులు పెట్టిన పేరు కలై వాణి. 30 నవంబరు 1945లో వెల్లూరులో జన్మించారు. తల్లి తండ్రులు దురైస్వామి అయ్యంగార్, పద్మావతి. వీరికి ఆరుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. వాణి జయరాం వీరికి ఐదవ సంతానం. శాస్త్రీయ సంగీత విద్వాంసుల కుటుంబం వీరిది. చిన్నప్పటి నుంచి వాణి రేడియోకి అతుక్కుపోయి హిందీ పాటలు వింటూ ఉండేవారు. ఆమె ఆసక్తిని గుర్తించి సంగీతంలో శిక్షణ ఇప్పించేందుకు రంగ రామానుజ అయ్యంగార్ వద్ద చేర్పించారు. అక్కడ అతను ముత్తుస్వామి దీక్షితార్ కృతులు నేర్పించారు. తర్వాత ఆమె కడలూర్ శ్రీనివాస్ అయ్యంగార్, టి.ఆర్.బాలసుబ్రహ్మణ్యన్, ఆర్.యెస్ మణి వద్ద మెరుగైన సంగీత శిక్షణ తీసుకున్నారు. సంగీతం నేర్చుకుంటూనే చదువు కొనసాగించారు. చెన్నైలోని క్వీన్ మేరీ కళాశాల నుండి పట్టభద్రురాలు అయ్యారు. చదువు పూర్తి కాగానే చెన్నై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం రావడంతో చేరిపోయారు.

బ్యాంక్ ఉద్యోగం వదిలేసి...

1969లో జయరాంతో వివాహం తర్వాత ముంబయికి వచ్చేశారు. వాణి గాన నైపుణ్యాన్ని తెలుసుకున్న జయరాం, ఆమె అభిష్టాన్నీ గ్రహించి హిందూస్థాని సంగీతంలో శిక్షణ పొందేందుకు ఉస్తాద్ అబ్దుల్ రెహ్మాన్ దగ్గర చేర్పించారు. అతని దగ్గర కఠోర శిక్షణతో బ్యాంక్ ఉద్యోగానికి స్వస్తి పలకాల్సి వచ్చింది. అనంతరం సంగీతాన్నే తన వృత్తిగా మలచుకున్నారు. ఖాన్ శిక్షణలో భజన, గజల్, తు మి రీ వంటి వివిధ స్వర రూపాలలో నైపుణ్యాన్ని సంపాదించారు.

మరాఠీ ఆల్బత్...

వాణి 1969లో తన మొదటి బహిరంగ కచేరి ఇచ్చారు. అదే ఏడాదిలో వసంతదేశాయ్‌కి పరిచయమయ్యారు. ఈమె స్వరానికి ముగ్ధుడైన దేశాయ్ తన ఆల్బమ్‌లో పాటకు వాణిని ఎంచుకున్నారు. ఈ ఆల్బమ్ మరాఠీ ప్రేక్షకులలో ఎంతో ప్రజాదరణ పొందింది. దాంతో బాలీవుడ్‌లో ఆమె ప్రజాదరణ రోజు రోజుకు పెరగసాగింది. ఇటు దక్షిణ భారత దేశం నుండి కూడా అవకాశాలు రాసాగాయి. 1973లో మొదటి తమిళ పాటను రికార్డ్ చేశారు. అయితే కొన్ని ప్రత్యేక కారణాల వల్ల ఆ చిత్రం ఇప్పటివరకు విడుదల కాలేదు. ఆమె పాడిన వాటిలో మొదట విడుదల అయిన పాట 1973 లో టి.ఎం. సౌందర్ రాజన్‌తో కలిసి పాడిన యుగళ గీతం 'ఓరు ఇదం ఉన్ని దం'. ఇది విడుదలైన కొన్ని రోజులకే బాలచందర్ ఎం.ఎస్ విశ్వనాథన్ తమ చిత్రంలో సోలో పాటకు ఆమెను నియమించుకున్నారు.

వెల్లువలా పురస్కారాలు

'అపూర్వ రాగాంగల్' చిత్రంలో ఆమె పాడిన పాటలకు ఉత్తమ నేపథ్యగాయనిగా మొదటి జాతీయ చలనచిత్ర అవార్డును అందుకున్నారు. అప్పటి నుండి ఆమె వెనుతిరిగి చూసుకోలేదు. పురస్కారాలు వెల్లువలా వచ్చి పడసాగాయి. తమిళనాడు రాష్ట్రం ఉత్తమ మహిళా నేపథ్య గాయనిగా గుర్తించి పురస్కారాన్ని అందించింది. ఇక తెలుగులో కూడా ఆమెకు అవకాశాలు రాసాగాయి. తెలుగులో తొలిసారిగా 'అభిమానవంతులు' చిత్రంలో పాడారు. 1975లో వచ్చిన 'పూజ' చిత్రంలోని పాటలు ఆమెను తెలుగు చిత్ర సీమలో సుస్థిర స్థానాన్ని ఏర్పర్చాయి. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'శంకరాభరణం' చిత్రంలో ఐదు పాటలు పాడి విశేష ప్రజాదరణ పొంది రెండవ జాతీయ చలన చిత్ర పురస్కారాన్ని అందుకున్నారు. ఆ చిత్రంలోని పాటలకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉత్తమ నేపథ్య గాయనిగా నంది పురస్కారాన్ని అందుకున్నారు.

కవితలంటే ఎంతో ఇష్టం

మలయాళ, కన్నడ భాషాలలోనే కాక దాదాపు 16 భాషల్లో పాడి ప్రజాదరణ పొందారు. ఇన్ని పాటలు పాడిన వాణి జయరాం సంగీత ప్రపంచంలో ఎన్నో ఓడిదుకులను ఎదుర్కొన్నారు. గుర్తింపు తెచుకుంటున్నారు, ఎదుగుతున్నారు అనుకున్న సమయంలో అనేక కారణాల వల్ల పాటలన్నీ ఆగిపోయాయి. అయిన ఆమె నిరాశ పడలేదు. పాటల ప్రపంచంలో తన ప్రస్థానాన్ని అలా కొనసాగించారు. ఆమెకు పాడటమే కాదు కవితలు రాయడం అన్నా ఏంతో ఇష్టం. హిందీలో అనేక కవితలు రాసారు.

పురస్కారం స్వీకరించకుండానే...

రోజుకు 48 గంటలు ఉన్నా తనకు సరిపోవని ఎన్నో సందర్భాల్లో అంటుండేవారు. సమయాన్ని అంతగా సద్వినియోగం చేసుకునే వ్యక్తి ఆమె. 74వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఆమెకు 'పద్మభూషణ్' ప్రకటించింది. ఈ పురస్కారాన్ని స్వీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం పిలుపు కోసం ఎదురుచూస్తున్న సమయంలో దాన్ని స్వీకరించకుండానే ఆవిడ మరణించడం విషాదకరం. ఏది ఏమైనా ప్రజల మనసుల్లో తన గానంతో చెరగని ముద్ర వేసిన వాణి జయరాం తొలి వర్ధంతి నేడు. ఈ సందర్భంగా ఆమెను స్మరించుకుంటూ...

- పాలపర్తి సంధ్యా రాణి

ఎల్‌కె అద్వానీకి భారతరత్న

(మొదటిపేజీ తరువాయి)

ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ స్థాపించిన భారతీయ జనసంఘ్‌లో 1951లో చేరారు. 1967లో ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. 1970లో రాజ్యసభ సభ్యుడయ్యారు. 1989 వరకూ ఆయన నాలుగుసార్లు రాజ్యసభకు ఎన్నికవుతూ వచ్చారు. జనసంఘ్ 1977 ఎన్నికలకు ముందు జన సంఘ్ జనతాపార్టీలో విలీనమైంది. 1977 సాధారణ ఎన్నికల్లో జనతా పార్టీ గెలవడంతో అద్వానీ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1980లో భారతీయ జనతా పార్టీని స్థాపించిన నలుగురిలో అద్వానీ ఒకరు. పార్టీకి ఆయన మూడుసార్లు అధ్యక్షుడిగా పనిచేశారు. అద్వానీ మొదటిసారిగా 1989లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఏడుసార్లు లోక్ సభకు ప్రాతినిథ్యం వహించారు. 1998నుంచి 2004వరకూ ఆయన సుదీర్ఘకాలం హోంమంత్రిగా పనిచేశారు. లోక్‌సభలోనూ చాలాకాలం ప్రతిపక్ష నేతగా కొనసాగారు. 2002నుంచి 2004వరకూ ఉపప్రధానిగా కొనసాగారు.

నిస్వార్థంగా పనిచేశాను : అద్వానీ

అద్వానీకి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అద్వానీ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా అద్వానీ మాట్లాడుతూ.. 'నేను 14 ఏండ్ల వయసులోనే ఆరెస్సెస్‌లో వలంటీర్‌గా చేరాను. అప్పటినుంచి నాకప్పగించిన ఏ పనైనా అంకిత భావంతో చేశాను. దేశం కోసం నిస్వార్థంగా పనిచేశాను' అన్నారు.

బడా కార్పొరేట్‌లకు రవాణా రంగాన్ని తాకట్టు పెట్టే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

యాక్టును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

భారతీయ న్యాయ సంహిత 2023లో లోపాలు ఏమిటి?

ఐపీసీకి బదులు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'భారతీయ న్యాయ సంహిత 2023' సెక్షన్ 106 (1), (2) ప్రకారం రోడ్డు ప్రమాదాలు జరిగి ఎవరైనా చనిపోతే ఆ ప్రమాదానికి కారకులైన డ్రైవర్లకు 5 ఏండ్ల జైలు శిక్ష విధించాలని పేర్కొన్నారు. అంతేకాదు, పోలీసు, మెజిస్ట్రేట్‌కు చెప్పకుండా పరారైతే 10 ఏండ్లు జైలు శిక్ష, జరిమానా విధించాలని నిర్దేశిస్తుంది. ఇది అమలు జరిగితే డ్రైవర్లందరూ జైళ్లలోనే ఉంటారు తప్ప వాహనాలను నడపరు. ఎంవీ యాక్ట్ సెక్షన్ 134 ప్రకారం ప్రమాదం జరిగి ఎవరైన చనిపోయిన సందర్భంలో ప్రజలు కొట్టే పరిస్థితి ఉత్పన్నమైతే డ్రైవర్ పరార్ కావడం తప్పు కాదని చెబుతుంది.

ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగం కార్మికుల పాత్ర ఏమిటి?

రవాణా రంగంలో ప్రయాణీకుల రవాణ, సరుకుల రవాణాను ప్రయివేటు కంపెనీలకు కట్టపెట్టడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నది. ఇందులో భాగంగానే 2019లో ఎంవీ యాక్ట్‌లో సవరణలు తెచ్చారు. రవాణా లేకపోతే ఆర్థిక వ్యవస్థ లేదు. రవాణా రంగంలో 90 శాతం అసంఘటిత రంగ కార్మికులున్నా సామాజిక సంక్షేమ చట్టం అమలు చేయడం లేదు. ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. 'భారతీయ న్యాయ సంహిత 2023'లో సెక్షన్ 106 (1), (2)లను రద్దు చేయాలి. ఎంవీ యాక్టు సవరణ చట్టం 2019ని వెనక్కి తీసుకోవాలనే ఈ మూడు డిమాండ్లతో ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగంలోని కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయనున్నారు. ఈ సమ్మెలో జాతీయస్థాయిలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, ఎల్‌పీఎఫ్, ఏఐసీసీటీయూ, టీయూసీఐ తదితర సంఘాలన్నీ పూర్తిస్థాయిలో పాల్గొంటున్నాయి.

వాడి వేడిగా ధరణి కమిటీ భేటి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయనీ, వీటిపై మరోసారి చర్చించాల్సిన అవసరం ఉందని కమిటీ సభ్యులు అభిప్రాయపడినట్టు తెలిసింది. కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్, సభ్యులు రేమండ్ పీటర్, వి.లచ్చిరెడ్డి, సునీల్, మధుసూదన్, సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

త్వరలో మధ్యంతర నివేదిక :కోదండరెడ్డి

ప్రభుత్వంలోని అన్ని విభాగాలతో భూసమస్యలపై చర్చలు జరుగుతున్నాయి. త్వరలో ముఖ్యమంత్రికి మధ్యంతర నివేదికను ఇవ్వనున్నట్టు కమిటీ సభ్యులు కోదండరెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ వైపు నేతల చూపు

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతున్న తరుణంలోనే జిల్లాలు, నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మెన్లపై అవిశ్వాస తీర్మానాలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల ప్రతిపాదించిన ఇలాంటి తీర్మానాల్లో కాంగ్రెస్ నెగ్గి, మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకుంది కూడా. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనైతే పరిస్థితి చెప్పలేకుండా ఉంది. ఇలా బీఆర్ఎస్ ఓడిపోయి, అలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో లేదో... పోలోమంటూ సర్పంచులు, వార్డు మెంబర్లు మూడు రంగుల కండువాలను కప్పుకుంటున్నారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రసన్నం చేసుకోవటం కోసం వారు పడరానిపాట్లు పడుతున్న పరిస్థితి నెలకొంది.

ఇలాంటి పరిణామాల నేపథ్యంలో కార్యకర్తల్లో ధైర్యం నింపటం, నాయకులను కాపాడుకోవటంపై బీఆర్ఎస్ అగ్రనేతలు సీరియస్‌గా దృష్టి సారించారు. మొన్నటిదాకా పార్లమెంటు సన్నాహక సమావేశాల రూపంలో క్యాడర్‌లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు ప్రయత్నించిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు.. ఇప్పుడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు జరుపుతూ పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేస్తామంటూ భరోసానిస్తున్నారు. మరోవైపు అత్యధికంగా ఉన్న బీసీ జనాభాను తమ వైపునకు తిప్పుకునేందుకు వీలుగా కేసీఆర్ మార్గదర్శకత్వంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత... 'జ్యోతిబా పూలే' అంశాన్ని తెరపైకి తెచ్చారు. బీసీ సంఘాల నేతలతో ఆమె ప్రతీరోజూ సమావేశమవుతూ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. ఇదే సమయంలో తాను పూర్తి ఫిట్‌నెస్ సాధించానని చెప్పుకునేందుకు వీలుగా ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన కేసీఆర్... కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం చేశారు. ఈనెల్లో నిర్వహించబోయే అసెంబ్లీ సమావేశాల్లో తనదైన శైలిలో ప్రభుత్వంపై విరుచుకుపడటం ద్వారా బీఆర్ఎస్‌కు మళ్లీ జవసత్వాలు నింపేందుకు ఆయన వ్యూహ రచన చేస్తున్నారు. ఈ క్రమంలో అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల పరిస్థితి లోక్‌సభ ఎన్నికల నాటికి ఎలా ఉంటుందో వేచి చూడాలి.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పనులు పెండింగ్‌లో ఉంచొద్దని ఆదేశించారు. ఈ పనులన్నింటినీ మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేసేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు (సీడీఎఫ్), పార్లమెంట్ ప్రాంత నిధులు (సీబీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్డీఎఫ్) నిధులకు సంబంధించి జిల్లాలోని రహదారులు భవనాలు (ఆర్అండ్‌బీ), పంచాయతీరాజ్, అటవీశాఖ (డీఎఫ్ఓ), జిల్లా అభివృద్ధి నిధులు (డీడబ్ల్యూఓ), డీఆర్డీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పోలీస్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ పనులపై ఆరా తీశారు. ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఈనెల చివరి వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని పనులు పూర్తయ్యాయి..? ఇంకా ఎన్ని పనులు ఏ ఏ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి..? పూర్తిగా క్యాన్సిల్ అయిన పనులు ఎన్ని..? అనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీంతో జిల్లా అధికారులు అభివృద్ధి పనులను గడువులోపు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. 15 రోజుల తర్వాత పనుల పురోగతిపై మరోసారి సమావేశం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ చెప్పడంతో అధికారులు పనుల్లో నిమగ్నమయ్యారు.

ఈవీఎంల పరిశీలన..

పార్లమెంట్ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈసీఐఎల్ కంపెనీకి చెందిన అధికారులు మూడ్రోజుల కిందట మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ పరిధిలో భద్రంగా ఉంచిన ఈవీఎంలను పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ ఈవీఎంలనే వినియోగించడంతో ఈసీఐఎల్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కూకట్‌పల్లి, మేడ్చల్ ఈవీఎంల పనితీరుపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని, ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసిన కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల ఈవీఎంలను మినహాయించి మిగిలిన మూడు ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో వినియోగించిన ఈవీఎంలను పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి మరో 10 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. కోర్టులో కేసు ఉండటంతో కూకట్‌పల్లి, మేడ్చల్ నియోజకవర్గాలకు వినియోగించిన ఈవీఎంలనే ఇప్పుడు వినియోగిస్తారా..? కొత్తవి వినియోగిస్తారా..? అనే వివరాలు తెలియాల్సి ఉంది.

నోటిఫికేషన్లు ఏవీ?

- సర్కారుకు బండి సంజయ్ ప్రశ్న

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రూప్-1 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 1వ తేదీ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తట్లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ విమర్శించారు. శనివారంనాడిక్కడి పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్పీలు, డిప్యూటీ కలెక్టర్లు సహా 24 రకాల డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో కూడిన గ్రూప్-2 నోటిఫికేషన్లను ఏప్రిల్ 1న ఇస్తామన్నారని గుర్తుచేశారు. ఫిబ్రవరి 3వ తేదీ వచ్చినా గ్రూప్-1 నోటిఫికేషన్ పత్తాలేదనీ, నిరుద్యోగుల్ని అబద్ధాలతో నమ్మించి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోపై ఇప్పుడు ఆపార్టీ నేతలు ఎవరూ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. యాసంగి నుంచి ఎకరానికి రూ. 15వేలు రైతు బంధు ఇస్తామన్నారనీ, అదీ అమల్లోకి రాలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల్ని, ప్రజల్ని నట్టేటముంచితే, మీరేం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు. ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో విజయం కోసం బీజేపీ కార్యకర్తలు ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు ప్రతి గ్రామంలో 24 గంటలూ ప్రజలతో మమేకమై ఉంటారనీ, కొత్తగా ఓటర్లుగా నమోదైన వారితో నూతన ఓటర్ల సంపర్క్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థులు ఆత్మహత్య

నవతెలంగాణ-భువనగిరి రూరల్



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. భువనగిరి పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కోడి భవ్య, గాదె వైష్ణవి.. శనివారం రాత్రి ఒకే గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన తోటి విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది.. 108 అంబులెన్స్‌తో పాటు పోలీసులకూ సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. విద్యార్థుల మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థినుల ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు హాస్టల్‌లో ఆరా తీస్తున్నారు. పరీక్షల భయంతో చనిపోయారా లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అప్పటివరకు తమతో ఉన్న వారు ఉరేసుకొని చనిపోవడంతో తోటి విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లేహ్, కార్గిల్ జిల్లాల్లో బంద్

(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ సాగుతున్న ఆందోళనలకు ఈ రెండు గ్రూపులు నాయకత్వం వహిస్తున్నాయి. చట్టసభ లేకుండా 2019లో కేంద్రపాలిత ప్రాంతంగా మారిన లడఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడంతోపాటు గిరిజన హోదా కల్పించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని, స్థానికులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, లేహ్, కార్గిల్ జిల్లాలకు చెరొక పార్లమెంట్ సీటు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శనివారం లేఖ్, కార్గిల్ జిల్లాల్లో సంపూర్ణంగా బంద్ జరిగింది. వ్యాపార కార్యకలాపాలన్నీ స్తంభించాయి.

డిమాండ్లను అంగీకరించండి : నేతల పిలుపు

లేహలోని సెంగె నామ్‌గ్యాల్ స్క్వేర్ నుంచి డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర భారీ మార్చ్ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో నేతలు ప్రసంగిస్తూ, కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలన్న ప్రదర్శకుల నినాదాలు హోరెత్తాయి. మెగసెసె అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ ప్రసంగిస్తూ, లడఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో కలుపుతామని కేంద్ర మంత్రులు హామీలిచ్చారని, ఇంతవరకు అమలు చేయలేదని విమర్శించారు. 2019 పార్లమెంట్ ఎన్నికలు, 2020 లేహ్ హిల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎవరైనా దాని గురించి మాట్లాడితే వేధిస్తున్నారన్నారు. మైనింగ్ పరిశ్రమ ద్వారా లడక్‌ను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను సాధించేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. అత్యంత చలిగా వున్నా లెక్క చేయకుండా అన్ని వయసులు, గ్రూపులకు చెందిన వారు 'లేహ్ చలో' ప్రదర్శనలో పాల్గొన్నారు. 2019 తరువాత నిర్వహించిన అతి పెద్ద భారీ బహిరంగ సభగా స్థానికులు తెలిపారు.

కార్గిల్ సభలో మాజీ మంత్రి చెరింగ్ డోర్జయ్ మాట్లాడుతూ ప్రజల మనోభావాలను కేంద్రం గౌరవించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు సంపూర్ణ మద్దతు లభించిందని, భారీ ఎత్తున ప్రజలు సభకు తరలివచ్చారని, ఇప్పటికైనా కేంద్రం దిగి రావాలని అన్నారు. లడఖ్ బిజెపి చీఫ్ పదవికి 2020లో రాజీనామా చేసిన డోర్జయ్ కేంద్రం తీరును తీవ్రంగా నిరసించారు.

అద్వానీకి అభినందనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర మాజీ హోంమంత్రి, బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డును ప్రకటించడం పట్ల కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు జీ కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. అద్వానీకి అభినందనలు తెలుపుతూ శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పారదర్శకత, సమగ్రతతో విలువలను పాటిస్తూ దశాబ్దాల పాటు కొనసాగిన అద్వానీ ప్రజాజీవితం మార్గదర్శనీయమని కొనియాడారు. ఆయనతో కలిసి నడిచిన ప్రతి క్షణం ఓ కొత్త విషయాన్ని నేర్పుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా మహమ్మద్ అలీ షబ్బీర్

- పదవీ భాద్యతలు స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమానికి)గా మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం పదవీ భాద్యతలను స్వీకరించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో తన కార్యాలయంలో ప్రార్థనల అనంతరం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ కమీషన్ చైర్మెన్ కృష్ణ మోహన్ రావు, న్యూ ఢిల్లీలో ప్రభుత్వ సలహాదారు మల్లు రవి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఉమర్ జలీల్, గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి నవీన్ నికోలస్ శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మైనార్టీ మతాలకు చెందిన మతగురువులు షబ్బీర్ అలీని కలిసి అభినందనలు చెప్పారు.

విశాఖ టెస్టులో టీమ్ ఇండియా జోరు కొనసాగుతుంది. బ్యాట్‌తో యశస్వి జైస్వాల్ (209) డబుల్ సెంచరీతో కదం తొక్కగా.. బంతితో జస్‌ప్రీత్ బుమ్రా (6/45) ఆరు వికెట్ల ప్రదర్శనతో విజృంభించాడు. జైస్వాల్, బుమ్రా బూమ్ బూమ్ షోతో రెండో రోజు ఆటలో ఇంగ్లాండ్‌పై భారత్ పైచేయి సాధించింది. యశస్వి ద్వి శతకంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 396 పరుగుల భారీ స్కోరు సాధించింది. సహచర బ్యాటర్లలో ఎవరూ 34 పరుగుల మార్క్ దాటని వేళ జైస్వాల్ దంచికొట్టాడు. ఒంటిచేత్తో భారత్‌కు భారీ స్కోరు అందించాడు. జస్‌ప్రీత్ బుమ్రాకు తోడు చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/71) మ్యాజిక్ చేయటంతో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ కథ వేగంగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 253 పరుగులకే కుప్పకూలగా.. భారత్ 143 పరుగుల ఆధిక్యం దక్కించుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో 28/0తో కొనసాగుతున్న భారత్ ప్రస్తుతం 171 పరుగుల ముందంజలో నిలిచింది.



బుమ్రా, జైస్వాల్ బూమ్‌బూమ్



- యశస్వి ధనాధన్ డబుల్ సెంచరీ
- ఆరు వికెట్లతో చెలరేగిన బుమ్రా
- ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ 253/10

భారత్, ఇంగ్లాండ్ విశాఖ టెస్టు రెండో రోజు

భారత్ ప్రస్తుత ఆధిక్యం 171 పరుగులు

నవతెలంగాణ-విశాఖపట్నం

యశస్వి జైస్వాల్ (209, 290 బంతుల్లో 19 ఫోర్లు, 7 సిక్సులు) ద్వి శతకంతో దంచికొట్టాడు. కెరీర్ రెండో శతకాన్ని డబుల్ సెంచరీగా మలిచిన యశస్వి జైస్వాల్ ఈ ఘనత సాధించిన భారత బ్యాటర్లలో మూడో అతి పిన్న వయస్కుడిగా నిలిచాడు. ఇంగ్లాండ్ స్పిన్ దళాన్ని ఉతికారేసిన యశస్వి.. భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 396 పరుగుల భారీ స్కోరు అందించాడు. యశస్వి ద్వి శతకంతో చెలరేగగా.. భారత్ నుంచి మరో బ్యాటర్ కనీసం అర్థ సెంచరీ మార్క్ దాటలేదు. ఇక ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 253 పరుగులు చేసింది. ఓపెనర్ జాక్ క్రాలీ (76, 78 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సులు), కెప్టెన్ బెన్ స్టోక్స్ (47, 54 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా (6/45) ఆరు వికెట్లతో చెలరేగగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/71) మాయజాలం చేశాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 5 ఓవర్లలో 28/0తో కొనసాగుతుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (15 బ్యాటింగ్), రోహిత్ శర్మ (13 బ్యాటింగ్) అజేయంగా ఆడుతున్నారు.

యశస్వి డబుల్ సెంచరీ

భారత బ్యాటింగ్ లైనప్‌లో మరో బ్యాటర్ 34 పరుగుల మార్క్ దాటలేదు. సీనియర్ బ్యాటర్లు సైతం నిరాశపరిచారు. ఈ పరిస్థితుల్లో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (209) ద్వి శతకంతో చెలరేగాడు. షోయబ్ బషీర్ ఓవర్లో స్వీప్ షాట్‌తో వరుసగా 6, 4 బాదిన యశస్వి 277 బంతుల్లో తొలి ద్వి శతకం సాధించాడు. విశాఖలో ఇంగ్లాండ్ స్పిన్నర్లను యశస్వి ఊచకోత కోశాడు. స్పిన్నర్లపై 223 బంతుల్లోనే ఏకంగా 192 పరుగులు పిండుకున్నాడు. ఇందులో 18 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. 22 ఏండ్ల వయసులో ఈ ఘనత సాధించిన జైస్వాల్.. ఓవరాల్‌గా పిన్న వయస్కులో డబుల్ సెంచరీ బాదిన మూడో భారత బ్యాటర్‌గా నిలిచాడు. రెండో రోజు ఉదయం సెషన్లో 19 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన భారత్ విలువైన 60 పరుగులు జత చేసింది. కొత్త బంతితో జేమ్స్ అండర్సన్ కవ్వించినా.. జైస్వాల్ చూడచక్కని ఇన్నింగ్స్ నమోదు చేశాడు. అశ్విన్ (20) రాణించగా, కుల్దీప్ యాదవ్ (8 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమ్స్ అండర్సన్, షోయబ్ బషీర్, రెహాన్ అహ్మద్ మూడేసి వికెట్లు పడగొట్టారు. 112 ఓవర్లలో భారత్ 396 పరుగులకు ఆలౌటైంది.

ఇంగ్లాండ్‌కు ఓ జట్టు ఓపెనర్లు జాక్ క్రాలీ (76), బెన్ డకెట్ (21, 17 బంతుల్లో 4 ఫోర్లు) శుభారంభం అందించారు. క్రాలీ, డకెట్ ఇద్దరూ దూకుడుగా ఆడారు. తొలి వికెట్‌కు 10.2 ఓవర్లలోనే 59 పరుగులు జోడించారు. నాలుగు ఫోర్లతో ప్రమాదకరంగా మారిన డకెట్‌ను స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ సాగనంపాడు. ఒలీ పోప్ (23) అండతో మరో ఎండ్‌లో జాక్ క్రాలీ కుదురుకున్నాడు. 8 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 52 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. క్రాలీ జోరుతో ఇంగ్లాండ్ 19.3 ఓవర్లలోనే 100 పరుగులు చేసింది. బజ్‌బాల్‌తో దూసుకెళ్తున్న ఇంగ్లాండ్ జోరుకు అక్షర్ పటేల్ అడ్డుకట్ట వేశాడు. శ్రేయస్ అయ్యర్ మెరుపు ఫీల్డింగ్‌తో జాక్ క్రాలీ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు. దీంతో 114 పరుగుల వద్ద ఇంగ్లాండ్ రెండో వికెట్ కోల్పోయింది. ఇక ఇక్కడ్నుంచి పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా రివర్స్ స్వింగ్ మాయ మొదలైంది. జో రూట్ (5)ను రివర్స్ స్వింగ్‌తో బోల్తా కొట్టిన బుమ్రా..టెస్టుల్లో ఎనిమిదోసారి రూట్ వికెట్ పడగొట్టాడు. దీంతో 124/3తో ఇంగ్లాండ్ కష్టాల్లో పడింది. అదే జోరులో తొలి టెస్టు హీరో ఒలీ పోప్‌ను బోల్తా కొట్టించాడు బుమ్రా. బుమ్రా బంతికి ఒలీ పోప్ వికెట్లు చెల్లాచెదురయ్యాయి. జానీ బెయిర్‌స్టో (25) నాలుగు బౌండరీలతో మెరిసినా.. బుమ్రాకు వికెట్ కోల్పోయాడు. 159/5తో ఇంగ్లాండ్ ఫాలోఆన్ ఆడాల్సిన ప్రమాదంలో పడింది. బెన్ ఫోక్స్ (6), రెహాన్ అహ్మద్ (6) వికెట్లతో ఇంగ్లాండ్ 182 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. కానీ కెప్టెన్ బెన్ స్టోక్స్ (47) ఆ జట్టును ఆదుకున్నాడు. ఆఖర్లో వేగంగా పరుగులు సాధించాడు. టామ్ హార్ట్‌లీ (21) సాయంతో ఇంగ్లాండ్‌ను ముందుకు తీసుకెళ్లాడు. బుమ్రా కండ్లుచెదిరే బంతికి స్టోక్స్ వికెట్ గాల్లో ఎగిరింది. తోకను వేగంగా కత్తిరించిన భారత్ 55.5 ఓవర్లలో 253 పరుగులకు ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌కు ముగింపు పలికింది. బుమ్రా ఆరు, కుల్దీప్ మూడు వికెట్లు పడగొట్టగా..అక్షర్ పటేల్ ఓ వికెట్ తీసుకున్నాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 143 పరుగుల భారీ ఆధిక్యం దక్కించుకుంది.

రెండో రోజు ఆట చివర్లో 5 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా రెండో ఇన్నింగ్స్‌లో 28/0తో కొనసాగుతుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (15), రోహిత్ శర్మ (13) పోటీపడి బౌండరీలు బాదారు. యశస్వి మూడు ఫోర్లు బాదగా, రోహిత్ సైతం మూడు ఫోర్లతో చెలరేగాడు. దీంతో భారత్ ఆధిక్యం 171 పరుగులకు చేరుకుంది. ఆట ముగిసే సమయానికి పది వికెట్లు నిలుపుకున్న ఆతిథ్య భారత్.. నేడు మూడు సెషన్ల పాటు బ్యాటింగ్ చేసి భారీ

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : జైస్వాల్ (సి) బెయిర్‌స్టో (బి) అండర్సన్ 209, రోహిత్ (సి) పోప్ (బి) బషీర్ 14, గిల్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 34, అయ్యర్ (సి) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 27, పటీదార్ (బి) రెహాన్ 32, అక్షర్ (సి) రెహాన్ (బి) బషీర్ 27, భరత్ (సి) బషీర్ (బి) రెహాన్ 17, అశ్విన్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 20, కుల్దీప్ నాటౌట్ 8, బుమ్రా (సి) రూట్ (బి) రెహాన్ 6, ముకేశ్ (సి) రూట్ (బి) బషీర్ 0, ఎక్స్‌ట్రాలు : 2, **మొత్తం : (112 ఓవర్లలో ఆలౌట్) 396.**

వికెట్ల పతనం : 1-40, 2-89, 3-179, 4-249, 5-301, 6-330, 7-364, 8-383, 9-395, 10-396.

బౌలింగ్ : అండర్సన్ 25-4-47-3, రూట్ 14-0-71-0, హార్ట్‌లీ 18-2-74-1, బషీర్ 38-1-138-3, రెహాన్ 17-2-65-3.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : జాక్ క్రాలీ (సి) అయ్యర్ (బి) అక్షర్ 76, బెన్ డకెట్ (సి) పటీదార్ (బి) కుల్దీప్ 21, ఒలీ పోప్ (బి) బుమ్రా 23, జో రూట్ (సి) గిల్ (బి) బుమ్రా 5, జానీ బెయిర్‌స్టో (సి) గిల్ (బి) బుమ్రా 25, బెన్ స్టోక్స్ (బి) బుమ్రా 47, బెన్ ఫోక్స్ (బి) కుల్దీప్ 6, రెహాన్ అహ్మద్ (సి) గిల్ (బి) కుల్దీప్ 6, టామ్ హార్ట్‌లీ (సి) గిల్ (బి) బుమ్రా 21, జేమ్స్ అండర్సన్ (ఎల్బీ) బుమ్రా 6, షోయబ్ బషీర్ నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు : 9, **మొత్తం : (55.5 ఓవర్లలో ఆలౌట్) 253.**

వికెట్ల పతనం : 1-59, 2-114, 3-123, 4-136, 5-159, 6-172, 7-182, 8-229, 9-234, 10-253.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 15.5-5-45-6, ముకేశ్ కుమార్ 7-1-44-0, కుల్దీప్ యాదవ్ 17-1-71-3, రవిచంద్రన్ అశ్విన్ 12-0-61-0, అక్షర్ పటేల్ 4-0-24-1.

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 15, రోహిత్ శర్మ నాటౌట్ 13, ఎక్స్‌ట్రాలు :0, **మొత్తం :(5 ఓవర్లలో) 28.**

బౌలింగ్ : జేమ్స్ అండర్సన్ 2-0-6-0, షోయబ్ బషీర్ 2-0-17-0, రెహాన్ అహ్మద్ 1-0-5-0.

రాహుల్, నితేశ్ శతకాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 458/8



హైదరాబాద్ : మిజోరంతో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ కెప్టెన్ రాహుల్ సింగ్ (108, 108 బంతుల్లో 14 ఫోర్లు, 2 సిక్సులు), నితేశ్ రెడ్డి (115, 213 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలతో చెలరేగారు. రాహుల్ సింగ్ ధనాధన్ మెరుపులతో మెరువగా, నితేశ్ రెడ్డి ఆచితూచి ఆడాడు. ప్రజ్ఞయ్ రెడ్డి (91, 107 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) సైతం ఆకట్టుకునే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 116 ఓవర్లలో 458/8 పరుగులు చేసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి కార్తికేయ కక్ (36 బ్యాటింగ్), సాంకేత్ (2 బ్యాటింగ్) అజేయంగా నిలిచారు. రోహిత్ రాయుడు (4/20), కార్తికేయ కక్ (2/37) విజృంభణతో మిజోరం తొలి ఇన్నింగ్స్‌లో 199 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతుంది. నేడు హైదరాబాద్ ఓవర్‌నైట్ డిక్లరేషన్‌తో మిజోరంను రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు ఆహ్వానించే అవకాశం కనిపిస్తుంది.

అష్మితకు నిరాశ

సెమీఫైనల్లో పరాజయం థాయ్‌లాండ్ మాస్టర్స్



బ్యాంకాక్ : థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 300 టోర్నీలో భారత బ్యాడ్మింటన్ వర్థమాన షట్లర్ అష్మిత చాలిహ టైటిల్ వేటకు సెమీఫైనల్లో బ్రేక్ పడింది. క్వాలిఫయర్‌గా మహిళల సింగిల్స్ ప్రధాన పోటీలో అడుగుపెట్టిన అష్మిత వరుసగా స్ఫూర్తిదాయక విజయాలు సాధించింది. నాల్గో సీడ్, థాయ్‌లాండ్ స్టార్ సుపనిదతో సెమీస్ మ్యాచ్‌లో 13-21, 12-21తో వరుస గేముల్లో నిరాశపరిచింది. 35 నిమిషాల్లోనే ముగిసిన సెమీస్‌లో అష్మిత అంచనాలను అందుకోలేదు. నేడు జరిగే టైటిల్ పోరులో సుపనిదతో జపాన్ షట్లర్ అయ ఒహోరి అమీతుమీ తేల్చుకోనుంది.

ఉత్సాహంగా జిమ్నాస్టిక్స్ పోటీలు



హైదరాబాద్ : జంట నగరాల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జాతీయ రిఫరీ ప్రియాంక ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని హేమంత్ జిమ్నాస్టిక్ అకాడమీలో జరిగిన ఈవెంట్‌లో అండర్-4 నుంచి అండర్-6 విభాగాల్లో 300 మంది జిమ్నాస్ట్‌లు పోటీపడ్డారు. భక్తి దసూరి, వేదాన్షి రెడ్డి, క్రిష జైన్, శ్రేయ గోరాయ్, శ్రీయ రావు, విదార్థి వర్మ, శాన్వి యాదవ్‌లు ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచారు.

నవచిత్రం

ముఖ్య గమనిక రిలీజ్‌కి రెడీ



విరాన్ ముత్తంశెట్టి, బన్నీవాసు, లావణ్య

అల్లు అర్జున్ కజిన్ విరాన్ ముత్తంశెట్టి హీరోగా నటిస్తున్న సినిమా 'ముఖ్య గమనిక'. సీనియర్ సినిమాటోగ్రాఫర్ వేణు మురళీధర్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో లావణ్య హీరోయిన్‌గా నటిస్తోంది. శివిన్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా రాజశేఖర్, సాయికృష్ణ నిర్మిస్తున్నారు. లేటెస్ట్‌గా ఈ మూవీ ట్రైలర్‌ను నిర్మాత బన్నీవాసు రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'సినిమాపై మంచి తపన ఉన్న వ్యక్తి విరాన్. చాలా యంగ్ ఏజ్ నుండే మాతో పాటు ట్రావెల్ అవుతూ వచ్చాడు. ఆ తర్వాత నాతో పాటు అల్లు అర్జున్ సినిమా కథలు వినేవాడు. బన్నీకి విరాన్ అంటే ఎంత ఇష్టమంటే ఏదైన కొత్త కథ వినాల్సి వస్తే విరాన్‌ని కూడా పిలవండి అని చెప్పేవారు. విరాన్ హీరో అవుతా అని 9ఏళ్ల క్రితమే నాకు చెప్పాడు..ఈ రోజు తన కల నిజమైంది. ఆడియన్స్ విరాన్‌ని ఆదరిస్తారని నమ్ముతున్నాను. దర్శకుడు వేణు అందరూ కొత్త వారితో సినిమా తీయడం నిజంగా చాలా గ్రేట్..మీ అందరూ తప్పక సక్సెస్ అవుతారని నమ్ముతున్నాను' అని అన్నారు. 'హీరోగా నాకు అవకాశం ఇచ్చిన మా దర్శక, నిర్మాతలకి థ్యాంక్స్. మంచి పాటలతో పాటు అదిరిపోయే ఆర్ ఆర్ ఇచ్చిన మా మ్యూజిక్ డైరెక్టర్ కిరణ్‌కి, ఎంతో సపోర్ట్ చేసిన నా కో-ఆర్టిస్టులు లావణ్య, ఆర్యన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు' అని హీరో విరాన్ ముత్తంశెట్టి అన్నారు. దర్శకుడు వేణు మురళీధర్ మాట్లాడుతూ, 'ఈ రోజు మా టీంకు సపోర్ట్ చేయడానికి వచ్చిన బన్నీవాసుకి మనస్ఫూర్తిగా థ్యాంక్స్. ఈ కథ అనుకున్నప్పుడే హీరో క్యారెక్టర్‌కి విరాన్ అయితే బాగుంటుంది అని అనుకున్నాను. చాలా బాగా చేశాడు' అని తెలిపారు.

నిర్మాతలు రాజశేఖర్, సాయికృష్ణ మాట్లాడుతూ, 'ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాం. అద్భుతమైన విజువల్స్ ఇచ్చిన మా దర్శకుడు వేణుకి, మంచి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇచ్చిన కిరణ్‌కి థ్యాంక్స్. ఈనెల 23న విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.

మెస్మరైజ్ చేసే గ్రాఫిక్ వర్క్‌తో ఆదిపర్వం



మంచు లక్ష్మి

రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్విక్సా ఆర్ట్స్, ఎ.ఐ.ఎస్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో రూపుద్దిద్దుకుంటున్న చిత్రం 'ఆదిపర్వం'. మంచులక్ష్మి ప్రధాన పాత్రలో ఐదు భాషల్లో నిర్మాణం జరుపుకుంటున్న ఈ చిత్రానికి దర్శకుడు సంజీవ్ మేగోటి.

ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ చిత్రం 1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామా. 'అమ్మోరు, అరుంధతి' చిత్రాల మాదిరిగా హై టెన్షన్ యాక్షన్ ఫిలింగా దక్షిణ భారతదేశంలోని అన్ని భాషలతోపాటు హిందీలో కూడా రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఇటీవల విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న 'హనుమాన్' చిత్రం లాగే ఈ సినిమా కూడా అద్భుతమైన సక్సెస్ సాధిస్తుంది. గ్రాఫిక్స్ హైలెట్‌గా అలాగే నాగలాపురం నాగమ్మగా మంచులక్ష్మి నటవిశ్వరూపం చూడవచ్చు' అని తెలిపారు.

'ఈ చిత్రంలో మంచులక్ష్మి పాత్ర చాలా గొప్పగా ఉంటుంది. ఎంతో రిస్క్ చేసి ఆమె రెండు అద్భుతమైన ఫైట్స్ చేశారు. ఇవి చిత్రానికి మరో హైలెట్‌గా నిలుస్తుంది. ఆదిత్య ఓం, ఎస్తర్ నోరోనా, శ్రీజిత ఘోష్, వెంకట్ కిరణ్, సత్యప్రకాష్, సుహాసిని, హ్యారీజోష్, సమ్మెట గాంధీ, జెమినీ సురేష్, యోగికాత్రి, గడ్డం నవీన్, ఢిల్లీరాజేశ్వరి ఇలా చాలా మంచి నటీనటులు తమతమ పాత్రల్లో విజృంభించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేస్తున్న గ్రాఫిక్స్ వర్క్ చివరిదశకు చేరుకుంది. ఒక మంచి ప్రాజెక్ట్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మా దర్శకుడు సంజీవ్ మేగోటి అహర్నిశలు కష్టపడుతున్నారు. క్షేత్ర పాలకుడిగా ప్రత్యేక పాత్ర చేస్తున్న శివకంఠంనేని కూడా అద్భుతంగా చేశారు' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఘంటా శ్రీనివాస రావు తెలిపారు.

చిత్ర సహనిర్మాతల్లో ఒకరైన గోరెంట శ్రావణి మాట్లాడుతూ, 'పోస్ట్ ప్రొడక్షన్ దశలోనే ఈ సినిమా చూసి చాలా హ్యాపీగా, గర్వంగా ఫీల్ అయ్యాను అని చెప్పారు. 'ఇందులో గ్రాఫిక్స్ ప్రాధాన్యతతో పాటు కసికొద్దీ పాత్రలో పరకాయప్రవేశం చేసి ఒప్పించి మెప్పించ గల నటి మంచు లక్ష్మి ఈ చిత్రానికి మరో మంచి ఎస్సెట్. ఈ సినిమా కచ్చితంగా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని సమర్పకులు రావుల వేంకటేశ్వరరావు అన్నారు.

అందర్నీ మెప్పించే లక్కీ భాస్కర్



దుల్కర్ సల్మాన్

హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నటుడిగా దుల్కర్ సల్మాన్ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సినిమా నుండి తాజాగా మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మగధ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్న లుక్‌లో దుల్కర్ కనిపిస్తున్నారు. 80ల కాలం నాటి బొంబాయి(ముంబై) నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోందని మేకర్స్ తెలిపారు.

సినిమా ప్రకటన వచ్చినప్పటి నుండి, ఈ సినిమా అంతా ఒక సాధారణ మనిషి యొక్క అసాధారణమైన ప్రయాణం గురించి అని నిర్మాతలు చెబుతున్నారు. విభిన్న కథతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించడానికి దుల్కర్ సల్మాన్, వెంకీ అట్లూరి శాయశక్తులా కృషి చేస్తున్నారు.

ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. మేకర్స్ ఏ విషయంలోనూ రాజీ పడకుండా, ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'సార్(వాతి)' వంటి ఘన విజయం తర్వాత వెంకీ అట్లూరి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో తెరకెక్కుతోన్న సినిమా కావడంతో.. ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా అద్భుతమైన చిత్రాన్ని అందించాలని నిర్మాతలు భావిస్తున్నారు. ఇది ఎటువంటి సందేహం లేకుండా ప్రేక్షకులను మెప్పించే గొప్ప చిత్రం అవుతుందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది.

మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, మలయాళం, తమిళం, హిందీ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, ఛాయాగ్రాహకుడు: నిమిష్ రవి, కూర్పు: నవీన్ నూలి.

ఈగల్.. స్టయిలీష్ యాక్షన్ ఎంటర్‌టైనర్



టీజీ విశ్వ ప్రసాద్

రవితేజ నటిస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరి స్తున్నారు. కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈనెల 9న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్ర విశేషాలని మీడియాతో షేర్ చేసుకున్నారు.

రవితేజతో మేం 'ధమాకా' చేశాం. అది మాస్ ఎంటర్ టైనర్ అయితే, ఇది చాలా క్లాసిక్ స్టయిలీష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ఇందులో ఎంటర్‌టైన్మెంట్ బేస్ మాస్ ఉంది. కంటెంట్ కూడా అద్భుతంగా ఉంటుంది. ఆడియన్స్‌ని అలరించే చాలా మంచి ఎలిమెంట్స్ ఉన్నాయి. ఖచ్చితంగా ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు. రవితేజ సరికొత్తగా కనిపించబోతున్నారు. కథ, మెసేజ్, యాక్షన్, సాంగ్స్ అన్నీ ఎక్స్‌ట్రార్డినరీ ఉంటాయి.

అలాగే కార్తీక్ ఘట్టమనేనితో ఎప్పటినుంచో నాకు అనుబంధం ఉంది. 'ధమాకా' జరుగుతున్న సమయంలోనే ఈ ప్రాజెక్ట్ ప్లాన్ చేశాం. ఈ సినిమాని అద్భుతంగా తీశారు. మా కాంబోలో మరో సినిమా చేయబోతున్నాం. తొలుత మా సినిమాని జనవరి 13న రిలీజ్ చేయాలను కున్నాం. ఇప్పుడు ఈనెల 9న ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. పరిశ్రమ మేలుని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం. మా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నుంచి ఈ ఏడాది మినిమం 15 సినిమాలు విడుదలౌతాయి. ఇవి పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్నాయి. ప్రొడక్షన్‌లో దాదాపు 6 చిత్రాలు ఉన్నాయి. ఇవి కాకుండా ఈటీవీవిన్ కోసం కొన్ని చిత్రాలు నిర్మాణం అవుతున్నాయి. అలాగే దాదాపు నాలుగు సినిమాలు అమెరికాలో చేస్తున్నాం. ప్రతి నెల మా నుంచి ఒక చిత్రం విడుదల కానుంది. ఈ ఏడాది 50 చిత్రాల మైలుస్టోన్‌ని అందుకుంటామని భావిస్తున్నాం. ప్రభాస్ 'రాజాసాబ్' గురించి తర్వలోనే తెలియజేస్తాం. అలాగే మిగిలిన సినిమాల అప్‌డేట్స్‌ని ఎప్పటికప్పుడు తెలియజేస్తాం.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

సాహిత్య, సాంస్కృతిక ఉద్యమానికి ఐకాన్ గద్దర్

'మూగబోయిన గొంతులో రాగమెవరు తీసెదరు! ఆ జీర బోయిన గొంతులో... జీవమెవరు పోసెదరు! ఆ జానపదం జీవ కణంలో జీవాక్షరాలెవరో... తుపాకులకు ఎదురు నడిచినా తూట నెవరు దాచెదరో..!' తను లేనినాటి కోసం తనకుతాను రాసుకొని పాడుకున్న పాట ఇది. గద్దర్ పేరుతో సాంస్కృతిక యుద్ధరంగ సైని కుడై పోరాడుతున్న గుమ్మడి విఠల్ ఆగస్టు 6న అనారోగ్యంతో మరణించాడు. 74 ఏండ్ల జీవితంలో యాభైయేండ్లు ప్రజాకళా జీవితానికే అంకితమై తెలుగు విప్లవ గీతానికి కొత్త ఒరవడి సృష్టించాడు. గద్దర్ మరణం ప్రజా ఉద్యమ లోకానికి తీరని లోటు. అయితే, సుదీర్ఘకాలం అతివాద వామపక్ష మద్దతుదారుడిగా కొనసాగిన గద్దర్ జీవితంలో ఎన్నో మలుపులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అటు వామపక్ష ఉద్యమం, ఇటు తెలంగాణ ఉద్యమం రెండిటినీ ఉర్రూతలూగించిన పాటలు గద్దర్ సొంతం. తిరుగుబాటునే పేరుగా మార్చుకున్నారు. హిందీ భాషలో గదర్ అంటే తిరుగుబాటు, సైనిక తిరుగుబాటు అనే అర్థాలున్నాయన్న విషయం తెలిసిందే. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో, కమ్యూనిస్టు భావజాలంతో గద్దర్ పార్టీ కూడా పనిచేసింది. ఆ తిరుగుబాటు అనే పదాన్నే తన వృత్తి పేరుగా తీసుకున్నారు గద్దర్.



జనవరి 31న గద్దర్ జయంతిని పురస్కరించుకుని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షనీయం. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఇందుకు సంబంధించిన జీవో కూడా విడుదల చేసింది రాష్ట్ర ప్రభుత్వం. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హెచ్ఎండీఏకు చెందిన 1076 చ.గజాల (9గుంటలు) స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెల్లాపూర్‌లో చౌరస్తాను ఆనుకొని ఉన్న హెచ్ఎండీఏ స్థలంలో ఇటీవల గద్దర్ విగ్రహ ఏర్పాటుకు నిర్మాణ పనులు చేప ట్టారు. అయితే, ఇది సరిపోతుందా గద్దర్ ఈ సమాజానికి చేసిన సేవకి? ప్రజలందరూ ప్రశ్నించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉన్నది. ఆయన జీవితాన్ని ఓసారి పరిశీలిస్తే అనేక విషయాలు అవగతమవుతాయి.

1948లో మెదక్ జిల్లా తూప్రాన్ దగ్గర జన్మించిన గద్దర్ అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు. ఇంజినీరింగ్ చదివారు. మావోయిస్టు పార్టీగా ఏర్పడక ముందు పీపుల్స్ వార్ మద్దతుదారుగా సుదీర్ఘకాలం పనిచేశారు. కొంతకాలం అండర్ గ్రౌండ్‌లో ఉన్నారు. 1975లో బ్యాంకు క్లర్కుగా ఉద్యోగం ప్రారంభించి ఆ తర్వాత ఆ తరువాత ప్రజాజీవితం కోసం జననాట్య మండలి తరపున పనిచేశారు. తన జీవితాంత అనుభవంతో నేర్చుకున్న పాఠంతో సాయుధ పోరాటమే కాదు, ఎన్నికల పోరాటం కూడా అవసరమన్నాడు. విప్లవం జయప్రదం కావాలంటే ఆర్థిక సమస్య ఒక్కటే కాదు, కులవ్యతిరేక పోరాటం కూడా జమిలీగా జరగాలన్నాడు. మార్క్స్, పూలే, అంబేద్కర్లు కూడా కావాలన్నాడు. గద్దర్ కవి, రచయిత, గాయకుడు, సాధారణ నటుడే కాదు సినిమాలలో సైతం పాటలు రాసి నటించాడు. 1980వ దశకంలోనే గద్దర్ సినిమాల్లో కనిపించారు. బి.నర్సింగరావు తీసిన 'మా భూమి' సినిమాలో బండెనక బండికట్టి పాట పాడుతూ ఆ సినిమాలో కనిపిస్తారు గద్దర్. 2009–2014 నాటి తెలంగాణ ఉద్యమంలో గద్దర్ రాసిన "అమ్మా తెలంగాణమా ఆకలికేకల గానమా.." అనే పాట ఎందరినో కదలించింది. 2011లో దర్శకులు శంకర్ తీసిన జైబోలో తెలంగాణ సినిమాలో 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా' పాటకీ అంతే పేరొచ్చింది.

గద్దర్ తెలంగాణకు లేదా తెలుగు రాష్ట్రాలకు పరిమితమైన వాడు కాదు. భారతదేశంలో హిందీ భాషలో ప్రావీణ్యత సంపాదించి దేశమంతా తిరిగారు తన ఆటాపాట మాటలతో అలరించాడు. దక్షిణాఫ్రికా దేశాల్లో తన పాటను వాళ్ళ భాషలో తర్జుమా చేసి పాడి అభిమానులు కూడా వాడుకున్నారు. ఆయన ప్రభావం రోజురోజుకూ పెరుగుతూ యువతను ఉర్రూతలూరిస్తూ ప్రభుత్వాలని సైతం గడగడలాడించింది. ఈ క్రమంలోనే 1997లో గద్దర్ పై హత్యాయత్నం జరిగింది. కొన్ని బుల్లెట్లు ఆయన శరీరంలోనే ఉండిపోయాయి. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలలో ఆయన పాత్ర ఎంతో ఉంది.

గద్దర్‌ను కేవలం కళాకారుడిగానో, నక్సలైట్‌గానో గుర్తించడం పొరపాటు. ఆయన ఏది అన్యాయమనిపిస్తే దానిపై పోరాడిన యోధుడు. అందుకే ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం అణిచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ముందు వరుసలో నిలిచాడు. వర్గ రహిత అభ్యుదయ శక్తుల మధ్య అగాధాలను పూడ్చేందుకు సిద్ధపడ్డాడు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన అనేక పోరాటాల గద్దర్ పాత్ర లేకుండా ఉండదు. అందుకే ఆయనకు సరైన గౌరవం దక్కాలి. ట్యాంకుబండ్‌పై ఒకపక్కన బుద్ధుడు, మరో పక్కన అంబేద్కర్ విగ్రహాలు ఉన్నాయి. అయితే గద్దర్‌కు నెక్లెస్ రోడ్‌లో ఆయన స్మారక మందిరాన్ని నిర్మించాలి. ఆయన పేరిట జానపద సాంస్కృతిక యూనివర్సిటీని ప్రభుత్వం స్థాపించాలి. ఇదే గద్దర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి.

సాంస్కృతిక ఉద్యమానికి ఆయనే సారథ్యం వహించారు. రాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని రప్పించడంలో ఆయన కృషి ఎనలేనిది. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థిగానూ, 2009 మలి దశ ఉద్యమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెట్టి ఆట, పాట, మాటతో ఉద్యమాన్ని ముందుకు నడి పాడు. సుదీర్ఘకాలం ఓటు వ్యతిరేక పోరాటంలో ఉన్న గద్దర్ మొదటిసారి ఓటు వేయడం, కూడా అప్పట్లో పెద్ద వార్తలుగా, చర్చలుగా నిలిచాయి.

జానపద గాయకుడిగా గద్దర్ తన సంగీతాన్ని సామాజిక మార్పుకు సాధనంగా ఉపయోగించాలనే ఆచెంచలమైన నిబద్ధతతో అతని కెరీర్ గుర్తించబడినది. భూసంస్కరణలు, పేదరికం, శ్రామికవర్గ దోపిడీ, కుల వివక్ష, లింగ అసమానత, అణగారిన వర్గాల హక్కులతో సహా అనేక సామాజిక సమస్యలను పరిష్కరించే అనేక పాటలను ఆయన స్వరపరిచారు, ప్రదర్శించారు. అతని పాటలు అట్టడుగు వర్గాల గొంతులకు వ్యక్తీకరణగా ఉన్నాయి. వారి మనోవేదనలను వినిపించడానికి, వారి హక్కుల కోసం పోరాడటానికి అతను తన సంగీతాన్ని ఉపయోగించాడు. గద్దర్ సంగీతం తెలంగాణ, భారతదేశంలోని ఇతర ప్రాంతాల జానపద సాంప్రదాయాలలో కూడా లోతుగా పాతుకుపోయింది. అతను తెలంగాణ జానపద పాటలు, లావణి, గొంధాల్, ఆదివాసుల సాహిత్యం వారి లిబిలో ఇతర జానపద సంగీతం గొప్ప వారసత్వం నుండి ప్రేరణ పొందాడు. తన సందేశాలను తెలియజేయడానికి అనేక రూపాలను ఉపయోగించాడు. అందుకే గద్దర్ సాహిత్య సాంస్కృతిక ఉద్యమానికి ఒక "ఐకాన్"గా నిలిచారు. అతని సంగీతం దాని సరళత, ప్రామాణికత, భావోద్వేగ ఆకర్షణతో వర్గీకరించబడింది.

కమ్యూనిస్టులు, అంబేద్కర్‌వాదులు కలిసి పనిచేయాలన్నాడు. అందుకు లాల్ నీల్ శక్తుల ఐక్యత కీలకమన్నాడు. అదే లక్ష్యంతో తన వెదురు కర్రకు లాల్ జెండాలు నీల్ జెండాలు కట్టుకొని తిరుగుతూ ఉండేవాడు. కమ్యూనిస్టులు ఐక్యం కావాలని బలంగా కోరుకున్నాడు. తాను గతంలో సీపీఐ, సీపీఐ(ఎం)లను శత్రుభావంతో చూసేవాడినని, అది తప్పని గ్రహించానని అందుకు క్షమాపణలు కోరుతున్నానని మార్చి 19, 2017 న సీపీఐ(ఎం) నిర్వహించిన మహాజన పాదయాత్ర ముగింపు బహిరంగ సభలో ప్రకటించాడు. రాష్ట్రంలో ఉన్న అనేక కుల వర్గ సంఘాలన్నిటినీ ఒక వేదిక మీదికి తీసుకురావడంలో తీవ్రమైన కృషి చేశాడు. టి మాస్ అనే పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేయటంలో కీలకపాత్ర వహించాడు. రాజకీయాధికారం కావాలి, బహుజన రాజ్యాధికారం రావాలి అని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నిర్మించడంలో కూడా ఆయన కృషి అద్వితీయమైనది. బహుజన రాజ్యం రావాలంటే ఓటే ఆయుధం కావాలన్నాడు. కొన్ని కులాలకే ఇంకెంతకాలం రాజ్యమని అని ప్రశ్నించాడు?

గద్దర్‌ను కేవలం కళాకారుడిగానో, నక్సలైట్‌గానో గుర్తించడం పొరపాటు. ఆయన ఏది అన్యాయమనిపిస్తే దానిపై పోరాడిన యోధుడు. అందుకే ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం అణిచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ముందు వరుసలో నిలిచాడు. వర్గ రహిత అభ్యుదయ శక్తుల మధ్య అగాధాలను పూడ్చేందుకు సిద్ధపడ్డాడు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన అనేక పోరాటాల గద్దర్ పాత్ర లేకుండా ఉండదు. అందుకే ఆయనకు సరైన గౌరవం దక్కాలి. ట్యాంకుబండ్‌పై ఒకపక్కన బుద్ధుడు, మరో పక్కన అంబేద్కర్ విగ్రహాలు ఉన్నాయి. అయితే గద్దర్‌కు నెక్లెస్ రోడ్‌లో ఆయన స్మారక మందిరాన్ని నిర్మించాలి. ఆయన పేరిట జానపద సాంస్కృతిక యూనివర్సిటీని ప్రభుత్వం స్థాపించాలి. ఇదే గద్దర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి.




మన్నారం నాగరాజు
9550844433

కొత్త ప్రభుత్వానికి కొన్ని సూచనలు...

"ఏ పాలకుడైతే తన నిర్ణయమే తుది నిర్ణయమని భావిస్తాడో అతడు అన్ని రకాల సంక్షోభాలకు కారకుడవుతాడు. ప్రజల అభిమానాన్ని కోల్పోతాడు" అంటాడు శుక్రాచార్యుడు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, మారుతున్న పరిస్థితులకు తగ్గట్లుగా తనను తాను మార్చుకొని ప్రజా సంక్షేమాన్ని కోరే పాలకుడిని ప్రజలు ఎల్లప్పుడు ఆదరిస్తారు. రాచరిక వ్యవస్థను కూలదోసి ప్రజాస్వామ్య విధానాలకు ప్రజలు అలవాటుపడ్డ తరుణంలో అక్కడక్కడ నేటికి కూడా కొద్దిమంది నియంతపాలనకు తెరలేపి అప్రతిష్ఠ మూటగట్టుకొని చివరికి ప్రజల చేతిలో భంగపడి రాజకీయాల నుండి శాశ్వతంగా నిష్క్రమించిన నాయకులను కూడా చూస్తున్నాం. ఇటీవలే రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పాత ప్రభుత్వంను ప్రజలు తిరస్కరించి కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ క్రమంలోనే కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండునెలలు దగ్గర పడుతోంది. గత ప్రభుత్వ ఓటమికి కారణాలు ఎన్ని ఉన్నా ప్రస్తుత ప్రభుత్వ విజయానికి అవన్నీ సానుకూల అంశాలుగా పనిచేశాయి. వెరసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను కొత్త ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం అసంపూర్ణంగా ఉంచిన కొన్ని అంశాలను ఇప్పుడు చర్చిద్దాం.

విద్యా విధానం: తెలంగాణ విద్యా విధానం దేశానికే రోల్ మోడల్ అని ఢంకా బజాయించిన గత ప్రభుత్వం పూర్తిగా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించింది. ప్రయివేటు విశ్వ విద్యాలయాల మీద వున్న శ్రద్ధ ప్రభుత్వ విద్యావిధానం మీద పెట్టలేకపోయింది. ఫలితంగా తెలంగాణలో విద్యావ్యవస్థ గాడి తప్పింది. ప్రాథమిక పాఠశాల నుండి విశ్వ విద్యాలయాల వరకు బోధించేవారు లేక విద్యా సంస్థలు కూనరిల్లిపోయాయి. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు సుమారు 8 వేలు ఉన్నట్లు అధికారుల అంచనా. అదే విధంగా బాలికలకు మూత్రశాలలు, మరుగు దొడ్లు లేని పాఠశాలలు అంటూ ఆ మధ్య కాలంలో పత్రి కలలో పతాక శీర్షికల్లో చదివాం. ఇటీవలే హైకోర్టు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సరూర్ నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలబాలికలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు కట్టించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. అంతెందుకు ఆదిలాబాద్, యదాద్రి భువనగిరి జిల్లాలో నేటికి కొన్నిచోట్ల బడికి వెళ్ళాలంటే వాన కాలంలో వాగులు, పిల్లకాలువలు దాటుకుంటూ వెళ్తున్న పిల్లల్ని చూస్తూనే ఉన్నాం. "గురువులేని విద్య రాణించదు" అన్న ట్లు, పాఠశాల స్థాయి నుండి యూనివర్సిటీల వరకు ఖాళీగా వున్న అన్ని టీచర్ పోస్టులను తక్షణమే భర్తీచేసి విద్యార్థు లకు నాణ్యమైన విద్యనందించాలి, ప్రయివేటు విద్యపై నిరం తరం నిఘా, నియంత్రణ, పర్యవేక్షణ చేయాలి. స్కాలర్షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంటు, హాజరు శాతం 75శాతం పైగా ఉన్న వారికే ఇవ్వాలి. లేని పక్షంలో నిధుల దుర్వినియోగం జరిగే ఆస్కారం వుంది. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించి, తల్లిదండ్రులను ఆ దిశగా చైతన్యం చేయాలి. హాస్టళ్లలో కూడా మెరుగైన సదుపాయాలు రుచికరమైన భోజన సదుపాయాలు కల్పించాలి. "ఉత్తమ విద్యావిధానం ఉన్నచోట, ఉత్తమ సమాజం నిర్మించబడుతుంది" అంటాడు అరిస్టాటిల్. అలాంటి సమాజ నిర్మాణానికి తరగతి గది కేంద్ర బిందువు కావాలి. ఉత్తమ విద్య ద్వారానే ఉపాధి కల్పన, సృజనాత్మక ఆలోచనలు, విలువైన మానవవనరులు, ఉద్యోగావ కాశాలు మెరుగుపడతాయి. పక్కా ప్రణాళికతో కూడిన మంచి విద్యా విధానమే మొత్తం సమాజాన్ని ప్రభావితం చేస్తుందనేది గమనించాలి.



ఉద్యోగాల కల్పన, పథకాల సమీక్ష: గత ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా బిస్వాల్ కమిటీ రాష్ట్రంలో ఒక లక్ష తొంభై ఏడు వేల ఉద్యోగాలు ఖాళీగా వున్నాయని నివేదికను ఇచ్చినట్లు సాక్షాత్తూ గత ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం దశలవారీగా వాటన్నింటిని భర్తీచేసి వివిధ శాఖల పనితీరును పటిష్ఠం చేయాలి. గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4, డిగ్రీ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, పాలిటెక్నిక్ లెక్చరర్లు, టీచర్ పోస్టులు, ఇతర శాఖలకు సంబంధించిన అన్ని రకాల పోస్టులను తక్షణమే గుర్తించాలి. టీఎస్పీఎస్సీకి కొత్త ఛైర్మన్, సభ్యులనైతే నియమించారు. కానీ గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన ధరణి, రైతుబంధు, దళిత బంధు, బెల్టు షాపులు మొదలగు పథకాలు విచ్చలవిడిగా వున్నా మద్యం దుకాణాలను దశలవారిగా తగ్గించే ప్రయత్నం చేయాలి. ప్రజల్ని మందుబాబులుగానో, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు చేసి రెవిన్యూ రాబట్టుకోవాలనుకోవడం సమంజసం కాదు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రభుత్వం కూడా సుస్థిరంగా ఉన్నట్లు భావించాలి. ప్రజలు ఇబ్బందులకు గురైతే ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తారు. కాబట్టి ప్రజలకు లేదా యువతను వారి స్వశక్తి మీద ఆధారపడి జీవించేలా ఉపాధి కల్పన కేంద్రాలు నెలకొల్పి శిక్షణనివ్వాలి.

అభివృద్ధి, సంక్షేమం : ప్రాంతం ఏదైనా కావచ్చు, వ్యవసాయకంగా, పారిశ్రామికంగా, వెనుకబడిన ప్రాంతాలైన ఆదిలాబాద్, మహబూబ్ నగర్ మొదలైనవి, ఇతర జిల్లాలకు కూడ సమాన భాగస్వామ్యం కల్పించి, జాతీయ స్థాయి ప్రాజెక్టులు, అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులు వచ్చే విధంగా కృషిచేసి వెనుకబడ్డ ప్రాంతాలకు అభివృద్ధిలో సమాన భాగస్వామ్యం కల్పించాలి. రోడ్లు, పాఠశాలలు, వైద్యశాలలు, పేదలకు ఇండ్లు, తాగునీరు, కరెంటు సదుపాయం కల్పిస్తే సహజం గానే ఆ ప్రాంతంలో మెరుగైన సౌకర్యాలు అందుతున్నట్లుగా భావించాల్సి వుంటుంది. గత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కొంతమేరకు చేసినప్పటికి చాలా విషయాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినందువల్ల ప్రస్తుత ప్రభుత్వం ఆ లోటును భర్తీచేస్తూ అభివృద్ధిలో సబ్బండ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేండ్లు కావస్తున్న సందర్భంగా ప్రాంతాల వారిగా చేయాల్సినవి పురోగతిలో ఉన్నవి, పూర్తిగా పెండింగ్‌లో వున్నవి ఇలా విభజించుకుని ప్రాధాన్యతా రంగాలను బట్టి నిధులు కేటాయించి దశలవారిగా అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని మళ్లించాలి ఈ విషయంలో ప్రతిపక్షాల నిర్మాణాత్మకమైన సూచనలు, సలహాలు స్వీకరించి అధికారపక్షం పాటించాలి, అమలు చేయడానికి కృషిచేయాలి. ప్రతిపక్షాలంటే శత్రుపక్షం అన్న భావన అధికార పక్షం తొలగించుకోవాలి.

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు శ్రీకారం చుట్టారు. అయితే మిగిలిన పథకాలకు ఎంతమంది అర్హులు, ఎంత ఖర్చు అవుతుందనేది? రెవిన్యూ ఆదాయం ఎంత, వ్యయం ఎంత అనేది అధికారికంగా అంచనాలు రూపొందించి దశలవారీగా సంక్షేమ పథకాలు అమలు చేయాలి. లేనిపక్షంలో గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీలు చెల్లించడానికి రాష్ట్ర రెవిన్యూ ఆదాయం సగం పైగా వెళ్తుందని అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయ్. ఈ అపోహలపై పూర్తిగా ఒక సమగ్ర నివేదికను తయారు చేసి ప్రజలకందివ్వాలి. "వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించేది ఉత్తమ ప్రభుత్వం ప్రజల హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించి వారి లో రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందిచుట ద్వారా సంపూర్ణ వికాసానికి తోడ్పడే ప్రభుత్వం ఉత్తమమయినదని" బ్రిటిష్ తత్త్వవేత్త జాన్ స్టువర్ట్ మిల్ అంటాడు. తెలంగాణ సమాజం ఎన్నో నిర్బంధాలను, బలిదానాలను, అవమానాలను భరించింది, ఇకముందు అలా జరుగకుండా ఇకనైనా ప్రజాకాంక్ష మేరకు కొత్త ప్రభుత్వం పాలన కొనసాగాలి.




- డా.మహ్మద్ హసన్, 9908059234

వేదకాలంలో మొదటిగా ఇనుమును ఉపయోగించిన ప్రాంతం

వేద కాలం

ఋగ్వేద కాలం (తొలివేద కాలం)



1. వేదం అంటే జ్ఞానం అని అర్థం (విద్ అంటే గ్రహించడం అని అర్థం.
2. వేదాలను బ్రాహ్మణులు కేవలం మౌఖికంగా పలుకుతూ శతాబ్దాల తరబడి నిక్షిప్తం చేశారు.
3. వేదాలకు గుప్తుల కాలంలో వ్రాత రూపం కల్పించి వుండవచ్చును.
4. క్రీ.పూ 1800 సంవత్సరాల తరువాత సింధూనది వరదల వలన లేదా ఆర్యులు దండయాత్రల వలన హరప్పా సంస్కృతి వారి నగరాలు నశించి వుండవచ్చని చరిత్ర కారులు అభిప్రాయ పడుతున్నారు.
5. క్రీ.పూ 2000–1500 మధ్యకాలంలో ఆర్యులు భారతదేశం చేరారు.
6. మొదట ఆర్యులు పంజాబ్, సింధు ప్రాంతాలలో స్థిరపడ్డారు.
7. ఆర్యులు సింధు ప్రజలను దస్యులు గా పిలిచారు.
8. శబ్ద పరంగా ఆర్యన్ అంటే ఉత్తమ జన్మ అని అర్థం.
9. ఆర్యన్ అనే పదం భాష, జాతిని రెండింటినీ సూచిస్తుంది.
10. ఎక్కువ మంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారకం ఆర్యుల జన్మభూమి మధ్య ఆసియా.
11. బాలగంగాధర్ తిలక్ అభిప్రాయం ప్రకారం ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం వారు.
12. "The Arcitic home in Vedhas" గ్రంథ రచయిత బాలగంగాధర్ తిలక్.
13. గంగా యమునా అంతర్వేదిలో విలసిల్లిన పెయింటెడ్ గ్రేవర్ సంస్కృతికి నిర్మాతలు – ఆర్యులు.
14. స్వామి దయానంత సరస్వతి ప్రకారం ఆర్యుల జన్మస్థానం – టిబెట్
15. ఆర్యులు భాషా – సంస్కృతి (నేడు ఉత్తర భారత దేశంలో హిందీ, పంజాబీ, బెంగాలీ మొదలైన చాలా భాషలు సంస్కృతం నుంచి పుట్టాయి అందుకే వాటిని ఆర్య భాషలు అంటారు.)
16. భారత మరియు ఐరోపా సమ్మిళితం అయిన భాషలో లభించిన మొట్టమొదటి ప్రతి – ఋగ్వేదం.
17. ఆర్యులు భారతదేశంలో స్థిరపడ్డాక వారు కూర్చిన గ్రంథాలు – వేదాలు.
18. వేదాలు 4 అవి
    1.ఋగ్వేదం
    2. సామవేదం
    3. యజుర్వేదం
    4. అదర్వణ వేదం
    మొదటి మూడింటిని త్రయ లేదా వేదాల త్రిపీఠిక అంటారు.
19. వేదాలలో మొదటిది మరియు పురాతనమైనది – ఋగ్వేదం
20. ఋగ్వేద కాలాన్ని తొలి వేద కాలం (1600–1000) అంటారు.
21. ఋగ్వేదాన్ని క్రీ.పూ 1500–1000 మధ్య వెలువరించారు.
22. ఋగ్వేదంలోని సంస్కృత భాష జెండ్ అవెస్తా లోని పాత పర్షియన్ భాషకు దగ్గరగా వుంటుంది.
23. ఆర్యుల గురించి తెలిపే అత్యుత్తమ ఆదారం – ఋగ్వేదం.
24. జన (తెగ)ను 'విష్'లుగా విభజించారు. ఈ పదం ఋగ్వేదంలో '171' సార్లు వస్తుంది.
25. విష్‌లను 'గ్రామాలుగా' విభజించారు.
26. ఋగ్వేద కాలంలో స్త్రీలు సభా, విధాత లకు హాజరయ్యేవారు.
27. గాయత్రి మంత్రం ఋగ్వేదంలో కలదు.
28. వడ్డీ వ్యాపారం రుగ్వేద కాలం నుంచి కలదు.
29. ఋగ్వేద కాలంలో సేవించే పానియం – సోమపానం
30. ఋగ్వేద కాలం నాటి బంగారు నాణెం – నిష్క
31. విశ్వ జననం గురించి రేగ్వేదంలో 10వ మండలంలో కలదు.
32. ఋగ్వేద కాలం నాటి ఆర్యులకు చదవడం, రాయడం రాదు.
33. ఋగ్వేదంలో ఆర్యులు దాస్యులు (ఆర్వేతరులు) మధ్య తేడా తెలుపుతూ రంగును వివరిస్తూ వర్ణ అనే పదాన్ని వాడారు.
34. నిరూక్తమును రాసింది – యస్కుడు.
35. వ్యాకరణ శాస్త్రాన్ని రాసింది – పాణిని
36. చందోవిచితిని రాసింది – పింగళుడు.
37. ఋగ్వేద కాలంలో రాజునకు ప్రజలు చెల్లించే రక్షణ సుంకం – బలి.
38. వేదాంగాలు 6 ఇవి సూత్రాల రూపంలో వుంటాయి.
39. ప్రాచీన కాలంలో ధర్మ సూత్రాలు మనుధర్మ శాస్త్రం పై ఆధారపడి వుండేవి.
40. వేదాంగాలలో ఒకటైన కల్ప సూత్రాలను అనుసరించి మనుధర్మ శాస్త్రం రాయబడింది.
41. ఆర్యులు ఇరాక్‌లో వేసిన శాసనాలు బోగజ్‌కై అనే చోట 'కస్పెటి' 'మిటాని' శాసనాలు.
42. ఆర్యుల కాలంలో రాజరికం తెగలకు సంబంధించిన వ్యవస్థ రాజు తెగలకు అధిపతి. రాజన్ అని పిలిచేవారు.
43. తెగలను 'జన' అని పిలిచేవారు.
44. ఋగ్వేదంలో జన గురించి '275 సార్లు' ప్రస్తావన కలదు. కాని జనపదాల గురించి ప్రస్తావన లేదు. రాజ్యం గురించి ఒకసారి మాత్రమే ప్రస్తావించారు.
45. రాజుకు సహాయ పడేందుకు సభా, సమితి అనే ప్రజా సభలు వుండేవి.
46. రాజు పరిపాలనకు ముఖ్య సహాయకారి – పురోహితుడు లేదా చాప్లాయిన్
47. ఋగ్వేద కాలంలో ఏనుగులను యుద్ధాలకు వాడలేదు.
48. ఋగ్వేదంలో సరస్వతి నదికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.
49. సరస్వతి నది కొత్త పేరు ఘగర్ లేదా చితాంగ్ (ఋగ్వేదంలో పాత పేరు సరస్వతి)
50. ఆర్యులు ప్రధానంగా 2 రకాల యుద్ధాలు చేసేవారు.
    1. ఆర్యులు కంటే ముందు వారితో యుద్ధం చేసేవారు.
    2. వారిలో వారే యుద్ధం చేసుకొనేవారు.
51. ఆర్యులు ప్రధానంగా 2 వర్గాలుగా వుండేవారు.
    ఒక వర్గం శ్రీనజాయులు, భరతులు
    2వ వర్గం యాదులు, తుర్వాసులు, ద్రుహియులు, పురులు వుండేవారు.
52. రావి జలాలు పంపిణీ విషయమై ఇరు వర్గాలుకు రావి నది ఒడ్డున యుద్ధం జరిగింది. (రావి ప్రరుష్ని)
53. ఈ యుద్ధంలో భరతులు అనే తెగ ఇతర 10 తెగలతో యుద్ధం చేసి సూడస్ నాయకత్వంలో భరతులు యుద్ధంలో గెలిచారు.
54. పై యుద్ధంను ధశరాజ్ఞ లేదా పది మంది రాజులు యుద్ధం అని ఋగ్వేదంలో వివరించబడింది.
55. పై యుద్ధంలో గెలిచిన భరతులు పేరు మీదనే మన దేశానికి భారతదేశం అని పేరు వచ్చింది. యుద్ధ విజేత సుదాముడు.
56. ఋగ్వేదం ప్రకారం ఆర్యులు మొట్టమొదట భారతదేశంలో సప్త నదులు ప్రాంతం (సప్త సింధు)లో నివాసం ఏర్పరచుకొన్నారు.
57. ఋగ్వేద కాలం నాటి ఆర్యులు పశుసంపద, వ్యవసాయంపై ఆధారపడేవారు.
58. ఋగ్వేదం మొదటి భాగంలో నాగలి గురించి ప్రస్తావన వుంది.
59. ఋగ్వేద కాలం నాటి ఆర్యులు ప్రదాన ఆహారం యువలు (బార్లీ)
60. ఋగ్వేద కాలంలో ప్రధాన ఆస్తి – పశుసంపద
61. ఋగ్వేదంలో ఆవుల గురించి ప్రస్తావన 176 సార్లు వస్తుంది.
62. ఋగ్వేద కాలంలో ప్రధానంగా యుద్ధాలు ఆవుల గురించి జరిగేవి. ఈ యుద్ధాలను గవిస్తి అనేవారు.
    (గవిస్తి అంటే ఆవుల కోసం వెదకడం అని అర్థం)
63. దాహితి అంటే ఆవుపాలు పితికేది మరియు కూతురు అని అర్థం.
64. అఘున్య అంటే గోవులను చంపరాదని అర్థం.
65. గోఘున అంటే గోవులను చంపేవాడని అర్థం.
66. అయస్ అంటే రాగి లేదా కంచు అనే అర్థం వస్తుంది.
67. ఋగ్వేద కాలంలో ఆర్యులు వాణిజ్యం చేసేవారు కాదు దీనికి తగిన ఆధారాలు లేవు.
68. రుగ్వేద ప్రజలకు సముద్రం గురించి తెలియదు. వీరికి సముద్రం అంటే జలాశయం అని మాత్రమే తెలుసు.
69. ఋగ్వేద కాలం నాటి పన్నులు – బలి, బాగ, సుల్క
70. ఋగ్వేద కాలం నాటి ఆర్య రుషులు – విశ్వామిత్ర, వశిష్ఠ
71. ప్రాచీన కాలంలో జ్యోతిష్య శాస్త్రజ్ఞులు – లగుదుడు, గర్గుడు.
72. ఋగ్వేద కాలం నాటి ప్రజాభిప్రాయ సంస్థలు – 4 సభ, సమితి, గణ, విధాన (పురాతన గిరిజన అసెంబ్లి)
73. ఋగ్వేదంలో వర్ణ వ్యవస్థ గురించి పురుష సూక్తంలో మొదటిసారిగా కన్పిస్తుంది.
74. ఆర్యుల (తొలివేదకాలం)కు గుర్రం ఉపయోగించడం తెలుసు.
75. దశ రాజుల యుద్ధంలో భరతుని పక్కన ఉన్న రుషి – విశ్వా మిత్రుడు.
76. ఋగ్వేదంలో 10వ మండలంలో మొదటిసారిగా 'శూద్రా' అనే పదం కన్పిస్తుంది.
77. వేదకాలంలో మొదటిగా ఇనుమును ఉపయోగించిన ప్రాంతం – గాంధార
78. ఋగ్వేద కాలంలో దేవాలయాలు, విగ్రహారాధనలు లేవు.
79. తొలి వేద కాలంలో సమాజంలో సభ్యులందరికీ సంపదను పంపిణీ చేసే సభ – గణ.
80. యుద్ధంలో పాల్గొన్న 10 తెగలలో 'పురు' వంశస్థులు ముఖ్యమైన వారు. వీరు భరతులతో కలిపి 'కురువులు'గా అవతరించారు.
81. ఈ కురువంశంలోని పాండవులు, కౌరవుల మధ్య యుద్ధమే మహాభారత యుద్ధం (కీ.పూ.950)
82. ఆర్యుల కుటుంబ వ్యవస్థ – పితృస్వామ్య వ్యవస్థ.
83. ఋగ్వేదంలో 1028 శ్లోకాలు ఉన్నాయి. ఇందులో ఇంద్రుడిని కీర్తిస్తూ 250 శ్లోకాలు వున్నాయి.
84. ఋగ్వేదంలో వర్ణించిన స్త్రీ దేవతలు – అదితి, ఉషస్.
85. సామవేదంలో 1603 శ్లోకాలు వున్నాయి. భారతీయ సంగీత మూల బీజాలు సామవేదంలో కన్పిస్తాయి.
86. యజ్ఞాలు నియమ నిబంధనలు, ప్రకృతిని వశపర్చుకోవడం లాంటి విషయాలు యజుర్వేదంలో కలవు.
87. రోగాలు నయం చేయడం దుష్ట శక్తులను పారద్రోలడంకు అవసరమగు మంత్ర తంత్రాలు అదర్వణ వేదంలో కలవు. (ఇది ఆర్యులది కాదనే వాదన వుంది)
88. ఉపనిషత్తులు 108 కలవు.
89. వేద సాహిత్యాన్ని శృతి అని వేదాంగాలను స్మృతి అని అంటారు.
90. ఋగ్వేదంలో మొత్తం మంత్రాలు – 1071
91. ఋగ్వేద కాలం నాటి ప్రసిద్ధ కవయిత్రులు – గార్గి, లోపముద్ర
92. వస్తు మార్పిడి పద్ధతిలో ఆర్యులు వాడిన సాధనాలు – బంగారము, ఆవు.
93. ఆర్యుల ప్రధాన వినోద కాలక్షేపం – రథపు పందేలు.
94. చాతుర్వర్ణ వ్యవస్థ ప్రధానంగా రుగ్వేదంలో కలదు.
95. వేదకాలంలో గ్రామాధికారిని గ్రామిణి అనేవారు.
96. వేదకాంలో కులపెద్దను కులాపా అనేవారు.
97. ఋగ్వేద కాలంలో వాణిజ్యం ఫణి అనే అనార్యజాతి చేసేవారు.
98. ఆర్యుల నాణాలు – నిష్క, శతమాన, సువర్ణ, కార్ష, పణ
99. ఆర్యుల వంశం – నార్డిక్ జాతి.
100. ఆర్యుల కాలంలో ప్రయాణ సాధనాలు – ఎడ్ల బళ్ళు, రథాలు
101. ఆర్యుల కాలంలో శిక్షా విధానం – దేశ బహిష్కరణ, అంగ విచ్ఛేధనం.
102. ఆర్య భాష అయిన సంస్కృతంలో సుమారు 450 ద్రావిడ పదాలు కలవు.
103. ఋగ్వేదంలోని 10 భాగాలలో 2 నుంచి 7 వరకు ప్రాచీనమైనవి.
104. తొలివేద కాలం చివరి దశలో ఏర్పడ్డ వర్ణం – శూద్రులు.
105. వేద కాలం నాటి 'సూప శాస్త్రం' వంటలకు సంబంధించినది.
106. వేదకాలంలో దాన్యాన్ని వ్రిహి అని పిలిచేవారు.
107. ఋగ్వేదంలో 9వ మండలం పూర్తిగా సోమ దేవుడు గురించి కలదు. 'సోమ' అనగా ఒక వృక్షం నుంచి వచ్చే పానీయం. తరువాత కాలంలో చంద్రుడిగా, వృక్షాలకు రాజుగా గుర్తించారు.
108. ఋగ్వేదంలో 259 శ్లోకాలు ఇంద్రుడు గూర్చి కలవు. ఇతడు యుద్ధ దేవత (ఆయుధం – వజ్రాయుధం)
109. ఋగ్వేదంలో 200 శ్లోకాలు అగ్ని దేవుడు గూర్చి కలవు. ఇతడు దేవతలకు మానవులకు మధ్య వారధి.
110. ఋగ్వేద కాలంలో భూములపై అధికారం కల అధికారి – ప్రజాపతి.
111. ఋగ్వేద కాలంలో వివాదాలు పరిష్కరించే అధికారి – మధ్యయస్తి.
112. ఋగ్వేదంను తెల్పినది హోత్రి అనే పురోహితుడు.



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545